ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam, Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,
26-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 115 పేజీలు: 16 వెల: 6.50

## సుంకాలు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టం

## ట్రక్కు ప్రమాదంలో 15 మంది దుర్మరణం

5లో



సోమవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మునుంచి పద్మవిభూషణ్ పురస్కారం ధర్మేంద్ర తరపున అందుకుంటున్న హేమమాలిని, డా. శ్రీమతి రాజం, పద్మశ్రీ పురస్కారాలు అందుకుంటున్న డా. వెంపటి కుటుంబ శాస్త్రి, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ తరపున ఆయన తనయుడు

# వికసించిన 'పద్మా'లు

### తొలివిడతగా 66 మందికి ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**పద్మవిభూషణ్: దివంగత నటుడు ధర్మేంద్ర (గ్రహీత హేమమాలిని), వయొలిన్ విద్వాంసురాలు డా. శ్రీమతి ఎన్. రాజం పద్మభూషణ్: డా. ఆర్. గణేశ్, భగత్ సింగ్ కోష్యారి, ఉదయ్ సురేష్ కుమార్ కోటక్, ప్రొ. విజయ్ కుమార్ మల్హోత్రా, డా. కళ్లిపట్టి రామస్వామి, పీయూష్ పాండే పద్మశ్రీ: డా. వెంపటి కుటుంబ శాస్త్రి, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం), హార్మన్ ప్రీత్ కౌర్, డా. గూడూరు వెంకట్రావు, దీపికా రెడ్డి, డా. ఎస్. జి. సుశీలమ్మ సహా 58 మందికి ప్రదానం**

**న్యూఢిల్లీ, మే 25:** కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా ప్రధానంచేసే పద్మా అవార్డుల కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పద్మ పురస్కారాలప్రధానం జరిగింది. బాలివుడ్‌నటుడు ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్ రాగా ఈ పురస్కారం ఆయన సతీమణి ఎంపి హేమమాలిని అందుకున్నారు. కళారంగంలో పద్మవిభూషణ్‌ను ప్రముఖ వయోలిన్ విద్వాసురాలు ఎన్‌రాజమ్ అందుకుంటే రాజకీయాలపరంగా ప్రజాజీవితనుంచి మాజీఉత్తరాఖండ్ సిఎం భగత్‌సింగ్ కోశ్యారి, వైద్యరంగంనుంచి గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ కళ్లిపట్టి రామస్వామి పళనిస్వామి, కోటక్‌మహీంద్ర బ్యాంకు వ్యవస్థాపకులు ఉదయ్ సురేష్‌కుమార్ కోటక్ మహిళా క్రికెట్‌జట్టు సారథి హర్మన్‌ప్రీత్‌కౌర్ తదిత రులు ఈ ప్రతిష్టాత్మక పౌరపురస్కారాలు అందుకున్నారు. >>2

## ప్రజలకు సేవలు సులభంగా అందేలా బిజినెస్ రూల్స్ మారుద్దాం: సిఎం

2లో

# మరిన్ని ఎంఎస్ఎంఇ పార్కులు

38 పారిశ్రామిక పార్కులను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎం చంద్రబాబు

అంబేద్కర్ కళావేదికను ప్రారంభించిన సిఎం

రూ.200కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

**సిఎం సమక్షంలో మెటా, అమెజాన్ సహా పలు సంస్థల ఒప్పందాలు**



సోమవారం వివిధ సంస్థలతో సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు చేసుకొంటున్న దృశ్యం. చిత్రంలో మంత్రి కొండపల్లి

**విజయవాడ,మే25, ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈ వ్యవస్థేనని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీలో వనరులు వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎంఎస్ఎంఈ పాలసీతోపాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం వెల్లడించారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదిక పైకి వచ్చాయన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సీఎం సూచించారు విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. రాష్ట్రంలో మరో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసారు. అంతకుముందు 4.4 ఎకరాల్లో 1.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి ప్రారం భించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఒకేసారి 1500 మంది హాజరై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెషన్ సెంటర్ నిర్మించటం సంతోషమన్నారు. అమరావతిలోనూ ఈ తరహా కన్వెన్షన్ సెంటర్లను నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లు నిర్మించనున్నట్టు సీఎం తెలిపారు. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న వెసులుబాట్లను, చేయూతను ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం >>2




## నాలుగోసారి పెట్రోషాక్

**పెట్రోలుపై రూ. 2.84, డీజిల్‌పై రూ. 2.86 పెంపు**

| నగరం | పెట్రోలు | డీజిల్ |
| --- | --- | --- |
| విజయవాడ : | రూ. 117.19 | రూ.104.88 |
| హైదరాబాద్ : | రూ.115.58 | రూ. 103.74 |
| చెన్నై : | రూ. 107.77 | రూ. 99.55 |

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చమురు సంస్థలు మరోసారి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదొడుకుల నెపంతో సామాన్యుడి నడ్డి విరిచేలా ఇంధన ధరలను మరోసారి భారీగా పెంచేశాయి. గత పది రోజుల వ్యవధిలోనే ధరలు పెరగడం ఇది నాలుగో సారి కావడం గమనార్హం. వరుస పెంపులతో ఇప్పటికే ఇబ్బంది పడుతున్న వాహనదారులపై ఈ తాజా నిర్ణయం మరింత భారంగా మారనుంది. చమురు మార్కెటింగ్ కంపెనీలు శరవేగంగా రేట్లను సవరిస్తూ ఈ తాజా వాత పెట్టాయి. సోమవారం ప్రకటించిన ఇందన సవరణల ప్రకారం లీటర్ పెట్రోల్‌పై రూ.2.84 పెంచగా, లీటర్ డీజిల్‌పై >>2



# గుణపాఠం నేర్చుకోరా?

## 'నీట్' లీక్‌పై సుప్రీం ఆగ్రహం

### కేంద్రం, ఎన్‌టిఎకు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 25:** నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో, నీట్‌యుజి 2026 పరీక్ష నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు కోరుతూ, తక్షణమే కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానానికి మారాలని డిమాండ్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ), ఇతర అధికారులకు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, అలోక్ >>2



# కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

రాజమహేంద్రవరంలో పుష్కరఘాట్ నుంచి కోటిలింగాల వరకు ఏర్పాట్లు పరిశీలించిన డి.సిఎం పవన్

కాలుష్య నివారణ చర్యలపై నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

ఆంధ్రాపేపర్ జలాలు గోదావరిలోకి విడుదలవుతున్న తీరుపై ఆరా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,మే 25,ప్రభాతవార్త:** కాలుష్య రహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. సోమవారం రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాల పనులను పుష్కర్ ఘాట్ నుంచి కోటిలింగాల ఘాట్ వరకు బోటులో పర్యటించి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నదిలోకి కలిసే కాలుష్య కారక వ్యర్థాలు జలాలు వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఇప్పటివరకు తీసుకుంటున్న చర్యలు ఎంతవరకు వచ్చాయని భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ఉన్నత అధికారులను తూర్పుగోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. గోదావరి గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. చింతలమ్మ ఘాట్ వద్ద నల్ల ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్య తీరును స్వయంగా పరిశీలించి నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదావరిలోకి రోజువారి సుమారు 55ఎంఎల్డి మురుగునీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. మురుగునీటి శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలని మురుగునీటి నేరుగా గోదావరిలకి వదలడంవల్ల జలాలు కాలుష్యం అవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్ర పేపర్ జలాలు గోదావరిలోకి విడుదల అవుతున్న తీరుపై పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య నుంచి వివరాలు అడిగి ప్రస్తుతం పేపర్‌మిల్లు ద్వారా బయటకు వచ్చే వ్యర్థాలను దూరంగా లం కల్లో విడిచి పెడుతున్నారని దీనికి ప్రత్యేకంగా ఆ కంపెనీ >>2

# వడ దెబ్బకు మరో 24 మంది బలి

కృష్ణా జిల్లా కంకిపాడు, పెనమలూరు గరిష్ట ఉష్ణోగ్రత $48.1^{0}$

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హితవు



**విజయవాడ,మే 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరింది. వడగాల్పులు అధికంగానే ఉన్నాయి. ప్రాథమిక సమాచారాన్ని అనుసరించి నేడు 24 మంది వడదెబ్బకు మృతి చెందారు. వీరిలో అత్యధికం 16మంది ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఉన్నారు. విజయవాడలో ఇద్దరు వడదెబ్బకు పాదచారుల బాటలో మరణించి ఉండగా పోలీసులు గుర్తించారు. ఏలూరు, విశాఖ ,శ్రీకాకుళం, మన్యం జిల్లా ఇద్దరేసి చొప్పున వడదెబ్బకు గురయి మరణించారు. అధికారికంగా ఈ మరణాలను ధృవీకరించలేదు, సోమవారం కూడా ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదయ్యాయి. సోమవారం కృష్ణా జిల్లా కంకిపాడు, పెనమలూరు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 48.1 డిగ్రీలు, బాపట్ల జిల్లా కూచినపూడిలో 46.4 డిగ్రీలు నమోదైనట్లు పేర్కొన్నారు. 14 జిల్లాల పరిధిలోని 115 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా పల్నాడు 20, కృష్ణా 18, బాపట్ల 17, ఏలూరు 13, ఎన్టీఆర్ 13, గుంటూరు 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందన్నారు. బాపట్ల జిల్లా కూచినపూడిలో 46.4డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, పల్నాడుజిల్లా పిడుగురాళ్లలో 46.3డిగ్రీలు, ఏలూరుజిల్లా కుక్కునూరు, పోలవరంజిల్లా కూనవరంలో 46.1, పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిలో 45.7, ప్రకాశం(జి) కొప్పెరపాడు 45.4,కోనసీమ(జి) శివల, కాకినాడ(జి)కాజులూరులో 45.2, గుంటూరుజిల్లా మంగళగిరిలో 44.9, మార్కాపురంజిల్లా >>2



## ఎంపి కేశినేని చిన్ని భార్యకు ఇడి నోటీసులు

ఎపి లిక్కర్ స్కాం కేసు

27న విచారణకు హాజరు కావాలని ఆదేశం

**విజయవాడ,మే 25,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తన విచారణను మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) భార్య కేశినేని జానకి లక్ష్మికి ఈడీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈనెల 27న ఢిల్లీలోని ఇడి ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని తాజా సమన్లలో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కేసిరెడ్డితో జానకి లక్ష్మికి ఉన్న వ్యాపార సంబంధాలు, >>2

పెనుకొండ వద్ద ఘోర ప్రమాదం

## లారీ డ్రైవర్ సజీవ దహనం

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న మరో లారీ



ఆసుపత్రి సిబ్బందితో మృతుని శరీర భాగాలను తీయిస్తున్న ఎస్ఐ సుధాకర్ యాదవ్

**పెనుకొండ మే 25 ప్రభాతవార్త:** పెనుకొండ సమీపంలోని జాతీయ రహదారిలోని పులేకమ్మ గుడి సమీపంలో ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రమాద ఘటనపై పెనుకొండ పోలీసులు అందించిన సమాచారం మేరకు అనంతపురం వైపు నుండి బెంగళూరు వెళుతున్న రాజస్థాన్‌కు చెందిన, ఆర్ జె 11జిబి 6906 నంబర్ గల పొటాటో లోడుతో వెళ్తున్న లారీకి డీజిల్ అయిపోవడంతో రోడ్డు పక్కన ఆపి ఉంచారు. అనంతపురంలో గోధుమలు లోడ్ చేసుకుని >>2



# విదేశాలకు వెంకన్న

## ఇతర దేశాల్లో తిరుమలేశుని ఆలయాలకు టిటిడి ప్రణాళికలు

14 రాష్ట్రాల రాజధానుల్లో ఇప్పటికే ఆలయాల నిర్మాణం

**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని, సేవలను ఖండాంతరాలకు వ్యాప్తిచేయడానికి తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. విదేశాల్లోనూ వెంకన్న ఆలయాలు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేసింది. హిందువులు ఉన్న ప్రతి చోటా ఆలయాలు ఉండాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సంకల్పం వ్యక్తం చేయడంతో టిటిడి పాలకమండలి, అధికారులు కార్యాచరణ అమలు చేసే దిశగా అడుగులేస్తున్నారు. దేశంలోనేగాక విదేశాల్లోనూ అత్యధికంగా హిందువులు ఉన్న ప్రతి చోటా శ్రీనివాసుడి ఆలయాలు నిర్మాణం చేసి,హిందూ సనాతన ధర్మవ్యాప్తికి మరింతగా కృషి చేయాలనే భావన వ్యక్తమవుతోంది. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాల రాజధానుల్లోనూ వెంకన్న ఆలయాల నిర్మాణం చేయాలని టిటిడి కృత నిశ్చయంతో ఉంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయా రాజధానుల్లో ఆలయాల నిర్మాణం కోసం భూమి కేటాయించాలని కోరుతూ లేఖలు కూడా రాశారు. మరికొన్ని రాష్ట్రాలకు లేఖలు రూపంలో విజ్ఞప్తి చేస్తోంది. సాక్షాత్తు శ్రీమ హా విష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా సాలగ్రామశిల ద్వారా స్వ యంభువుగా, అర్చనామూర్తిగా ఆవిర్భవించారనేది పురాణాలద్వారా తెలుస్తున్న విషయం. తిరుమల ఆలయంలో జరిగే తరహాలోనే అన్ని చోట్లా ఆలయాలు నిర్మించి నిత్యం శ్రీవారి కైంకర్యాలు, సేవలు, పూజలు జరిపించి అక్కడి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించాలనే అభిప్రాయంతో ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతోబాటు తమిళనాడు,కర్నాటక, ఒరిస్సా,మహారాష్ట్ర, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్, హర్యానా, కన్యాకుమారి,రామేశ్వరం వంటి నగరాల్లోనూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఇటీవల కాలంలో అమరావతి, విశాఖపట్నంలో శ్రీవారి ఆలయాలు నిర్మించిన టిటిడి అక్కడ తిరుమల ఆలయంలో జరిగేలాగే పూజలు,సేవలు నిర్వహిస్తున్నారు. దాదాపు 14రాష్ట్రాల్లో ఇప్పటికే వెంకన్న ఆలయాలు నిర్మించిన టిటిడి దైనందిన పూజా కార్యక్రమాలు చేపడుతోంది. అక్కడి స్థానిక ప్రజలకు, హిందు భక్తులకు స్వామివారి సేవలను చేరువచేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రతి రోజూ లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. ఇప్పుడు విదేశాల నుండి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. దేశంలోని తెలుగు రాష్ట్రాల్లో విశాఖపట్నం, అమరావతి,హైదరాబాద్, కరీంనగర్,సిద్దిపేట, తమిళనాడులోని చెన్నై, కన్యాకుమారి, రామేశ్వరం, వేలూరు ఉలుందూరుపేట, కర్నాటక బెంగుళూరు, రాయపూర్, మహారాష్ట్ర నవీముంబై, ఒరిస్సా భువ నేశ్వర్, దేశరాజధాని నగరం ఢిల్లీ, హర్యానా కురుక్షేత్ర, >>2

26-05pg2exHMNWJQE.qxd:26-05pg2exHMNWJQE.qxd 1/1/02 6:30 AM Page 1



# మరిన్ని ఎంఎస్ఎంఇ పార్కులు

>> ఎంఎస్ఎం ఈలకు మాత్రమే ఉంది. యువత కలలకు, మహిళ ఆత్మవిశ్వా సానికి ప్రతీకగా ఉన్న ఈ రంగం. ఏపీలో వనరులకు, అవకా శాలకు కొదవలేదు. వీటిని వినియోగించుకునేలా ఎంఎస్ఎం ఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, రైల్వే లాంటి లాజిస్టిక్స్ కూడా ఏపీలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ పాలసీ, ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తెచ్చి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎంఎస్ఎంఈ సమ్మిట్ కొత్త ఆవిష్కరణలకు వేదిక కావాలి. కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలి. పారిశ్రామిక యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవాళ మరో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశాం. త్వర లో ఈ 138 పారిశ్రామిక పార్కులు సిద్ధం అవుతాయి. మిగి లినవాటిని జూలై నాటికి శంకుస్థాపనలు చేసి అన్ని మౌలిక వస తులూ కల్పిస్తాం.ఈ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూము లిచ్చిన రైతులకు ధన్యవాదాలు అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీసీఎంఇపీకు రూ. 300 కోట్లు:** ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు, నిపుణులు, బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్దిదారులు ఒకే వేదికపైకి వచ్చారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు కావాలి. రాష్ట్రంలో 20.77 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయి. ప్రజా ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక రూ.558 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. పీఎంఈజీపీ, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, పీఎం విశ్వకర్మ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేస్తూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్ కింద రూ.300 కోట్లను కేటాయిస్తున్నాం. రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నాం. ఏపీఐఐసీలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ 2953 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు అయ్యాయి. వీటి ద్వారా రూ.4.68 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. ప్రైవేటు రంగంలో శ్రీసిటీ ఓ విజయవంతమైన పారిశ్రామిక పార్కు." అని ముఖ్యమంత్రి అన్నారు.

**మహిళల సంఘాల వద్ద 28 వేల కోట్ల కార్పస్ ఫండ్**

28 వేల కోట్ల కార్పస్ ఫండ్ ద్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది ద్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యూర్లుగా మారుస్తామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామన్నారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ దీనిని అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమన్నారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగామారుతుందన్నారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ తయారు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

**జెన్ జీ వర్గం యువత కలల్ని సాకారం చేస్తాం:** మెటా, అమెజాన్ లాంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు యువత భవిష్యత్తుకు ఉపాధికి, నైపుణ్యాలకు కొత్త దారుల్ని సృష్టిస్తాయి. మారుతున్న టెక్నాలజీ... ఉద్యోగాల స్వరూపాన్ని మారుస్తోంది. అందుకే టెక్నాలజీ స్కిల్ బిజినెస్ ఇంటిగ్రేషన్ మోడల్ ను అనుసరిస్తున్నాం. పరిశ్రమలకు అనువైన స్కిల్ డెవలప్మెంట్ పై దృష్టి పెట్టాం. ఆధునిక టెక్నాలజీ ఎకోసిస్టమ్ ద్వారా రాష్ట్ర యువతకు గ్లోబల్ స్థాయిలో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఏఐ, మెటలర్జీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ ఏవియేషన్ లాంటి ఫంక్షనల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



సోమవారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదిక వద్ద ఆయన నిలువెత్తు చిత్రానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు


సోమవారం తాజ్‌మహల్ వద్ద అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో దంపతులు

# వికసించిన 'పద్మా'లు

>> కున్నారు. తొలివిడతగా సోమవారం 66 మందికి అందచేసారు. మిగిలిన అవార్డువిజేతలకు రెండోవిడతలో అందిస్తారు. రాష్ట్రపతిభవన్‌లో ఘనంగాజరిగిన ఈకార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, కుమారస్వామి, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు హాజరయ్యారు. అలాగే ప్రకటనలరంగంలో విశిష్టస్థానం పొందిన పియూష్ పాండేకు పద్మభూషన్ పురస్కారాన్ని ఆయన తరపున ఆయన కుటుంబసభ్యులు స్వీకరించారు.

**ఇద్దరికి పద్మవిభూషణ్..ఆరుగురికి పద్మభూషణ్ పురస్కారాలు:** అవార్డులు పొందిన విజేతల్లో పద్మవిభూషణ్ పురస్కారం బాలివుడ్ దివంగత నటుడు ధర్మేంద్ర డియోల్, వయోలిన్ విద్వాంసురాలు డా.శ్రీమతి ఎన్‌రాజమ్మలు అందుకోగా పద్మభూషణ్ పురస్కారాలు ఆరుగురికి అందించారు. వీరిలో శతావధాని డా.ఆర్‌గణేశ్, ఉత్తరాఖండ్ మాజీ సీఎం భగత్‌సింగ్ కోష్యారి, కోటక్ బ్యాంకు వ్యవస్థాపకులు ఉదయ్ సురేష్‌కుమార్‌కోటక్, మరణానంతరం ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌మల్హోత్రా, వైద్యరంగంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డా.కళ్లిపట్టి రామస్వామి పళనిస్వామి, వ్యాపార ప్రకటనల రంగంలో పితామహుడుగా వెలుగొందిన పియూష్ పాండేలకు పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి. పాండేకు మరణానంతర పురస్కారం కావడంతో ఆయన కుటుంబీకులు ఈ అవార్డుస్వీకరించారు.

**పద్మ అవార్డు గ్రహీతలు:** ఇక పద్మపురస్కారాలపరంగాచూస్తే బిశ్వబంధు(మరణానంతరం),భరత్‌సింగ్ భారతి, తగారామ్‌భీల్, క్రికెట్‌నుంచి హర్మన్‌ప్రీత్ కౌర్,శ్రీ రాతిలాల్ మోహన్‌లాల్ బోరిసాగర్, కుమార్‌బోస్, జనార్ధన్


రాష్ట్రపతి ముర్మునుండి పద్మభూషణ్ పురస్కారం అందుకుంటున్న ఆర్. గణేష్, మల్హోత్రా, పీయూష్ పాండే తరఫున కుమార్తె, పద్మశ్రీలు అందుకుంటున్న దీపికా రెడ్డి, డా.గూడూరు వెంకట్రావ్

బాపూరావ్ భోథే,స్వామి బ్రహ్మదేవ్,ప్రొశేన్‌జీత్ ఛటర్జీ, దేవికా అమ్మజీ, డాక్టర్ రామచంద్ర గోడ్‌బోలే, సునీతా గెఒడ్‌బోలే, తేచీ గుబిన్, డా.హెచ్‌వి హండే, గఫ్రుద్దీన్ మేవాటి జోగి, మీర్‌హాజి కసమ్, రఘువీర్‌ఖేడ్‌కర్,ఆర్.కృష్ణ కిటనా(మరణానంతరం), ప్రొఫెసర్ డా.లార్స్ క్రిస్టియన్‌కోచ్, ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్; కె.విజయ్‌కుమార్; శ్రీరంగ్ దేవ్‌బా లాడ్,అంకేగౌడ ఎం, ప్రొఫెసర్ సరోజ్ మండల్,ప్రొఫెసర్ బుద్ధరష్మి మణి, నిలేష్ వినోద్‌చంద్ర మాండ్లేవాలా, డా.మహేంద్రకుమార్ మిశ్రా,తృప్తి ముఖర్జీ,హరిమాధవ్ ముఖోపాధ్యాయ్(మరణానంతరం), డాక్టర్ ఎఇ ముథునాయగమ్, సత్యనారాయణ్ నందలాల్‌నువాల్,కె.పజనివేల్, ధార్మికలాల్ చునిలాల్ పాండ్యా, కైలాశ్‌చంద్రపంత్, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (మరణానంతరం), ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డా. గూడూరు వెంకట్రావు,దీపికారెడ్డి,డాక్టర్ పాల్గొండ విజయ్ ఆనంద్‌రెడ్డి, హరిచరణ్‌సైకియా,ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి, ప్రొఫెసర్ షఫీ షౌవుఖ్, బల్‌దేవ్‌సింగ్,యమ్నం జాత్రా సింగ్ (మరణనాంతరం), డా. అశోక్‌కుమార్‌సింగ్,శివవంకరి, డా.ఆర్‌శ్రీధర్, ప్రొఫెసర్ శ్యామ్‌సుందర్,డాక్టర్ ఎస్‌జి సుశీలమ్మ, ఎన్. స్వామినాథన్, డా.కేవాల్‌కృష్ణన్ థక్రాల్,గోపాల్‌జీ త్రివేది (మరణానంతరం),అరవింద్ వైద్య,ప్రొఫెసర్ జుజేర్ వాసి,డా.నారాయణ్‌వ్యాస్, హేలీవార్,ప్రొ.గంభీర్‌సింగ్ యోంజోన్‌లకు పద్మపురస్కారాలనప్రధానం చేసారు.

# గుణపాఠం నేర్చుకోరా?

>> అరధేలతో కూడిన ధర్మాసనం, పిటిషన్ల కాపీలను కేంద్రంలో రెండవ అత్యున్నత న్యాయాధికారి అయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు అందజేయాలని ఆదేశించి, తదుపరి విచా రణ కోసం ఈ విషయాన్ని శుక్రవారం (మే 29)కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా, నీట్ యుజి 2024 చుట్టూ ఉన్న వివాదం, దాని తర్వాత మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సులు ఉన్నప్పటికీ, పరీక్ష సమగ్రతపై ఆందోళనలు మళ్లీ తలెత్తాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. "వారు గుణపాఠం నేర్చుకోకపోవడం విచారకరం" అని జస్టిస్ నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది.

# నాలుగోసారి పెట్రో షాక్

>> రూ.2.86 పెంచారు. తొలిసారి పెట్రోల్ రూ.3 పెంచిన ప్రభుత్వం ఆ తర్వాత రూ. తర్వాత రూ.87 పైసలు పెంచింది. ఇక తాజాగా మరోసారి రూ.2.84 పైసలు పెంచుతూ దేశవ్యాప్తంగా ఉన్న వాహన దారులకు షాక్ ఇచ్చింది. అంటే కేవలం నెల రోజుల్లో పెట్రోల్‌పై దాదాపు రూ.8 వరకు పెరిగింది. తాజా పెట్రోధరల పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 115.58కు చేరగా, డీజిల్ రూ. 103.74కు చేరుకుంది. అటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో లీటర్ పెట్రోల్ రూ.117.19 పలకగా, డీజిల్ రూ. 104.88 వద్ద కొనసాగుతోంది.ఇక ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు, డీజిల్ ధర 95.20కు పెరిగింది. లీటర్ పెట్రోల్ ముంబయిలో రూ.111.21, డీజిల్ ధర రూ.97.83కు పెరిగింది. అదే సమయంలో చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77కు పెరగ్గా.. డీజిల్ ధర రూ.99.55కు పెరిగింది. ఏపిలోని గుంటూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.117.59కి, డీజిల్ రూ.105.28కి పెరిగింది. తాజాగా పెరిగిన పెట్రో ధరలు సోమవారం ఉదయం 6 గంటల నుంచే దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ఉద యాన్నే బంకులకు వెళ్లిన వాహనదారులకు పెట్రో ధరలు చూసి ఖంగుతిన్నారు. ఒకేసారి ఐదు లేదా ఆరు రూపాయల మేర ఇందన ధరలు పెంచితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతోనే చమురు సంస్థలు విడతల వారీగా రేట్లు పెంచుకుంటూ పోతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# విదేశాలకు వెంకన్న

>> జమ్మూకాశ్మీర్ జమ్మూలో,ఉత్తరాఖండ్ రుకిషకేశ్‌లో, గుజరాత్ అహమ్మదాబాద్ నగరాల్లో ఇలా అనేక చోట్ల వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల్లో తిరుమల తరహాలోనే వైఖానస ఆగమోక్తంగా నిత్యపూజలు, సేవలు చేస్తూ ఆయా ప్రాంత భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఇంకా దేశంలోని అనేక రాష్ట్రాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించాలనే ఆశయంతో ఆయారాష్ట్రాలకు టిటిడి లేఖలు కూడా రాసింది. ఇంకా అనేక గ్రామాల్లో, మారుమూల ప్రాంతా ల్లో, ఎస్సీ,ఎస్టీ, మత్స్యకార ప్రాంతాల్లోనూ ఆలయాలు నిర్మించడానికి, అసంపూర్తిగా ఉన్న ఆలయాలను పూర్తిచేయడానికి సంకల్పించింది. కాగా ప్రస్తుతానికి అమెరికా దేశంలో ప్రవాస భారతీయులు అత్యధికంగా స్థిరపడ్డారు. అమెరికా,అనుబంధ రాష్ట్రాల్లోనూ మన భారతీయులు నివాసముంటున్నారు. అక్కడ యుఎస్‌ఎలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. నిత్యం తిరుమల ఆలయం తరహాలోనే పూజలు, సేవలు చేస్తున్నారు. ఇక రానున్న రోజుల్లో విదేశాల్లోని ప్రతి దేశంలోనూ, రాష్ట్రాల్లోనూ హిందువులు ఉన్న ప్రతిచోటా తిరుమల ఆలయాలు నిర్మించాలనే సంకల్పంతో ముందుకు కదులుతున్నారు.

## రైతు సజీవ దహనం

**ముండ్లమూరు, మే 25, ప్రభాతవార్త:** మండలంలోని పోలవరం గ్రామంలో రైతు సజీవ దహనమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆ గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన వల్లేపు వెంకటేశ్వర్లు, కోటమ్మ దంపతులు గత మూడు రోజులు క్రితం మొక్కజొన్నను మిషన్‌తో కోత కోయించడం జరిగింది. సోమవారం మొక్క జొన్న వ్యర్థాలను తగలపెట్టడానికి భార్యభర్తలు పొలం వెళ్లారు. వ్యర్థాలకు నిప్పు పెట్టారు. ఆ మంటలు బోరు వైరు కాలిపోతుందని గమనించి ఆ తొందరలో బోరు వద్దకు వెళ్లే క్రమంలో మొక్కజొన్న దుంప తట్టుకొని రైతు పడిపో వడం జరిగింది. వెంకటేశ్వర్లు లేచే క్రమంలోనే మంటలు అతణ్ణి చుట్టుకొని సజీవ దహన మయ్యాడు. మృతుని భార్య కోటమ్మ పరిగెత్తి ప్రాణాలు దక్కించుకుంది. దీంతో పాటు పక్కనే గల వల్లెపు నాగేశ్వరరావుకు చెందిన మూడుఎకరాల మిరపతోట పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

## ప్రధాని మోడీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ

**విజయవాడ మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ అయ్యారు. ఢిల్లీలోని సేవా తీర్థ్‌లో ఆయనతో సమావేశమయ్యారు. వెంకయ్యనాయుడు 2025 డిసెంబర్ నుంచి అటల్ స్మృతి న్యాస్ సొసైటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఢిల్లీలోని వాజ్‌పేయీ స్మారకమైన సదైవ్ అటల్ నిర్మాణం మొదలు ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలను కూడా ఈ సొసైటీనే చేస్తోంది. ఈ నేపథ్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ఆలోచనలు, సిద్ధాంతాలు, విలువలను భవిష్యత్ తరాలకు తెలియజేసేం దుకు సొసైటీ తరపున రూపొందించుకోవాల్సిన విధివిధానాలపై ప్రధానితో వెంకయ్యనాయుడు చర్చించారు.

## సముద్ర తీరం అభివృద్ధికి విజన్ ప్లాన్

సముద్ర సంపద అందిపుచ్చుకునేలా కార్యాచరణ.

సముద్రతీర అభివృద్ధిపై నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం

**విజయవాడ, మే 25, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లోని సముద్ర తీరం అభివృద్ధికి సమగ్ర విజన్ ప్లాన్ తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సముద్ర తీర అభివృద్ధికి సంబంధించి నిపుణులు, అధికారులతో సీఎం సమావేశం అయ్యారు. ఏపీలో ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయనం నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు.

## ఎట్టకేలకు టిటిడి జెఇఓ వీరబ్రహ్మాం బదలీ

### సిసిఎల్ఏ సంయుక్తకార్యదర్శిగా పోస్టింగ్



**తిరుమల,మే 25ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిలో సంయుక్తకార్య నిర్వహణా ధికారిగా (జెఇఓ)గా పనిచేస్తున్న వి.వీరబ్రహ్మయ్య ఎట్టకేలకు బదలీ అయ్యారు. ఆయనను ప్రభుత్వం దేవాదాయశాఖ నుండి మంగళగిరిలోని సిసిఎల్ఏ విభాగంలో సంయుక్తకార్యదర్శిగా నియమించింది. సోమవారం సాయంత్రం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. 2021 సెప్టెంబర్‌లో టిటిడికి జెఇఓగా వచ్చిన ఆయ న అప్పట్లో కీలకంగా కొన్ని విభాగాలపై పట్టుసాధించారు. అప్పటి ప్రభుత్వం లోని టిటిడి బోర్డు పెద్దలతో కలసి తిరిగి వాళ్ళు చెప్పిందే వేదంగా పనిచేశా రనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 2025 మేలో ప్రభుత్వం మారి టిడిపి కూట మి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జెఇఓ వీరబ్రహ్మయ్య బదలీ అవుతారని భావించారు. ఏకంగా ఆయన వైసిపికి విధేయుడుగా కూడా సేవలంది స్తున్నాడనేది పెద్ద విమర్శలు. అయితే ప్రభుత్వం టిటిడిలో సమర్ధ వం తమైన అధికారుల అవసరాన్ని గుర్తించి వీరబ్రహ్మాం సేవలను రెండేళ్ళు అలాగే కొనసాగించింది. తాజాగా సోమవారం ఉదయం కూడా ఆయన నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో, అర్చకులతో సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ఆయన తిరుపతికి చేరుకోగానే బదలీ ఉత్తర్వులు అందుకున్నారు. దాదాపు ఐదేళ్ల పాటు టిటిడి జెఇఓగా వీరబ్రహ్మయ్య సేవలందించడం విశేషం. ఆయన స్థానంలో మరెవరినీ నియమించలేదు. బదలీ ఉత్తర్వులు అందుకోగానే ఆయన జెఇఓ పోస్టు నుండి నిష్క్రమించారు. బాధ్యతలను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు అప్పగించారు.

## వడ దెబ్బకు మరో 24 మంది బలి

>> నందనమారెళ్లలో 44.7, విశాఖజిల్లా ములగాడ 44.4, తూర్పుగోదావరిజిల్లా పోతవరం 44.3డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్తపడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు,మజ్జిగ, కొబ్బరినీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. శనివారం వరకు ఈ తీవ్రత కొనసాగే అవకాశం ఉన్నందున, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. అత్యవసర ప్రయాణాల్లో తప్పనిసరిగా మంచినీరు వెంట తీసుకుని వెళ్లాలన్నారు.

## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

>> మరో ప్రాంతంలో శుద్ధి చేసేందుకు ఆలోచిస్తుందని తెలిపారు. ప్రత్యామ్నాయ పనులు వేగంగా జరిగేలా చూడాలని అప్పటివరకు మరో శుద్ధి ప్లాంట్ నిర్మించుకునేలా యాజమాన్యానికి ఆదేశాలివ్వాలని పవన్ దిశా నిర్దేశం చేశారు. ఉప ముఖ్యమంత్రితోపాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహార్,కందుల దుర్గేష్,శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హారిప్రసాద్, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ,నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి,ఎస్పీ నరసింహా కిషోర్, నగరపాలకసంస్థ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# లారీ డ్రైవర్ సజీవ దహనం

>> బెంగళూరు వెళుతున్న ఏపీ 39 యు ఏ 7369 నంబర్ గల లారీ వేగంగావచ్చి ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ కిరణ్ స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయారు.లారీ ఢీకొట్టడంతో ఢీ కొట్టిన లారీ ముందు ఉన్న ఎలక్ట్రిక్ వైర్లు కాలిపోయి మంటలు క్షణాల్లో చెలరేగడంతో స్టీరింగ్ మధ్యలో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ కిరణ్ బయటకు రాలేకపోవడంతో సజీవ దానమయ్యారు.ప్రమాద తీవ్రతకు గోధుమల లోడ్‌తో ఉన్న లారీ పూర్తిగా కాలి బూడిదైంది. ప్రమాదం సంభవించిన విషయం స్థానిక పోలీసులకు తెలియడంతో హుటాహుటిన ప్రమాద స్థలానికి అగ్నిమాపక సిబ్బందితో చేరుకొని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ, మంటలు ఉధృతంగా వ్యాపించడంతో డ్రైవర్‌ను రక్షించలేకపోయారు. మంటల్లో మృతి చెందిన కిరణ్ ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. సోమవారం ప్రమాద స్థలానికి పెనుకొండ ఇన్చార్జి ఎస్ఐ సుధాకర్ యాదవ్ చేరుకొని మృతిచెందిన డ్రైవర్ శరీర భాగాలను ఆసుపత్రి సిబ్బందితో తీపించి పోస్టుమార్టర్ నిర్వహించేందుకు పంపించారు. పొటాటో లారీలో ఉన్న డ్రైవరు, క్లీనర్, గోధుమల లారీలో ఉన్న అదే నాకు డ్రైవరు సంఘటన జరిగిన వెంటనే పరారయ్యారు.

## ఎంపి కేశినేని చిన్ని భార్యకు ఇడి నోటీసులు

>> అలాగే ఫ్రైడ్ ఇన్‌ఫ్రాకాన్ కంపెనీతో సాగిన వివాదాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన అక్రమ లాభాల్లో ఆమెకు కూడా వాటా ఉందనే బలమైన అనుమానంతోనే ఈడీ ఈ చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. గతంలోనూ ఈ వ్యవహారానికి సంబంధించి జానకి లక్ష్మి కి ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. తాజా గా, మరోసారి నోటీసులు ఇవ్వడం అటు రాజకీ యంగా,ఇటు ఐటీకార్పొరేట్‌వర్గాల్లో తీవ్ర దుమా రం రేపుతోంది. స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ నెట్‌వర్క్, నిధుల మళ్లింపు ఎక్కడెక్కడ జరిగాయనే కోణంలో ఈడీ అధికారులు ఇప్పటికే పక్కాఆధారాలు సేకరిస్తున్నారు. ఈనెల 27న జరిగే విచారణలో ఆమె ఇచ్చే వివరణ ఆధారంగా ఈ కేసులో మరికొంత మంది కీలక నేతలు,వ్యాపారవేత్తలకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని ఢిల్లీ వర్గాల సమాచారం.

**లిక్కర్ స్కామ్ కేసులో నా భార్యకు సంబంధం లేదు: చిన్ని:**

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో తన భార్య కేశినేని జానకి లక్ష్మికి ఈడీ సమన్లు జారీ చేసిందంటూ వస్తున్న వార్తలపై విజయవాడ టీడీపీ లోక్‌సభ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్రంగా స్పందించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన భార్యకు వ్యక్తిగతంగా ఎలాంటి సమన్లు రాలేదని, కేవలం ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు వచ్చిన నోటీసును కొందరు కావాలనే రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇశాన్వీ, కేశినేని డెవలపర్స్ సంస్థలు కలిసి ఉమ్మడిగా చేసిన ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఈడీ నుంచి నోటీసు వచ్చిందని చిన్ని తెలిపారు. ఆ సంస్థలో తన భార్య ఒక డైరెక్టర్‌గా మాత్రమే ఉన్నారని, అందుకే ఆ కంపెనీకి వచ్చిన నోటీసుపై ఈనెల 27వ తేదీన ఈడీ అధికారులకు పూర్తి వివరణ ఇస్తామని పేర్కొన్నారు. పక్కపక్కనే ల్యాండ్ సైట్లు ఉండటంతో, లిక్కర్ స్కామ్ కేసులో నిందితు డిగా ఉన్న రాజ్ కేసిరెడ్డికి చెందిన ఇశాన్వీ సం స్థతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం కోసం 2021లో ఫ్రైడ్ ఇన్‌ఫ్రా సంస్థను ఏర్పాటు చేశామని చిన్ని తెలిపారు.ఆర్కిటెక్ట్ ఫీజు నిమిత్తం ఆ సంస్థ ద్వారా కేవలం రూ.35 లక్షల లా వాదేవీలు మాత్రమే జరిగాయని ఎంపీ వెల్లడిం చారు. రాజ్ కేసిరెడ్డి వ్యవహారాలు, ఆయన నేపథ్యం తెలిసిన వెంటనే తాము అప్రమత్తమై 2022లోనే ఆ కంపెనీ నుంచి పూర్తిగా బయ టకు వచ్చేసినట్లు చిన్ని స్పష్టంచేశారు. ఆనాటి రూ.35లక్షల ట్రాన్సాక్షన్‌కు సంబంధించిన వివరాలు కోరుతూనే ఈడీ నోటీసు పంపిందని, దానికి సంబంధించిన పక్కా ఆధారాలను అధికారులకు సమర్పిస్తామని చెప్పారు. లిక్కర్ స్కామ్‌తో తన భార్యకుగానీ, తమ కుటుంబానికి గానీ ఎలాంటి సంబంధంలేదని, కేవలం రూ. 35లక్షల రియల్ ఎస్టేట్ ఆర్కిటెక్ట్ ఫీజు లావా దేవీని పట్టుకుని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

## ప్రజలకు సేవలు సులభంగా అందేలా బిజినెస్ రూల్స్ మారుద్దాం

### కుల ధృవీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు తొలగించాలి: ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, మే 25, ప్రభాతవార్తప్రతినిధి:** టెక్నాలజీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిందని ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ఉండాలి కానీ నిబంధనలు అడ్డుకా కూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందే విధంగా చూడాలని ఈ మేరకు అవసరమైన బిజినెస్ రూల్స్ సవరించాలన్నారు. బిజినెస్ రూల్స్ సవరించాలని గతంలోనే అనుకున్నామని దానికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్ పనితీరుతో పాటు వివిధ శాఖల కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్న తీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రజల కోసం అధికారులు.. ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పని చేయడం ఎంత ముఖ్యమో... దానికి అనుగుణంగా ఫలితాలు చూపించడం కూడా అంతే ముఖ్యం. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నాం. ఆ సమాచారం ఆధారంగా అధికారులు, ఉద్యోగుల పనితీరును అంచనా వేయాలి. బాగా పని చేస్తున్న అధికారులను అభినందిద్దాం.. సరిగా పని చేయని అధికారులకు ఓరియేంటేషన్ క్లాసులు తీసుకుందాం. రోటీన్ పద్దతుల్లో పని చేయడం కాకుండా వినూత్నంగా ఆలోచన చేయాలని, సేవలను సులభతరం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

26-05-2026, అధికజ్యేష్ఠ మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
ఏకాదశి పూర్తి,
హస్త పూర్తి
వర్జ్యం : మ.1.11-మ.2.54
దు.ఉ.8.10-9.02, 2)రా.11.47-12.39
శుభసమయం : ఉ.9.30-10.30
రాహుకాలం - మ.3.00-4.30

## వారాఫలం

**మేషం:** గృహ అవసరములకు నీరు, విద్యుత్ సదుపాయములు, గృహాలంకరణలకు ధనమును వెచ్చిస్తారు.

**వృషభం:** నిర్మాణాత్మక పనులకు కొంత ఉత్సాహము మిత్రుల ద్వారా లభిస్తుంది. అధికారుల వలన అనుకోని గుర్తింపు లభిస్తుంది.

**మిథునం:** వచ్చిన ఒక సదవకాశమును సద్వినియోగ పరచుకోగలిగితే మేలు జరుగుతుంది. విద్యా, ఉద్యోగవకాశాలు.

**కర్కాటకం :** విధుల నిర్వహణలో గానీ, వ్యాపారములలో గానీ, మార్పులు జరుగవచ్చును. ప్రమోషన్ లభిస్తుంది.

**సింహం:** బంధువులతో ప్రేమనురాగములు పెంపొందించే అవకాశము ఉన్నది. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వస్త్రలాభం.

**కన్య :** వ్యాపారములో, వృత్తిలో మీరు చూపించే నైపుణ్యమునకు మంచి అభివృద్ధిని సాధిస్తారు. వాహన సౌఖ్యం కలదు.

**తుల :** వైద్య, విద్యకు సంబంధించిన విషయములకు, వస్తువుల కొనుగోలుకు అనుకూల సమయము.బంధువుల కలయిక.

**వృశ్చికం:** సర్వసభ్య సమావేశములకు, పార్టీ వ్యవహారములకు, సాంఘిక సంబంధములకు అనుకూల కాలము. వస్త్రలాభం కలదు.

**ధనుస్సు:** స్త్రీల వలన కొన్ని ప్రయోజనములు లభిస్తాయి. నిందారోపణలకు సిద్ధపడి కొన్ని బాధ్యతలను స్వీకరిస్తారు.

**మకరం:** కాంట్రాక్టులు, ఉత్తర్వులు, ఆర్డర్లను ప్రభుత్వము నుండి అందుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కుంభం:** కార్యాలయము నందు రహస్య సంభాషణలను జరుపుట మానసిక ప్రశాంతతను కోల్పోవుట జరుగుతుంది.

**మీనం :** కార్పోరేషన్స్, మున్సిపాల్టీస్, పంచాయితీలతో లావాదేవీలు జరుపవలసి ఉంటుంది. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి, ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# ఇది మనిషి ద్రోహమే!

తమలపాకుతో నువ్వొట్లంటే తలుపు చెక్కతో నేనిట్లంట అన్నట్లుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వావ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. వాతావరణంలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. గతవారం, పది రోజులుగా తెలుగురాష్ట్రాలు భానుడి ప్రతాపానికి కొన్ని ప్రాంతాల్లో అగ్నిగుండాలుగా తయారవుతున్నాయి. ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలు దాటితేనే బయటకు అడుగుపెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలోనే దాదాపు వంద మందికిపైగా కేవలం వడగాల్పులతో మరణించినట్లు అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా దాదాపు 250 మండలాలో వడ గాల్పులు వీచాయి. ఇరవై జిల్లాల్లో పైగా గత నాలుగైదు రోజులుగా నలభైఆరు డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆంధ్రప్రదేశ్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. కొన్ని ప్రాంతాల్లో నలభై ఎనిమిది డిగ్రీల వరకుసూర్యుడి ప్రతాపం పెరిగింది. సోమవారం రోహిణికార్తె ప్రవేశించడంతో ఈ వేడిగాల్పులు మరో మూడు నాలుగు రోజుల పాటు కొనసాగవచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా వాతావరణంలో అనూహ్యమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు అదుపు లేకుండా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు కరవులు, కార్చిచ్చులు తదితరవి మానవ జీవనానికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే మానవుడి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు ఏనాటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు కూడా పర్యావరణానికి చేటు చేస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు మొదలుపెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనావాసాలుగా మార్చడం ఒక్కటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం భారత జనాభా నూటయాభై కోట్లకు చేరుకోవడానికి ఇంకెంతో కాలం పట్టదు. కానీ అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నా దాన్ని నియంత్రించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. అటవీ సంపద వేగంగా హరించుకుపోతున్నది. భారత్‌లో రోజుకు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్య మైపోతున్నదని ఐక్యరాజ్యసమితి నివేదిక వ్యక్తం చేస్తున్నది. బొగ్గగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, నదీ లోయ ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులను నరికి వేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు. అందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. ఈ వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ అన్నీ గాలి కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అన్నిటి కంటే ముఖ్యంగా నగరీకరణపేరుతో జరుగుతున్న విధ్వంసం అంతా ఇంతా కాదు. పచ్చదనం కనుమరుగైపోతున్నది. ఎటు చూసినా కాంక్రీట్ మయమైపోతున్నది. ఇలాంటి రకరకాల కారణాలతో భూఉష్ణోగ్రత పెరిగిపోతున్నదని వాతావరణ శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలో తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి కూడా తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతినడం కారణంగా సకాలంలో వర్షాలు కురియకపోవడం, కురిస్తే ఒకేచోట, ఒకేసారి కుంభవృష్టి కురవడం అకాల వర్షాలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. అంతేకాదు వరదలు, తుఫాన్‌లతోపాటు భూప్రకంపనాలు వంటి ఉపద్రవాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. యేటా ప్రపంచ వ్యాప్తంగా మూడువందల ఎనభైకి పైగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాలతో వేలాది మంది ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటున్న ముందుజాగ్రత్తల వల్ల ఇటీవల కాలంలో ప్రాణ, ఆస్తి నష్టాలను కొంత మేరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఆధునికంగా, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినా మరెంతో విప్లవాత్మకమైన పురోగాభివృద్ధివైపు అడుగులు వేస్తున్నా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితిని మానవుడు బయటపడలేకపోతున్నాడు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించ కతప్పదు.

ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.



ఎల్లెన్ గ్లాస్గో

ఆత్మవిశ్వాసం, స్వయం పోషకత్వం, ఉత్తమ స్వభావానికి మూలస్తంభాలు వంటివి.



వినోబా భావే

## ప్రజావాక్కు



### పెరుగుతున్న అవినీతి పరులు

మనదేశంలో అవినీతి, అధికార దుర్వినియోగం, బంధుప్రీతి, చీకటి బజారు, మోసం, దగా, దారుణాలు ఏయేటకాయేట పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో అయితే అవినీతి చేసి లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డవారి వార్తలు అనేకం. ప్రతిరోజూ మనం వార్తాపత్రికలలో, న్యూస్ ఛానళ్ళలలో చూస్తూనే ఉన్నాం. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వం అంటేనే ప్రజలు. ప్రభుత్వ సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజల దగ్గర లంచాలకు మరిగే లంచగొండులను ఉపేక్షించటం తగదు. అవినీతిపరులు బొద్దింకలుగా తయారయ్యి మన చుట్టూతా ఉన్నారు. ప్రజల జాగ్రత్త కోసం చిన్నచిన్న జేబుదొంగల ఫొటోలను రైల్వేస్టేషన్లలో, బస్టాండ్లలో, పోలీసుస్టేషన్లలో పెడతారు. పెద్ద పెద్ద అవినీతిపరులను మాత్రం వైట్‌కాలర్ నేరగాళ్లగా పరిగణిస్తున్నారు. అవినీతి కేసుల్లోని వారి ఫొటోలను ఆ వ్యక్తి పనిచేసిన కార్యాలయంలో ఫొటోతోపాటు అతని హోదాను ప్రకటిస్తూ ఏర్పాటు చేసే విధానం వెనువెంటనే తీసుకురావాలి. అప్పటికైనా లంచగొండులకు సిగ్గు కలుగుతుందేమో చూడాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబద్

### నేలకొరుగుతున్న రైతన్న

దున్ని చదును చేస్తున్న రైతన్న నేలాకొరుగుతున్నాడు. నేలను అమ్మిన వ్యాపారులు మాత్రం నింగికి ఎదుగుతున్నారు. అరక దున్నిన అరచేతులను ఆపదలో ఆదుకునే వాడు లేడు. అధికారులను మాత్రం ఇంకాస్త అందల మెక్కిస్తాం అంటారు ఈ జనం. ఆరుగాలం కష్టపడి ఉన్నదంతా పంట కోసం ధారపోస్తే ఆర్నెళ్ల తర్వాత అర్ధరూపాయి అయిన మిగులకపాయే ఈ వ్యవసాయం చేస్తే. ఈ రైతు బ్రతుకు అంటే అందరికీ చిన్నచూపయే కదా.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పరాభవలో పరాభవం

దేశానికి మహిళా ప్రధాన మంత్రిని, మహిళా రాష్ట్రపతిని మహిళా ముఖ్యమంత్రిని మహిళా గవర్నలను అందించిన కాంగ్రెస్ పార్టీ, సమర్థులైనఅధ్యక్షులను కూడా అందించింది. వారు ఎకతాటిపై పార్టీని నడిపించారు. మహిళలు అధ్యక్షులుగా ఉన్న సమయంలోనే కాంగ్రెస్ పార్టీ ఒక వెలుగు వెలిగింది. ఎన్నో రాష్ట్రాలలోనూ కేంద్రంలోనూ అధికారంలో ఉండి పాలన చేయగలిగింది. రాజకీయాల్లో ఇంత మంది మహిళలున్నా మహిళా బిల్లు పాస్ కావడం లేదు. మహిళా బిల్లుకు మోక్షమెప్పుడో!

-రాశి, హైదరాబాద్

### చమురు సరఫరాల భద్రత

పశ్చిమ ఆసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ విభేదాల నేపథ్యంలో చమురు సరఫరాల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ తరుణంలో భారతదేశం తన ఇంధన అవసరాలను భద్రపరుచుకునేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో జరిపిన చర్చలు దౌత్య వ్యూహానికి కీలక విజయంగా నిలిచాయి. యూఏఈ భారత్‌లో ముప్పై మిలియన్ బారెళ్ల ముడి చమురును నిల్వ చేయడానికి అంగీకరించడం దేశానికి రక్షణ కవచంగా నిలవనుంది. ప్రపంచ మార్కెట్లలో సరఫరా అంతరాయం ఏర్పడినా, దేశీయ అవసరాలను తీరుస్తూ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ఈ వ్యూహాత్మక నిల్వలు తోడ్పడతాయి. ప్రస్తుతం భారతదేశం వినియోగిస్తున్న ముడి చమురులో గణనీయమైన భాగం యూఏఈ నుంచే దిగుమతి అవుతోంది. దీర్ఘకాలిక ఎల్‌పీజీ సరఫరా ఒప్పందాలు ఇంధన రంగానికి భరోసాను కలిగిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రైతులకు అవగాహన కల్పించాలి

ఉపాధి హామీ అయినా వీబి జీ రామ్ జీఅయినా పథకం విజయవంతం కావాలి అంటే కార్మికులకు, రైతులకు అవగాహన కల్పించడమే ముఖ్యం. తెలంగాణ వ్యవసాయం స్థిరీకరించడం ఉపాధి హామీతో ఎలా సాధ్యం? పైగా తెలంగాణలో సగటు కమతం పరిమాణం 1.9ఎకరాలు మాత్రమే. మరి వర్షాధితం అయినా వ్యవసాయాన్ని స్థిరీకరించడం ఎలా అంటే ఒక సెంటు భూమిలో చిన్న నీటి కుంటను తవ్వించుకోమని రైతులకు అవగాహనా కార్యక్రమాలుచేపట్టాలి. ఇప్పటికి కాలువలు రాని ఎండు ప్రాంతాలు తెలంగాణలో ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని గిరిజన ప్రాంతాలు అయితే అక్కడ ఇంకా బోర్లా మీదనే ఆధారపడి వ్యవసాయం చేసే ప్రాంతాలు ఉన్నాయి. కాబట్టి అక్కడ నీటి కుంటలు తక్షణమే తవ్వించాలి. సైజు తక్కువ ఉన్న నీటిని ఇంకించే ప్రయత్నం చేయాలి. రైతులకు అవగాహనా కల్పించడం ద్వారానే సాధ్యం అవుతుంది.

- భారత అవినాష్ ,జనగామ

### అవకాశాలు కోల్పోతున్న సీనియర్లు

ఒక ఉద్యోగికి లేదా ఉపాధ్యాయుడికి ప్రమోషన్ అనేది సీనియారిటీ ఆధారంగా ఇవ్వాలి. కానీ ప్రమోషన్లలో కూడా అనేక రకాల రిజర్వేషన్లు చూడడం వలన, సీనియర్ మోస్ట్‌లకు ముప్పై సంవత్సరాల మించి సర్వీస్ చేసినా ఎలాంటి ప్రమోషన్లు పొందకుండా ఉద్యోగ విరమణ చేయవలసి వస్తూ ఉన్నది. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లో ఉపాధ్యాయుల పరిస్థితి గందరగోళంగా ఉంది.

-వీరగంట భాస్కర్ రావు,బొబ్బిలి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# చిత్తశుద్ధిలేని పునరావాసాలతోనే చింత

*లొంగిపోయి న మాజీ మావో యిస్టులపై సమాజంలో అనుమానం, అపనమ్మకం కూడా పెద్ద సవాలే. వారిని జీవితాంతం'మాజీ మావోయిస్టు' అనే ముద్రతో ఒంటరితనంలోకి నెట్టేస్తే పునరావాసం అసాధ్యం అవుతుంది. పెళ్లిళ్లు, సంబరాలు జరుపుకోవడం కష్టం అవుతుంది. ప్రభుత్వం మాత్రమే కాదు, సమాజం కూడా వారిని తిరిగి అంగీకరించే బాధ్యత తీసుకోవాలి. పునరావాసం అంటే కేవలం డబ్బుకాదు అది ప్రజాస్వామ్య పద్ధతిలో జీవితాన్ని తిరిగి నిర్మించే ప్రక్రియ. లేకపోతే 'లొంగుబాటు' అనే పదం తాత్కాలిక విరామంగా మాత్రమే మిగిలిపోతుంది. అడవుల నుంచి బయటకు వచ్చిన వ్యక్తికి ప్రభుత్వాలు నిజమైన జీవితం ఇవ్వలేకపోతే, మళ్లీ అడవులే వారికి ఆశ్రయం అవుతాయి. ప్రజాస్వామ్యం గెలవాలంటే తుపాకీని ఓడించడం మాత్రమే సరిపోదు మనిషిని, మనసులను గెలుచుకోవాలి.*



సరికొండ రవీంద్రనాథ్

ఆపరేషన్ కగార్ తర్వాత భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. ఇది భద్రతా బలగాల విజయం మాత్రమే కాదు. సరైన పునరావాస విధానానికి పరీక్ష కూడా. తుపాకీ వదిలిన మావోయిస్టుల చేతికి స్థిరమైన ఉపాధి, గౌరవప్రదమైన జీవితం ఇవ్వకపోతే అడవుల వైపు వారి తిరుగు ప్రయాణాన్ని ఎవరూ ఆపలేరు. తుపాకీని కింద పెట్టిన చేతికి పని, భద్రత, గౌరవం, భవిష్యత్తు ఇవ్వలేకపోతే ఆ చేయి మళ్లీ అడవిని ఆశ్రయించే ప్రమాదం ఉంది. ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న నక్సలైట్ ఉద్యమ చరిత్రలో లొంగిపోయిన వారికి శాశ్వత జీవనోపాధి కల్పించిన చరిత్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. పునరావాస కార్యక్రమాలు ప్రారంభించినా అవిప్రచార కార్యక్రమాలుగా మిగిలిపోయాయి. ఇప్పుడు కూడా మాజీ మావోయిస్టుల భవిష్యత్తుపై కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు నోరు మెదపకపోవడం ఆందోళన కలిగించే అంశం. ఇప్పటి వరకు ప్రభుత్వాలు ప్రకటిస్తున్న నగదు సహాయాలు, తాత్కాలిక ప్యాకేజీలు మొదటి అడుగే తప్ప పూర్తి పరిష్కారం కావు. నగదు రివార్డులు ఇచ్చి ఫోటోలు దిగడం ద్వారా ఒక వ్యక్తి జీవితం మారదు. నాయకులు తమకు వచ్చిన పెద్ద మొత్తాలను బ్యాంకుల్లో వేసుకోవడమో, పెట్టుబడులు పెట్టడమో చేస్తారు. దళ సభ్యులు, కార్యకర్తల భవిష్యత్తు ఏంటన్నది ప్రశ్న. అడవిలో సంవత్సరాలు గడిపిన వ్యక్తి సమాజంలో తిరిగి నిలబడాలంటే స్థిరమైన ఉపాధి, సామాజిక అంగీకారం, కుటుంబ భద్రత, మానసిక పునరుద్ధరణ అన్నీ అవసరం. ముఖ్యంగా ఛత్తీస్గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు పునరావాస కేంద్రాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని ప్రకటించాయి. ఇంతదాకా ఎక్కడా ప్రారంభం కాలేదు. ఇవి కేవలం ప్రచార కార్యక్రమాలుగా మిగిలిపోకూడదు. శిక్షణ ఇచ్చిన తర్వాత ఉద్యోగం దొరక్కపోతే ఆ శిక్షణ కాగితాలకే పరిమితం అవుతుంది. డ్రైవింగ్ నేర్పితే వాహనం కొనుగోలుకు రుణం ఇవ్వాలి. వ్యవసాయం నేర్పితే భూమి, సాగు సాయం కల్పించాలి. చిన్న పరిశ్రమల కోసం సీడ్ మనీ, మార్కెట్ సదుపాయాలు కల్పించాలి. 'పునరావాసం' రికార్డులకే పరిమితమైతే మావోయిజం మీద విజయం సాధించినట్లు కాదు. మళ్లీ వాళ్ల ఆలోచనలను పాతదారి పట్టించినట్లే అవుతుంది. ముప్పయి సంవత్సరాల క్రితం ఉమ్మడి విశాఖ జిల్లా అనకాపల్లి మండలంలోని కుంచంగి గ్రామంలో మాజీ నక్సలైట్ల పునరావాస కాలనీ ఏర్పాటు చేసారు. ఇప్పటి వరకూ దేశ చరిత్రలో నక్సలైట్ల పునరావాసం కోసం ఏర్పాటు చేసిన తొలి, చివరి పునరావాస కాలనీ ఇదే. కోరుకొండ, తాండవ దళంలో పని చేసి లొంగిపోయిన పదిహేడు మంది మాజీ నక్సలైట్ల కుటుంబాలకు 1994 ప్రాంతంలో కుంచంగి కొండల మధ్య పునరావాసం ఏర్పాటు చేసారు. వీరిలో తెలంగాణాతోబాటు బస్తర్, ఉత్తరాంధ్ర ప్రాంతాలవారు ఉన్నారు. 150 సెంట్ల స్థలంలో చిన్నగది కట్టి ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి ఐదెకరాల బంజరు భూమి కేటాయించారు. గులకరాళ్ల నేలలో ఓమ మొక్క కూడా మొలవని పరిస్థితి. నక్సలైట్లకు పునరావాసం కల్పించామంటూ ఆర్భాటంగా పబ్లిసిటీ చేసారు. నాడు ఓఎస్‌డిగా ఉన్న సంక్షేమ అధికారి అనురాధ మారిపోవడంతో ఈ పునరావాస పథకం అటకెక్కింది. సమస్యలు చెబితే తమకు సంబంధం లేదంటూ కలెక్టర్ తోబాటు పోలీస్, రెవెన్యూ, డిఆర్‌డిఎ అధికారులు ఎవరికి వారు చేతులు దులుపుకున్నారు. కూలి పని కూడా దొరకని పరిస్థితి. తాగడానికి



మంచినీరు కూడా లేని కొండల ప్రాంతంలో పునరావాసం పొందిన వారు నరకం అనుభవించారు. ప్రభుత్వం ఇచ్చింది డి పట్టాభూమి కావడంతో అమ్మడానికి వీలు లేదు. బ్యాంక్‌లో తాకట్టు పెట్టి అవసరానికి అప్పు తెచ్చుకునే అవకాశం లేదు. లొంగిపోయిన వారికి జరిగిన మేలు ఒక్కటే. కేసులు ఎత్తి వేయడం. ముప్పయి సంవత్సరాల తర్వాత కూడా కాలనీ వాసులు ఇప్పటికీ అవే సమస్యల పరిష్కారానికి అధికార్ల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మరోదారుణం ఏమంటే ఈ కాలనీ మైదానంలో ఉండటంతో ఇందులోని ఎస్టీలకు షెడ్యూల్ ప్రాంతంలోని అటవీహక్కులు వర్తించడం లేదు. చివరికి శేషం ఏమంటే పునరావాసం పట్ల ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండదు. పత్రికల్లో హామీలు, ప్రకటనలు గుప్పిస్తారు. ప్రధానంగా మావోయిస్టు ఉద్యమానికి కారణమైన మూల సమస్యలను ప్రభుత్వాలు నిజాయితీగా అంగీకరించాలి. నిరుద్యోగం, భూసమస్యలు, అటవీ హక్కుల నిరాకరణ, గిరిజనులపై దోపిడి, వైద్యం, విద్య, మైదానంతో సమానంగా అభివృద్ధి లేకపోవడం వంటి సమస్యలే అడవుల్లో గిరిజనుల తిరుగుబాటుకు బీజాలువేసాయి. ఈ సమస్యలు అలాగే కొనసాగితే కొత్త తరాలు మళ్లీ అదే దారిలో నడిచే ప్రమాదం ఉంటుంది. కేవలం పోలీసు ఆపరేషన్లతో భావజాలాన్ని అంతం చేయలేరు. న్యాయం, అభివృద్ధి, గౌరవంతోనే దీర్ఘకాల శాంతి సాధ్యం. సుదీర్ఘంగా కొనసాగిన ఉద్యమంలో అటు మావోయిస్టు కుటుంబాల వారు, ఇటుపోలీసులు త్యాగాలు చేసారు. చివరికి జరిగింది జాతికి నష్టం. ఈ పరిణామాలు పునరావృతం కాకుండా లొంగిపోయిన వారికి జీవనోపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఛత్తీస్‌గడ్‌లోని కాంకేర్ జిల్లాలో చాగెల్ లోగల బిఎస్ఎఫ్ క్యాంప్ కార్యాలయంలో 40 మంది మావోయిస్టులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సుక్మాలోనిర్మాణ రంగంలో, బస్తర్ ప్రాంతంలో కిల్లింగ్ టు స్కిల్లింగ్ పేరుతో ఒక నైపుణ్యస్కూలు నడుపుతున్నట్టు చెబుతున్నారు. ఇటువంటి కేంద్రాలు మావోయిస్టులను ఆకర్షించడానికి, పబ్లిసిటీకి తప్ప శాశ్వతజీవనోపాధి దారులు చూపించేవికావు. అధికారులు మారినా, అధికారంలోని పార్టీమారినా పథకాలు ఆగిపోకుండా చూడాలి. కేంద్రం కూడా స్వంతంగా పునరావాస పథకాన్ని రూపొందించింది. ఈపథకం ద్వారా అయినా మాజీ మావోయిస్టులకు కొత్త జీవితాలకు దారులు చూపాలి. ఏగ్రామానికి లేదా పట్టణానికి చెందిన వారికి వారికుటుంబ నేపథ్యం ప్రాతిపదికగా పునరావాసం కల్పించాలి. చదువుకునే వారికి చదువు, వ్యవసాయం చేసే వారికి భూమిఇవ్వాలి. వృత్తివిద్యను కోరుకునే వారికి వారి అభిరుచిమేరకు శిక్షణ ఇప్పించాలి. కానీ వాళ్లకు ఇష్టంలేకున్నా ఎలక్ట్రికల్, మొబైల్ రిపేరింగ్‌లలో శిక్షణ ఇవ్వకూడదు. అసాంఘిక శక్తులకు అవకాశం సాయుధ పోరాటాన్ని వీడి బైటికివచ్చిన వారికిసరైన పునరావాసం ఏర్పాటు చేయకపోతే సంఘ వ్యతిరేక శక్తులు తయారయ్యే ప్రమాదం కూడా ఉంది. స్వార్థపర రాజకీయ, పోలీసు శక్తులు, అధికారులు వీరిని చేరదీస్తే సమాజానికి అపారమైన కీడు జరుగుతుంది. నయీం, జడల నాగరాజు, కత్తుల సమ్మయ్య, బయ్య సమ్మిరెడ్డిలాంటి వారిని దీనికి ఉదాహరణగా చెప్పొచ్చు. గంజాయివ్యాపారం, రియల్టర్ సెటిల్‌మెంట్లు, వినియోగించుకుంటారు. వీరిని ఖాళీగా వదిలేస్తే తెలిసి తెలిసి ఒక కొత్త నేరప్రపంచానికి తెరతీసినట్టు అవుతుంది. లొంగిపోయిన మాజీ మావోయిస్టులపై సమాజంలో అనుమానం, అపనమ్మకం కూడా పెద్ద సవాలే. వారిని జీవితాంతం'మాజీ మావోయిస్టు' అనే ముద్రతో ఒంటరితనంలోకి నెట్టేస్తే పునరావాసం అసాధ్యం అవుతుంది. పెళ్లిళ్లు, సంబరాలు జరుపుకోవడం కష్టం అవుతుంది. ప్రభుత్వం మాత్రమే కాదు, సమాజం కూడా వారిని తిరిగి అంగీకరించే బాధ్యత తీసుకోవాలి. పునరావాసం అంటే కేవలం డబ్బు కాదు అది ప్రజా స్వామ్యపద్ధతి లో జీవితాన్ని తిరిగినిర్మించే ప్రక్రియ. లేకపోతే 'లొంగుబాటు' అనే పదం తాత్కాలిక విరామంగా మాత్రమే మిగిలిపోతుంది. అడవుల నుంచి బయటకు వచ్చిన వ్యక్తికి ప్రభుత్వాలు నిజమైన జీవితం ఇవ్వలేకపోతే, మళ్లీ అడవులే వారికి ఆశ్రయం అవుతాయి. ప్రజాస్వామ్యం గెలవాలంటే తుపాకీని ఓడించడం మాత్రమే సరిపోదు మనిషిని, మనసులను గెలుచుకోవాలి. ●

# రూపాయి పతనంతో నష్టమెవరికి?

తిప్పర్తి శ్రీనివాస్

భారతీయ రూపాయి విలువ రోజురోజుకూ క్షీణిస్తూ కొత్త కనిష్టాలను నమోదు చేస్తుండటం దేశ ఆర్థిక వ్యవస్థకు ఆందోళన కలిగించే పరిణామంగా మారింది. అమెరికా డాలర్ ప్రపంచవ్యాప్తంగా మరింత బలపడుతుండగా, భారత రూపాయిసహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అయితే, భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థకు రూపాయి పతనం సాధారణ గణాంక సమస్య మాత్రమే కాదు, అది ప్రజల దైనందిన జీవితాన్ని, ప్రభుత్వ ఆర్థిక నిర్వహణను, పరిశ్రమల స్థిరత్వాన్ని, పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రభావితం చేసే కీలక అంశం. రూపాయి విలువ పడిపోవడానికి అనేక అంతర్జాతీయ, దేశీయ కారణాలున్నాయి. ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని అమెరికా వైపు మళ్లించింది. అధిక లాభాల కోసం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారతీయ మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకోవడంతో డాలర్‌కు డిమాండ్ పెరిగింది. ఫలితంగా రూపాయివిలువపై ఒత్తిడి అధికమైంది. అంతేకాదు, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య అస్థిరత, అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదల వంటి అంశాలు కూడా భారత విదేశీ మారక నిల్వలపై భారం మోపుతున్నాయి. భారతదేశం తన చమురు అవసరాల్లో ఎక్కువ భాగాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటుంది. రూపాయి బలహీనపడితే చమురు దిగుమతుల వ్యయం మరింత పెరుగుతుంది. దీని ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో ప్రజలపై పడుతుంది. రవాణా వ్యయాలు పెరగడంతో అన్నివస్తువుల ధరలు ఎగసిపడతాయి. దాంతో ద్రవ్యోల్బణం అదుపు తప్పే ప్రమాదం ఉంది. ఇప్పటికే సామాన్యుడు కూరగాయల నుంచి గ్యాస్ సిలిండర్ వరకు పెరిగిన ధరలతో ఇబ్బందిపడుతున్న తరుణంలో రూపాయి పతనం మరింత భారంగా మారుతోంది. రూపాయి బలహీనతకు కొన్నిసానుకూల కోణాలు కూడా ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతారు. రూపాయి విలువ తగ్గితే భారతీయ ఎగుమతులు విదేశీమార్కెట్లలో తక్కువ ధరలకు లభిస్తాయి. దీనివల్ల ఐటీ, ఔషధ, టెక్స్టైల్ రంగా లకు కొంత ప్రయోజనంకలగొచ్చు. విదేశాల్లో పనిచేస్తున్న భారతీయులు పంపే డబ్బు విలువకూడా రూపాయిలో ఎక్కువగా మారుతుంది. అయితే ఈ ప్రయోజనాలు పరిమిత రంగాలకే వర్తిస్తాయి. దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, దిగుమతులవ్యయం పెరగడం వల్ల కలిగేనష్టాలు మరింత తీవ్రమైనవిగా కనిపిస్తున్నాయి. ఇక్కడ మరోముఖ్యమైన అంశం విదేశీఅప్పులు. అనేక భారతీయ కంపెనీలు డాలర్లలో రుణాలు తీసుకున్నాయి. రూపాయి విలువ పడిపోతే ఆ రుణాల చెల్లింపులు మరింత భారంగా మారుతాయి. వడ్డీతోపాటు అసలుమొత్తాన్ని చెల్లించడానికి ఎక్కువ రూపాయలు అవసరం అవుతాయి. ఇదిపరిశ్రమల లాభదాయకతను దెబ్బతీస్తుంది. కొంత మంది పెట్టుబడిదారులు భారత మార్కెట్‌పై విశ్వాసం కోల్పోయే ప్రమాదం కూడాఉంది. ఈపరిస్థితుల్లోభారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) పాత్ర అత్యంత కీలకం. విదేశీ మారక నిల్వలను వినియోగించి రూపాయిపతనాన్నినియంత్రించేందుకు ఆర్బీఐ తరచూ జోక్యం చేసుకుంటోంది. అయితే మార్కెట్ శక్తులను పూర్తిగా అడ్డుకోవడం సాధ్యం కాదు. వడ్డీ రేట్లపెంపు, దిగుమతుల నియంత్రణ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధానాలువంటి చర్యలు సమన్వయంతో అమలుకావాలి. అదే సమయంలో ప్రభుత్వం దీర్ఘకాలిక ఆర్థిక సంస్కరణ లపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్నికేవలం నినాదంగా కాకుండా ఆచరణలోకి తీసుకురావాలి. ●

# న్యాయవాదులపై దాడి ప్రజాస్వామ్యానికి చేటు!

జక్కనపల్లి గణేష్

ఒక న్యాయవాదికి ముప్పు వాటిల్లినప్పుడు, న్యాయానికి ముప్పు వాటిల్లుతుంది. న్యాయానికి ముప్పు వాటిల్లినప్పుడు, ప్రజాస్వామ్యానికే ప్రమాదం ఏర్పడుతుంది.' భారతదేశ రాజ్యాంగం, చట్టబద్ధమైన పాలనచే పరిపాలించబడుతుంది. కులం, మతం, హోదా, సంపద, రాజకీయ పలుకుబడితో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి చట్టం ముందు సమాన రక్షణ, న్యాయం పొందేందుకు సమాన హక్కు ఉంటుంది. ఈ రాజ్యాంగ హామీలు వాస్తవరూపం దాల్చడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తారు. వారు పౌరుడికి, న్యాయస్థానానికి మధ్య వారధిగా పనిచేస్తారు. అందువల్ల న్యాయవాదుల భద్రత, స్వాతంత్రం కేవలం వృత్తిపరమైన ఆందోళనలు మాత్రమే కాదు. అవి ప్రజా ప్రాముఖ్యత, రాజ్యాంగ ప్రాధాన్యత కలిగిన విషయాలు. శనివారం హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ వద్ద తన నివాసం సమీపంలో ఖాజా మొయిజుద్దీన్ అనే న్యాయవాదిని ఒక వాహనం ఢీకొట్టడంతో, ఆయనపై జరిగిన దాడి న్యాయవాద వర్గాలలో తీవ్ర ఆందోళనను రేకెత్తించింది. ఆయన చికిత్స పొందుతూ, మృతి చెందారు. దీనికి ప్రతిస్పందనగా అధికారులు ఆలస్యం చేయకుండా నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని, అలాగే సమగ్రమైన, నిష్పక్షపాతమైన విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఒక న్యాయవాది తన తరఫున తాను మాట్లాడరు. ఆయన తన క్లయింట్ తరఫున మాట్లాడతారు. వాది, ప్రతివాది, ఫిర్యాదుదారు, ప్రతిస్పందకుడు, నిందితుడు లేదా బాధితుడికి ప్రాతినిధ్యం వహించినా, ఒక న్యాయవాది చట్టం గుర్తించిన వృత్తిపరమైన విధిని నిర్వర్తిస్తారు. జారీ చేసే లీగల్ నోటీసులు, దాఖలు చేసే పిటిషన్లు, కోర్టు ముందు చేసే వాదనలు, క్రాస్‌ఎగ్జామినేషన్ సమయంలో అడిగే ప్రశ్నలు అన్నీ న్యాయ ప్రక్రియలో భాగమే. వాటిని ఎన్నడూ వ్యక్తిగత శత్రుత్వంగా పొరపాటు పడకూడదు. లీగల్ నోటీసులు అనేవి చట్టపరమైన మార్గాల ద్వారా వివాదాలను పరిష్కరించడానికి ఉద్దేశించిన చట్టబద్ధమైన మార్గం. న్యాయపరమైన విచారణలలో సత్యాన్ని కనుగొనడానికి క్రాస్‌ఎగ్జామినేషన్ అత్యంత ముఖ్యమైన సాధనాలలో ఒకటి. కోర్టు వాదనలు న్యాయ పరిపాలనలో భాగం. అందువల్ల, ఈ విధులను నిర్వర్తిస్తున్నందుకు ఒక న్యాయవాదిని లక్ష్యంగా చేసుకోవడం అనేది న్యాయ పంపిణీ వ్యవస్థ పునాదులనే దెబ్బతీయడం లాంటిది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు సమానత్వాన్ని, ఆర్టికల్ 19 ప్రకారం స్వేచ్ఛను, ఆర్టికల్ 21 ప్రకారం ప్రాణానికి, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణను, ఆర్టికల్ 39ఎ ప్రకారం న్యాయం పొందే హక్కును సూచిస్తాయి. ఈ రాజ్యాంగ సూత్రాలను సమర్థవంతంగా అమలు చేయడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తారు. న్యాయవాదులు తమ విధులను నిర్భయంగా



నిర్వర్తించలేకపోతే, పౌరులకు న్యాయం పొందే హక్కుకు భంగం కలుగుతుంది. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించే న్యాయవాది, తన వృత్తివల్ల తానే సమస్యలలో ఇరుక్కుపోవడం బాధాకరమైన విషయం. శాంతిభద్రతలు అనేవి పోలీస్, న్యాయవ్యవస్థ, ప్రాసిక్యూషన్, న్యాయవాద వృత్తి సామరస్యపూర్వక పనితీరుపై ఆధారపడి ఉంటాయి. ఈ సంస్థలలో ఏ ఒక్కటి భయం లేదా బెదిరింపుల కింద పనిచేసినా, ఒక ప్రజాస్వామ్య సమాజం సమర్థవంతంగా పనిచేయదు. ఒక న్యాయవాదిపై దాడి అనేది కేవలం ఒక వృత్తి నిపుణుడిపై దాడి మాత్రమే కాదు, అది న్యాయ పరిపాలనపైనే దాడి. దేశవ్యాప్తంగా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్‌లోని చాలా మంది సభ్యులు, తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించే న్యాయవాదులకు మరింత బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నిరంతరం నొక్కి చెప్పారు. న్యాయ వృత్తి నిపుణులను వారి వృత్తిపరమైన పని కారణంగా ఎదురయ్యే బెదిరింపులు, భయపెట్టడం, హింస, చట్టవిరుద్ధమైన జోక్యం నుండి రక్షించాలనే ఆందోళనల నుండి 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' గురించిన చర్చలు పుట్టుకొచ్చాయి. దీని లక్ష్యం ప్రత్యేక హక్కులను కల్పించడం కాదు, న్యాయవాద వృత్తి స్వాతంత్ర్యాన్ని కాపాడటం, న్యాయవ్యవస్థ నిరంతరాయంగా పనిచేసేలా చూడటం. ప్రతి పౌరుడు ఒక ప్రాథమిక సూత్రాన్ని గుర్తుంచుకోవాలి. వివాదం కేసులోని పక్షాలమధ్య ఉంటుంది, అంతేగాని పక్షాలకు, న్యాయవాదికి మధ్య కాదు. న్యాయవాది కేవలం తన క్లయింట్ చట్టపరమైన హక్కులు, ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తాడు. వృత్తిపరమైన న్యాయ ప్రాతినిధ్యాన్ని వ్యక్తిగతీకరించడం అనేది రాజ్యాంగపాలనస్ఫూర్తికి, నాగరిక న్యాయ సంస్కృతికి విరుద్ధం. భయపెట్టడం ద్వారా న్యాయాన్ని అణచివేయలేమని చరిత్ర నిరూపిస్తుంది. ఒక న్యాయవాదికి ముప్పు వాటిల్లినా, అనేకులు చట్టాన్ని పరిరక్షించడం అనే ప్రక్రియను కొనసాగిస్తారు. ఒక స్వరాన్ని అణచివేస్తే, న్యాయవాద వర్గానికి చెందిన లెక్కలేనన్ని స్వరాలు రాజ్యాంగ విలువలను కాపాడటం కొనసాగిస్తాయి. న్యాయవాద వృత్తి ఎల్లప్పుడూ పౌరస్వేచ్ఛ, మానవ హక్కులు, చట్టబద్ధమైన పాలనకు సంరక్షకుడిగా నిలిచింది. న్యాయవాదులను గౌరవించే సమాజం, చివరికి రాజ్యాంగాన్ని గౌరవిస్తుంది. న్యాయవాదులను రక్షించే సమాజం న్యాయాన్ని రక్షిస్తుంది. న్యాయాన్ని రక్షించే సమాజం ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది. అందువల్ల, న్యాయవాద వృత్తి సభ్యులపై హింస, బెదిరింపులు లేదా భయపెట్టడం వంటి ఏ సంఘటననైనా, బాధ్యులుగా తేలిన వారిపై జవాబుదారీతనం ఉండేలా చూస్తూ, చట్టానికి అనుగుణంగా, క్షుణ్ణంగా, నిష్పక్షపాతంగా విచారించాలి. బార్ అసోసియేషన్ అనేది స్వాతంత్రం రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలలో ఒకటి. నిర్భయమైన న్యాయవాదులు లేకుండా, న్యాయానికి సమర్థవంతమైన ప్రాప్యత ఉండదు. న్యాయానికి ప్రాప్యత లేకుండా, రాజ్యాంగ హక్కులు అర్థరహితం అవుతాయి. రాజ్యాంగ హక్కులు లేకుండా, ప్రజాస్వామ్యం తననిజమైన బలాన్ని కోల్పోతుంది. న్యాయం జరగడమే కాకుండా, అది జరిగినట్లు కనిపించాలి. న్యాయవాదులు భయం, పక్షపాతం, ఒత్తిడి, బెదిరింపులు లేకుండా తమ విధులను స్వేచ్ఛగా నిర్వర్తించినప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది. న్యాయవాదులు ఏ పక్షానికీ శత్రువులు కారు. వారు న్యాయస్థానం అధికారులు, చట్టపరమైన హక్కుల సంరక్షకులు, న్యాయ పరిపాలనలో భాగస్వాములు. వారి రక్షణ ఒక ప్రత్యేక హక్కు కాదు, అది చట్టబద్ధ పాలన, రాజ్యాంగ పరిపాలన, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి ఒక ఆవశ్యకత. ఒక సైనికుడు దేశ సరిహద్దులను కాపాడుతాడు, ఒక న్యాయవాదిరాజ్యాంగపు హద్దులను కాపాడుతాడు. న్యాయానికిసమయం పట్టవచ్చు, కానీ దానిని శాశ్వతంగా నిరాకరించలేరు. ●

26-5Pg5.qxd:26-5Pg5.qxd 1/1/02 6:17 AM Page 1



# సుంకాలు తగ్గిస్తే రూ.లక్షకోట్ల నష్టం

## ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



**న్యూఢిల్లీ,మే 25:** దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే. పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం 3ఎఫ్ (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు.

మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని,

ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

# సామాన్యుల పొదుపును పెట్రోలుతో తగలెట్టేస్తున్నారు

## పెట్రోధరల పెంపుపై ఖర్గే విసుర్లు

**న్యూఢిల్లీ, మే 25:** అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నాయి. ఇవాళ మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ధరలు పెరిగాయి. అయితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ఇదే తొలిసారి కాదు. గత రెండు వారాల్లో ఐదుసార్లు పెరిగాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీ లో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12 కు, లీటర్ డీజిల్ రూ.95.25 కు చేరింది. ఇక హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58 గా, లీటర్ డీజిల్ ధర రూ.103.74 గా ఉంది. అయితే పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. ఈ రోజువారీ దోపిడీతో ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యులు కూడబెట్టుకున్న పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. కేవలం రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను ఐదుసార్లు పెంచారని మండిపడ్డారు. 2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41గా ఉంటే ఇప్పుడు రూ.102.12కు చేరుకుందని గుర్తుచేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని ఖర్గే హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు ఐదోసారి పెరగడంతో ఇవాళ హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు పెరిగినట్లు కేంద్రం చెబుతోందని అన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

బంగ్లాదేశ్‌లో ట్రక్కు ప్రమాదం..

# 15 మంది మృతి

## మరో పదిమందికి పైగా గాయాలు

**ఢాకా, మే 25:** బంగ్లాదేశ్‌లో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఒక ట్రక్కు బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న 15 మంది మరణించారు. మరో పది మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు వాయువ్య దిశలో తంగైల్ జిల్లా, సొరాటాయిల్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో జరిగింది. స్థానిక పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కొందరు కూలీలు ఢాకా నుంచి బక్రీద్ వేడుకల కోసం తమ ఊళ్లకు, కుటుంబ సభ్యులు, బంధువుల ఇండ్లకు బయల్దేరారు. ఈ క్రమంలో అక్కడి హైవేపై ట్రక్కును ఆపి అందులో ఎక్కారు. ఇలా పలువురు ప్రయాణికులతో వెళ్తుండగా, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా, అతివేగంగా వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో దాదాపు 15 మంది ప్రయాణికులు మరణించారు. మరో పది మందికిపైగా గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రక్షక బృందాలు సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రుల్ని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రులకు తరలించారు. బంగ్లాదేశ్‌లో కొంతకాలంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా వేలాది మంది అక్కడ రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. బంగ్లాలో ట్రాఫిక్ రూల్స్ పెద్దగా అమలు కావు. ట్రాఫిక్ వ్యవస్థ కూడా సరిగ్గా పని చేయదు. అలాగే, రోడ్లు బాగోలేకపోవడం, నైపుణ్యం లేని డ్రైవర్ల కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అక్కడి నివేదికలు తెలుపుతున్నాయి.

# పట్నా హైకోర్టు సిజెగా జస్టిస్ మీనాక్షి

## - సుప్రీం కొలీజియం సిఫార్సు - ఈ నియామకంతో 4 హైకోర్టులకు మహిళా సిజెలు

**న్యూఢిల్లీ, మే 25:** సిక్కిం హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ మీనాక్షి ఎం. రాయ్‌ను పట్నా హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జూన్ 4న పదవీ విరమణ చేయనున్న దృష్ట్యా ఈ సిఫార్సు చేసింది. "ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జూన్ 4, 2026న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, మే 22న భారత ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం సమావేశంలో సుప్రీం కోర్టు కొలీజియం, సిక్కిం హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ మీనాక్షి ఎం. రాయ్‌ను పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది," అని ఆ ప్రకటన పేర్కొంది. భారత న్యాయవ్యవస్థలో అరుదైన ఘట్టం: త్వరలో ఒకే సమయంలో 4 హైకోర్టులకు మహిళా సీజేలు. భారత న్యాయవ్యవస్థలో త్వరలో తొలిసారి అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఒకే సమయంలో దేశంలోని నాలుగు హైకోర్టులకు మహిళా ప్రధాన న్యాయమూర్తులు నేతృత్వం వహించనున్నారు. ప్రస్తుతం గుజరాత్, మేఘాలయా, ఎపి హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులుగా జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ రేవతి మోహితె డెరె, జస్టిస్ లీసా గిల్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సిక్కిం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మీనాక్షి ఎం రాయ్‌ను నియమించాలని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం సిఫారసు చేసింది. జస్టిస్ రాయ్ నియామకంతో ఒకే సమయంలో హైకోర్టులలో నలుగురు మహిళా ప్రధానన్యాయమూర్తులు విధులు నిర్వహించనున్నారు.



# ట్విషా శర్మ మృతి కేసు

## మీడియా సంయమనం పాటించాలి

-దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగేలా చూస్తాం
- సంస్థలు, వ్యవస్థపై నమ్మకముంచండి
- సుప్రీంకోర్టు సిజె ధర్మాసనం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, మే 25:** నటి ట్విషా శర్మ కేసును నిర్వహించిన తీరు పట్ల బాధ వ్యక్తం చేస్తూ, ఆమె మృతికి సంబంధించిన పరిణామాలపై వార్తలు రాసేటప్పుడు సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు మీడియాను కోరింది. 33 ఏళ్ల శర్మ, మే 12న భోపాల్‌లోని కటారా హిల్స్ ప్రాంతంలో ఉన్న తన అత్తగారి ఇంట్లో ఉరి వేసుకుని కనిపించింది. వరకట్నం వేధింపులకు, ఆత్మహత్యకు ప్రేరేపించారని ఆమె అత్తమామలపై కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే, ఆమె మాదకద్రవ్యాలకు బానిస అయిందని ఆమె అత్తమామలు వాదిస్తున్నారు. వరకట్నం వేధింపుల ఆరోపణలపై మృతి భర్త, న్యాయవాది అయిన సమర్థ్ సింగ్, ఆమె అత్త, మాజీ జిల్లా జడ్జి గిరిబాల సింగ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నటి ట్విషా శర్మ మృతి కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం, ఈ కేసులో దర్యాప్తు నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా, నిష్పాక్షి కంగా జరిగేలా చూస్తామని పేర్కొంది. "కొన్ని చర్యల వల్ల తాము కొద్దిగా బాధపడ్డాము. బాధితురాలి కుటుంబం లేదా ఇతర కుటుంబం వాంగ్మూలాలను తీసుకోవద్దని తాము మా మీడియా మిత్రులను కోరుతున్నాము. చట్టం ప్రకారం విషయాలు ముందుకు సాగనివ్వండి" అని ధర్మాసనం పేర్కొంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, మీడియా జోక్యం వల్ల ఈ కేసులో గణనీయమైన పురోగతి సాధించబడిందని తెలిపారు. ఇలాంటి దురదృష్టకర సంఘటనను ఎదుర్కోవడం కంటే, విడాకులు తీసుకున్న కుమార్తెను కలిగి ఉండటమే మేలని ఈ కేసు తల్లిదండ్రులందరికీ ఒక సందేశమని ఆయన అన్నారు. ఈ కేసు దర్యాప్తును వెంటనే సిబిఐ చేపట్టేలా చూడటానికి, తాను ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని సొలిసిటర్ జనరల్ చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు అంగీకరించింది. "బాధితురాలి కుటుంబ సభ్యులకు, అలాగే నిందితులకు తాము చెప్పేదేమిటంటే, బహిరంగంగా లేదా మీడియా వేదికల ముందు వాంగ్మూలాలు ఇవ్వడానికి బదులుగా, వారు తమ వాదనలను దర్యాప్తు సంస్థ ముందు రికార్డ్ చేయించుకోవాలి. తద్వారా కొనసాగుతున్న దర్యాప్తుపై ఎలాంటి పక్షపాతం లేదా ప్రతికూల ప్రభావం పడకుండా ఉంటుంది" అని ధర్మాసనం పేర్కొంది. అలాగే "విచారణ జరపాల్సిన కొన్ని అంశాలపై వచ్చే ఫలితాలపై అది అనవసరంగా ప్రభావం చూపవచ్చు కాబట్టి, సాక్షులుగా ఉండే అవకాశం ఉన్న వ్యక్తుల వాంగ్మూలాలను నమోదు చేయవద్దని తాము మీడియాను కూడా కోరుతున్నాము. ఊహాగానాలకు తావు ఇవ్వకుండా, ప్రముఖ దర్యాప్తు సంస్థలలో ఒకదానిపై నమ్మకం, విశ్వాసం ఉంచాలని తాము ప్రజలను కూడా కోరుతున్నాము. సముచిత సమయంలో, ఈ దర్యాప్తును ఒక ముగింపుకు తీసుకువస్తుందని మాకు పూర్తి నమ్మకం ఉంది" అని ధర్మాసనం పేర్కొంది.

# 90 రాఫెల్స్ జెట్స్ కొనుగోలుకు రక్షణశాఖ సిద్ధం



**న్యూఢిల్లీ, మే 25:** భారత వైమానిక దళాన్ని మరింత శక్తిమంతం చేసే దిశగా రక్షణ శాఖ ఫ్రాన్స్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన అధికారిక ప్రతిపాదన లేఖను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. రాబోయే కొన్నిరోజుల్లోనే దీన్ని ఫ్రాన్స్ ప్రభుత్వానికి పంపించనున్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత్‌లోనే 90 విమానాల తయారీ ఉంటుందని భారత్ పేర్కొంటోంది. ఈ భారీ రక్షణ ఒప్పందంలో భాగంగా దాదాపు 90 యుద్ధ విమానాలను మేకిన్ ఇండియా కింద ఇక్కడే తయారు చేయనున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, ఓ భారతీయ భాగస్వామ్య సంస్థతో కలిసి వీటిని మనదేశంలోనే ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన విమానాలను మాత్రం నేరుగా ఫ్రాన్స్ నుంచి ఎగిరివచ్చే (ఫ్లైఅవే) స్థితిలో దిగుమతి చేసుకుంటారు. మన లేఖకు ఫ్రాన్స్ స్పందించిన తర్వాత అధికారికంగా టెండర్ ప్రక్రియ ముందుకు సాగుతుంది. భారతదేశ రక్షణ అవసరాలకు సరిపోయేలా ఈ రఫేల్ విమానాల్లో కనీసం 50 శాతం మేర స్వదేశీ సాంకేతికత, విడిభాగాలనే ఉపయోగించాలని ఢిల్లీ గట్టిగా పట్టుబడుతోంది. ఈ రఫేల్ ఉత్పత్తి ప్రక్రియలో భారతీయ కంపెనీల పాత్రను మరింత విస్తృతం చేయాలని ఫ్రాన్స్‌ను కోరింది. భవిష్యత్తులో జరగబోయే రక్షణ సహకారాలు కేవలం కొనుగోళ్లకే పరిమితం కాకుండా, ఇరు దేశాలు కలిసి డిజైన్, అభివృద్ధి చేసేలా ఒప్పందాలు ఉండనున్నాయి. భారత వైమానిక దళంలో ఇప్పటికే 36 రఫేల్ యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. అలాగే నౌకాదళం కోసం మరో 26 రఫేల్ఎమ్ విమానాల కొనుగోలు ప్రక్రియ కూడా నడుస్తోంది.

ఇప్పటికే మన దేశంలో రఫేల్ విమానాలకు సంబంధించిన మెయింటెనెన్స్, శిక్షణ మౌలిక వసతులు ఉండటం వల్ల, మరిన్ని కొత్త విమానాలు వస్తే వాటి రవాణా, నిర్వహణ ఖర్చులు, పైలట్ల శిక్షణ వ్యయం భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

## విమానం 30 వేల అడుగుల ఎత్తున పైలట్‌కు గుండెపోటు

**మాడ్రిడ్, మే 25:** విమానం గాల్లో 30,000 అడుగుల ఎత్తులో ఉండగా పైలట్‌కు గుండెపోటు వచ్చిన ఘటన స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళుతున్న జెట్-2 విమానంలో చోటుచేసుకుంది. దీంతో విమానాన్ని పోర్చుగల్‌లోని ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వెంటనే పైలట్‌కు వైద్యసాయం అందించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున జెట్-2 విమానం స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు బయల్దేరింది. విమానం 30 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా.. పైలట్‌కు గుండెపోటు వచ్చినట్లు కో పైలట్ గుర్తించారు. వెంటనే దగ్గరలో ఉన్న ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టు అధికారులను అప్రమత్తం చేశారు. విమానం ఎయిర్‌పోర్టుకు చేరుకునే సమయానికి అధికారులు అత్యవసర వైద్య ఏర్పాట్లు చేసి పైలట్‌కు వెంటనే వైద్య సాయం అందించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటన సమయంలో విమానంలో 220 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

# బార్‌లు, స్పాలలో బాలలు

## తీవ్రమైన సమస్య సుప్రీంకోర్టు వ్యాఖ్య

**న్యూఢిల్లీ, మే 25:** ఆర్కెస్ట్రాలు, బార్‌లు, మసాజ్ పార్లర్‌లు, స్పాలు, సెలూన్‌లతో సహా వినోద, ఆతిథ్య రంగ అనుబంధ సంస్థలలో బాల కార్మిక వ్యవస్థను మరింత కఠినంగా నిషేధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. ఈ సంస్థలలో పిల్లలు దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం, 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' దాఖలు చేసిన పిఐఎల్‌ను విచారించింది. బాలల ఉపాధిని పూర్తిగా నిషేధించే వృత్తుల జాబితాను విస్తరించడానికి, బాల, కౌమార కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం, 1986లోని సెక్షన్ 4 కింద తన అధికారాలను వినియోగించుకోవాలని కేంద్రాన్ని ఆదేశించాలని ఈ పిఐఎల్ కోరింది. విచారణ సందర్భంగా, సిజెఐ సూర్యకాంత్ ఇది ఒక "తీవ్రమైన సమస్య" అని వ్యాఖ్యానించారు.

# రెండు నెలల ముందే ఎబోలా వ్యాప్తి

## అయినా కాంగో తీరు నిమ్మకునీరెత్తిన వైనం!

**బ్రజ్జావెల్లే, మే 25:** ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తోన్న ఎబోలా యావత్ ప్రపంచాన్ని గుబులు పుట్టిస్తోంది. ఇప్పటికే భారత్ సహా పలు దేశాలు అప్రమత్తమై వైరస్ వ్యాప్తి కట్టడికి చర్యలు చేపట్టాయి. కానీ, ఈ సంక్షోభవం పుట్టుకొచ్చిన కాంగోలో మాత్రం ఎబోలా నియంత్రణపై అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్ వ్యాప్తి మొదలైంది కూడా రెండు నెలల కిందటే అయినా.. దాన్ని గుర్తించడంలో వారు చాలా ఆలస్యం చేసినట్లు తెలుస్తోంది. ఐసోలేషన్ లేదు.. శానిటైజర్ ఉండదు. ఈశాన్య కాంగోలోని బునియా నగరంలో ఈ నెల 15న ఎబోలా తొలి కేసు నమోదైంది. కానీ, అంతకంటే దాదాపు రెండు నెలల ముందే అక్కడ ఈ వైరస్ వ్యాప్తి మొదలైనట్లు అంతర్జాతీయ సంస్థల విచారణలో తేలింది. దీన్నిబట్టి చూస్తే ఊహించిన దానికంటే తీవ్రస్థాయిలో ఇప్పటికే వైరస్ వ్యాప్తి చెంది ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, బునియాలో కేసు బయటపడిన తర్వాత కూడా కట్టడి చర్యలు తూతూ మంత్రంగా ఉన్నాయట. ఎబోల లక్షణాలున్న వారిని ఐసోలేషన్‌లో ఉంచడం, వైద్యులు పిపిఇ కిట్లు ధరించడం వంటివి మచ్చుకైనా అక్కడ కన్పించలేదు. ఇక, శానిటైజర్లు, టెస్ట్ కిట్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. జనరేట్లకు సరిపడా ఇంధనం లేక.. రోజుకు 20 నుంచి 40 మందికి మాత్రమే టెస్టులు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

అంతేకాకుండా నిధుల కొరత కూడా వెంటాడుతున్నది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగోకు గతేడాది భారీగా నిధుల కోత విధించారు. దీంతో ఈ దేశం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మరోవైపు, అంతర్జాతీయ సహాయ సంస్థలకు కూడా నిధుల కొరత ఏర్పడింది. దీంతో వైరస్ నియంత్రణకు అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించే అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు.

# సంక్షిప్తంగా..

## 12 యేళ్ల బాలికపై హత్యాచారం!

**బుద్గాం, మే 25:** జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. 12 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి, దారుణంగా హత్య చేశారు. ఆమె మృతదేహం ఇంటికి సమీపంలోనే లభ్యం కావడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితులను వెంటనే పట్టుకోవాలంటూ ప్రజలు నిరసనలకు దిగారు. గల్వాన్‌పోరా గ్రామానికి చెందిన బాలిక శనివారం సాయంత్రం మతపరమైన తరగతులకు వెళ్లి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు రాత్రంతా గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం 7:15 గంటల ప్రాంతంలో ఇంటికి 200 మీటర్ల దూరంలోని పొలాల్లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమికంగా ఇది అత్యాచారం, హత్య కేసుగా నిర్ధారించినట్లు బుద్గాం ఎస్ఎస్పీ హరిప్రసాద్ కేకే తెలిపారు.

## సిఎం విజయ్‌పై పోస్టులు.. యాపిల్ ఉద్యోగి అరెస్టు

**కోయంబత్తూరు, మే 25:** కోయంబత్తూరు జిల్లాలోని సూలూరు సమీపంలో పదేళ్ల బాలికపై జరిగిన లైంగిక దాడి, హత్యఘటనకు సంబంధించి తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కి పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను వ్యాప్తి చేశాడనే ఆరోపణలపై ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ సంస్థకు చెందిన ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. మైనర్ బాలిక హత్యాచార ఘటన దిగ్భ్రాంతిని కలిగించిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులను కార్తీ, మోహన్ రాజ్‌గా గుర్తించారు. కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో తిరునల్వేలి జిల్లాకు చెందిన జేమ్స్ రాజా అనే వ్యక్తి సీఎంకు పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను పోస్టు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు.

## జపాన్‌లో 90 వేల దెయ్యాల లోగిళ్లు!

**టోక్యో, మే 25:** టెక్నాలజీదేశంగా పేరున్న జపాన్‌లో విచిత్రంగా 90 లక్షల ఇళ్లు మనుషులు లేక వెలవెలబోతున్నాయి. స్థానికంగా వీటిని అకియా అని పిలుస్తుంటారు. చూసేవారికి ఇవి దెయ్యాల కొంపలుగా కనిపిస్తున్నాయి. కిటికీలకు కర్టెన్లు ఉన్నా, లోపల మనిషి లేని ఈ ఇళ్లు దేశానికి కొత్త రకం సమస్యగా మారాయి. 2023 సర్వే ప్రకారం, దేశంలోని మొత్తం ఇళ్లలో సుమారు 13.8 శాతం ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం జపాన్‌లో వేగంగా క్షీణిస్తున్న జనాభా. దేశంలో జననాల రేటు తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడంతో అనేక గ్రామీణ ప్రాంతాలు ఖాళీ అవుతున్నాయి. యువత ఉద్యోగాల కోసం నగరాలకు తరలివెళ్తుండటంతో పల్లెల్లో ఇళ్లను చూసుకునే వారు కరువయ్యారు. వారసత్వ సమస్యలు ఈ సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తున్నాయి.

## బొద్దింకల జనతాపార్టీపై పిటిషన్, సత్వర విచారణకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ, మే 25:** 'బొద్దింకల జనతా పార్టీ' ట్రెండ్‌ను అంత సీరియస్‌గా తీసుకోవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పిటిషనర్‌కు సూచించారు. ఈ అంశానికి సంబంధించిన పిటిషన్‌ను అత్యవసర విచారణకు స్వీకరించాలని ఒక న్యాయవాది అభ్యర్థనను సిజె ధర్మాసనం తిరస్కరిస్తూ, తగిన సమయంలో స్వీకరిస్తామని పేర్కొంది. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి స్పష్టత ఇచ్చినప్పటికీ, "వక్రీకరిం చిన, దురుద్దేశ పూర్వక కథనం కొనసాగుతోంది" అని న్యాయవాది ఎన్.కె. గోస్వామి వాదనలు వినిపించారు. దీంతో సిజె జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుని, "దీనిని అంత భావోద్వేగంతో తీసుకోవద్దు" అని అన్నారు.

సిబిఐ విచారణ జరిపించాలన్న అభ్యర్థనపైనా ఇప్పుడే నిర్ణయం తీసుకోలేమని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. దీంతో విచారణ నాలుగు వారాలకు వాయిదా వేశారు.

# రోడ్లపై నమాజ్‌లు, జంతు బలులు నిషేధం!

## బక్రీద్‌వేళ యుపిసిఎం కీలక ఆదేశాలు



**లక్నో, మే 25:** దేశంలోని ముస్లింలంతా బక్రీద్‌కు సిద్ధమవుతున్న వేళ ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. యూపీలోని రోడ్లపై లేదా బహిరంగ ప్రదేశాలలో నమాజ్ చేయడాన్ని, జంతు బలులను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూపీలో బక్రీద్ నిర్వహణపై ఆదివారం సీఎం యోగి ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. అనంతరం బక్రీద్‌పై అధికారులకు కీలక సూచనలు చేశారు. పది అంశాలను సూచిస్తూ, వాటిని అమలు చేయాలన్నారు. ఆయన ఆదేశాల ప్రకారం మసీదులలో మినహా ఎక్కడా నమాజ్ చేయడానికి వీల్లేదు. రోడ్లపై లేదా పబ్లిక్ ప్లేసులు వంటి ఎలాంటి బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ చేయకూడదు. జంతు బలులు కూడా నిషేధం. రోడ్లను బ్లాక్ చేయకూడదు. ఒకవేళ ప్రార్థనలు చేసే వాళ్లు ఎక్కువ సంఖ్యలో ఉంటే, షిఫ్టుల వారీగా చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో జంతు బలులు చేయకూడదు. నిషేధించిన జంతువులను వధించినా కూడా చర్యలు తీసుకుంటారు. జంతుబలుల తర్వాత పూర్తి పరిశుభ్రంగా ఉంచాలి. అపరిశుభ్రతకు తావివ్వకూడదు. చెత్త, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదు.

# అన్నాడిఎంకెలో ముగ్గురు రెబెల్ ఎమ్మెల్యేల రాజీనామా - టివికెలో చేరిక

**చెన్నై, మే 25:** తమిళనాడు రాజకీయాల్లో ఆకస్మిక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతిపక్ష అన్నాడీఎంకే కు చెందిన ముగ్గురు రెబెల్ ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని అధికార తమిళగ వెట్రి కళగం టివికెలో చేరారు. ఈ ఆకస్మిక పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మధురాంతకం ఎమ్మెల్యే మరగతం కుమార్వేల్, ధరాపురం ఎమ్మెల్యే సత్యభామ, పెరుందురై ఎమ్మెల్యే జయకుమార్ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు అందజేశారు. అనంతరం మంత్రి ఆధవ్ అర్జునను కలిసి వారు టీవీకేలో చేరారు. ఈ ముగ్గురు నేతలు అన్నాడీఎంకేలోని మాజీ మంత్రులు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి వర్గానికి సన్నిహితులుగా పేరుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాల్లో పోటీ చేసిన టీవీకే 108 సీట్లు గెలుచుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీకి కొన్ని స్థానాలు తగ్గడంతో కాంగ్రెస్, ఇతర పార్టీల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వేలుమణి వర్గానికి చెందిన 25 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు టీవీకే ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నట్లు అసెంబ్లీలో విజయ్ బలపరీక్ష సందర్భంగా తేలింది. తాజాగా ముగ్గురు ఎమ్మెల్యేలు అన్నాడీఎంకెకు గుడ్‌బై చెప్పడంతో భవిష్యత్తులో ఆ పార్టీ నుంచి మరిన్ని వికెట్లు పడతాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇప్పటికే సీఎం విజయ్ తిరుచ్చి తూర్పు స్థానానికి రాజీనామా చేయగా ఇప్పుడు ఈ ముగ్గురి రాజీనామాలతో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య నాలుగుకు చేరింది.

# రహస్య ప్రదేశంలో మొజ్తాబా ఖమేనీ - దూతలతోనే మెసేజ్‌లు

**టెహ్రాన్, మే 25:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నా.. అవి ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దీనికి కారణం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అందుబాటులో లేకపోవడమేనని తెలుస్తోంది. మొజ్తాబా ప్రస్తుతం రహస్య ప్రాంతంలో ఉన్నాడని అగ్రరాజ్య ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. కేవలం దూతల సాయంతోనే అధికారులు, నాయకులకు ఖమేనీ సందేశాలు పంపిస్తున్నాడట. 'అమెరికా-ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను మొజ్తాబా ఖమేనీ చూసినట్లు మాకు సమాచారం అందింది. అయితే, దానిపై ఆయన నుంచి ఇంకా ఎటువంటి సమాధానం రాలేదు. ఇరాన్‌కు చెందిన సీనియర్ అధికారులు కూడా ఖమేనిని నేరుగా సంప్రదించలేక పోతున్నారు. అందుకే చర్చలు ఆలస్యమవుతున్నాయి' అని అమెరికా నిఘా వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ఖమేనీతో పాటు టెహ్రాన్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా వారాల తరబడి బంకర్లలోనే ఉంటున్నట్లు తెలుస్తోంది. వీరంతా నేరుగా మాట్లాడుకోవడం లేదని సమాచారం. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తొలిరోజే సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అంతమొందించిన సంగతి తెలిసిందే. తర్వాత అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబాను సుప్రీం నేతగా ఎన్నుకొన్నారు. అయితే, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మొజ్తాబా కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వార్తలు వచ్చాయి.

26-5Pg6exHMNWJQE.qxd:26-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:19 AM Page 1



## యువత ఆవేదనే కాక్రోచ్ పార్టీ ట్రెండ్

**● ఎపి టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** సామాజిక మాధ్యమాల్లో విస్తృతం ప్రచారమవుతున్న కాక్రోచ్ జనతా పార్టీ అంశాన్ని కేవలం రాజకీయ కోణంలో కాకుండా యువత భావోద్వేగాలు, ఆవేదనల కోణంలో కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. తనను కలిసిన మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడారు. దేశ యువత ఆశయాలు, ఉపాధి అవకాశాలు, పోటీ పరీక్షలు, ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో వ్యక్తమవుతున్న భావాలను ప్రజా స్వామ్య ప్రభుత్వాలు బాధ్యతా యుతంగా స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఈ తరహా భావోద్వేగాలను గమనించిన తర్వాత విధానాల్లో అవసరమైన మార్పులు, సవరణలు చేయాల్సిన అవసరం ఉందని భావిస్తున్నామని తెలిపారు. యువత ఆకాంక్షలు నెరవేరేలా విధాన నిర్ణేతల దృష్టికి అంశాలను తీసుకెళ్తామని చెప్పారు. యువత మోసపోయామనే భావనకు గురికాకుండా, వారి ఆశయాలు నెరవేరేలా పాలన కొనసాగించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి విమర్శను దేశ వ్యతిరేక చర్యగా చూడటం కూడా సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు. నిజమైన యువత సమస్యలను రాజకీయ ప్రచార సాధనాలుగా మార్చడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. యువత భావోద్వేగాలను అర్థం చేసుకుని పాలనా వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలను వినడం బలహీనత కాదని, అది పరిపక్వ నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత యువత దేశానికి వ్యతిరేకం కాదని, అవకాశాలు, పారదర్శకత, వేగవంతమైన పాలనను వారు కోరుకుంటున్నారని చెప్పారు. యువత ఆకాంక్షలను గౌరవిస్తూ, జాతీయ భద్రతను కాపాడుతూ ముందుకు సాగడమే ప్రభుత్వాల లక్ష్యమని తెలిపారు.

## లోకేష్‌ను మంత్రివర్గం నుంచి తొలగించండి

**● మెగా డిఎస్సీపై సిబిఐ విచారణ జరిపించాలి: వైఎస్ జగన్**



**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించింది మెగా డిఎస్సీ నా లేక నిరుద్యోగులను మోసం చేసిన దగా డిఎస్సీ నా అని వైసీపీ అధినేత జగన్ నిలదీశారు. తమ హయాంలో ఇచ్చిన డిఎస్సీని రద్దు చేసి, కావాలనే ఆలస్యం చేస్తూ కొత్త నోటిఫికేషన్‌తో పబ్లిసిటీ చేసుకున్నారని విమర్శించారు. తీరా చూస్తే పేపర్లు లీక్ చేసి, డేటా డిలీట్ చేసి, మెరిట్ లిస్టులను మాయం చేస్తూ అభ్యర్థులకు పెద్ద ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఈ లీకులపై సిబిఐ చేత విచారణ జరిపించాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. పరీక్ష నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న ఒక ఎస్‌సిఇఆర్‌టి అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఆ వివరాలను డేటాబేస్ నుంచి ఎందుకు డిలీట్ చేశారో, మెరిట్ లిస్టులను ఎందుకు దాచారో, టాపర్ వివరాలను ఎందుకు తొలగించారో స్పష్టం చేయాలన్నారు. కేవలం సెలెక్ట్ అయిన వారికి మాత్రమే నేరుగా మెసేజ్‌లు పంపి, కలెక్టర్ ఆఫీసుల్లో సెలక్షన్ లిస్టులు పెట్టకపోవడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా పోస్టులను ఒక్కొక్కటి రూ.15 లక్షలకు అధికార పార్టీ నాయకుడే ఇంటికి పిలిచి బేరసారాలు సాగించారని ఆరోపించారు. క్రీడా మైదానంలో అడుగుపెట్టని వారికి కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చి ఉద్యోగాలు అమ్ముకున్నారని, ఇది రిక్రూట్‌మెంటా లేక వేలం పాటా అని ధ్వజమెత్తారు. టెట్ కన్వీనర్‌గా ఉన్న అధికారే డిఎస్సీ పరీక్షకూ కన్వీనర్‌గా ఉన్నప్పటికీ, ఉన్నపళంగా ఆయన్ను తొలగించి జాయింట్ డైరెక్టర్‌ను కన్వీనర్‌గా ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ మెగా అవినీతిపై చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే లోకేష్‌ను పదవి నుంచి తప్పించి, సిబిఐ దర్యాప్తు కోరి ప్రతిభ గల అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజలపై పన్నుల దోపిడి

**● సిపిఐ జాతీయ నేత డాక్టర్ నారాయణ ఆగ్రహం**




**తిరుపతి, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటంపై సిపిఐ జాతీయ కంట్రోల్ మిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ పరిణామాలను సాకుగా చూపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలను పన్నుల పేరుతో లూటీ చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకవైపు అమెరికా తన యుద్ధ కవ్వింపు చర్యలతో ఏకపక్ష దాడులకు తెగబడుతుంటే, అదే తరుణంలో ఇక్కడ పాలకులు తగుదునమ్మా అంటూ చమురు ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ధరలు పెరిగాయనే సాకుతో, ఎలాంటి హేతుబద్ధత లేకుండానే కేవలం వారం రోజుల్లోనే లీటర్ పెట్రోల్, డీజిల్‌పై దాదాపు 8 రూపాయల వరకు అదనపు భారం మోపారని, ఇంకా పెంచేందుకు సన్నాహాలు చేస్తుండటం దారుణమన్నారు. ఈ చమురు సంక్షోభ కాలంలోనే పన్నుల రూపంలో ప్రజల నుంచి దాదాపు రూ.30 లక్షల కోట్లు దోపిడీ చేశారని నారాయణ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రకరకాల పన్నుల పేరుతో చమురు ధరలను పెంచుతుంటే, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు సైతం స్థానిక పన్నుల భారం వేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నాయని డాక్టర్ నారాయణ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లోని ధరల వ్యత్యాసాన్ని ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. తమిళనాడు సరిహద్దుల్లోని నేసనాయుడు కండ్రిగలో ఉన్న పెట్రోల్ బంకులో లీటర్ పెట్రోల్ ధర రూ.108.49లు కాగా, డీజిల్ ధర రూ.100.28లుగా ఉందని పేర్కొన్నారు. అదే ఎపి పరిధిలోని నగరిలో పెట్రోల్ ధర రూ.117.85లు, డీజిల్ ధర రూ.105.45లుగా ఉందన్నారు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి తెలుగు ప్రజలను ఏ విధంగా నిలువుదోపిడీ చేస్తున్నాయో చెప్పడానికి ఈ ధరల వ్యత్యాసమే నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. చమురు ధరల పెరుగుదల కేవలం ఇంధనానికి మాత్రమే పరిమితం కాదని, దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి మార్కెట్‌లో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పాలకుల వైఖరిపై దేశవ్యాప్తంగా ముఖ్యంగా యువతలో తీవ్ర అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉందని, ఇది ఏ క్షణమైనా ఊహించని రీతిలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమంగా చెలరేగడం ఖాయమని డాక్టర్ నారాయణ హెచ్చరించారు.

# పరిశ్రమల హబ్‌గా కోవూరు

**● ఎంఎస్ఎంఇ పార్కు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



**కోవూరు (నెల్లూరు), మే 25 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగాలకు డోకా లేకుండా పెద్ద పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే కోవూరు నియోజకవర్గంలో 13 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇది కోవూరు నియోజకవర్గ ప్రతిభకు గర్భకారణం అన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక దృష్టితో పడుగుపాడులో 14.5 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే కిసాన్ సెజ్‌లో అనేక పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. గత సంవత్సరం నుంచే పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేక చొరవతో ఈ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు నాంది పడిందన్నారు. రానున్న రోజుల్లో కోవూరు నియోజకవర్గం పరిశ్రమల హబ్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రత్యేకంగా చొరవ తీసుకుని కోవూరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో భారీ పరిశ్రమలకు నిలయంగా కోవూరు నియోజకవర్గం ముందు వరుసలో ఉందన్నారు. తనను 55 వేల మెజార్టీతో గెలిపించిన కోవూరు ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఇది ప్రజలందరూ కోరే మంచి ప్రభుత్వం అని సిఎం చంద్రబాబు ఈ వయస్సులో కూడా రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగాలనే తపనతో రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా కోవూరు షుగర్ ఫ్యాక్టరీ రైతులకు, ఉద్యోగులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేను స్థానిక ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించారు.

## ఆర్‌టిసి ప్రైవేటీకరణ చేయొద్దు




**అనంతపురం, మే 25 ప్రభాతవార్త బ్యూరో:** ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ వారికి దారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్టీసీ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీ నే చూడాలని ఈ రోజు సిపిఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య, చేతివృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో అనంతపురం ఆర్టీసీ డిపో ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ.. విద్యుత్ బస్సుల వినియోగాన్ని స్వాగతిస్తున్నామని కానీ బస్సుల నిర్వహణ పూర్తిగా ఆర్టీసీ నే చూడాలన్నారు, ఇప్పటికే విద్యాధరపురం, గుంటూరు 2, నెల్లూరు2 డిపోలను పూర్తిగా ఖాళీ చేయించి ప్రైవేట్ కంపెనీల వారికి అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆర్టీసీలో ఉద్యోగుల రిక్రూట్మెంట్ దాదాపుగా 14 సంవత్సరాల నుండి ఆగిపోయిందని వెంటనే నూతన రిక్రూట్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు, ఆర్టీసీ ప్రైవేటీకరణ జరిగితే స్త్రీ శక్తి పథకం, వృద్ధులకు, వికలాంగులకు, విద్యార్థులకు రాయితీలు లేకుండా పోతాయన్నారు. ప్రజల ఆస్తి అయినటువంటి ఆర్టీసీ ఆస్తులను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడలోని 400 కోట్ల రూపాయలు విలువ చేసే ఆర్టీసీ స్థలాన్ని లులు కంపెనీ వారికి 99 సంవత్సరాల లీజుతో ఇప్పటికే అప్పచెప్పారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకొని ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి, ఉద్యోగుల రిక్రూట్మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, నగర సహాయ కార్యదర్శి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, ఏఐటీయూసీ నాయకులు లెనిన్ బాబు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు చైన్ స్నాచర్లు అరెస్ట్






**తిరుపతి, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** దురలవాట్లు, సులభంగా డబ్బు సంపాదించడం కోసం చైన్ స్నాచర్లుగా మారిన ఉన్నత విద్యావంతులు చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో మొత్తం తొమ్మిది బంగారు గొలుసు దొంగతనాల నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తిరుపతి నగరంతో పాటు నెల్లూరు, కావలి, గూడూరు ప్రాంతాల్లో వరుస గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల అంతర్ జిల్లా దొంగల ముఠాను తిరుపతి క్రైమ్, వెస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను సోమవారం సాయంత్రం తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఆర్ల శ్రీనివాసులు వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఇటీవల తిరుపతిలో జరిగిన గొలుసు దొంగతనాల కేసుల దర్యాప్తుకు అదనపు ఎస్పీ క్రైమ్స్ ఆర్ల శ్రీనివాసులు నేతృత్వంలో డిఎస్పీ ఎం. భక్తవత్సలం పర్యవేక్షణలో వెస్ట్ పోలీస్ స్టేషన్ సిఐ పి.రామకృష్ణ, క్రైమ్ సిఐ ఎన్.శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో బెంగళూరుకు చెందిన నెల్లూరు జిల్లా తూర్పు ఎర్రబల్లి గ్రామవాసి శీలం నాగార్జున రెడ్డి(28) అగ్రికల్చరల్ బీఎస్సీ పూర్తి చేశాడు. నెల్లూరు జిల్లా వింజమూరు మండలంకు చెందిన నల్లగొండ వెంకట మురళి (26), బీకాం కంప్యూటర్స్ గ్రాడ్యుయేట్. నెల్లూరు జిల్లా పప్పుల వీధికి చెందిన లింగాలదిన్నె విష్ణువర్ధన్ రెడ్డి (28), బీఎస్సీ స్టాటిస్టిక్స్ చదివి, బెంగళూరులోని బైజూస్ కంపెనీలో సిస్టమ్ ఇంజనీర్‌గా పనిచేశాడు. సులభంగా డబ్బు సంపాదించాలని తప్పుదోవ పట్టారు. వీరినుండి రూ.25 లక్షల విలువ చేసే సుమారు 130 గ్రాముల బంగారు ఆభరణాలు, మోటారుసైకిళ్ళు, మొబైల్ ఫోన్లు, హెల్మెట్లు, క్యాపులు, మాస్కులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురూ సన్నిహిత మిత్రులని, ఉన్నత చదువులు పూర్తి చేసినప్పటికీ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వంటి దురలవాట్లకు బానిసలై ఉద్యోగాలు కోల్పోయి విలాసవంతమైన జీవనానికి అలవాటు పడటంతో సులభంగా డబ్బు సంపాదించడానికి కోసం చైన్ స్నాచర్లుగా మారినట్లు విచారణలో వెల్లడైంది. దొంగలించిన బంగారు ఆభరణాలను తిరుపతిలో విక్రయించి తిరిగి విలాసాల కోసం డబ్బు సమకూర్చుకునేందుకు మరో చైన్ స్నాచింగ్‌కు కుట్ర పన్నుతున్న సమయంలో పోలీసులు సకాలంలో స్పందించి నిందితులను అరెస్ట్ చేసి కుట్రను భగ్నం చేశారు. ఈ కేసును అత్యంత వేగంగా, చాకచక్యంగా ఛేదించిన అడిషనల్ ఎస్పీ క్రైమ్స్ ఆర్ల శ్రీనివాసులు, డిఎస్పీ ఎం.భక్తవత్సలం నేతృత్వంలోని తిరుపతి వెస్ట్, క్రైమ్ పోలీస్ అధికారులను, ప్రత్యేక బృందాల సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

## విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

**● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది విధులను నిర్వహించాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 51 వినతులు అందాయి. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా అందే సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని, ఆ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్‌డి) కే.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం. మురళికుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం.ఉమాపతి, కే.సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు సురేంద్ర రావు, చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, లత, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.




## బంగారు గొలుసు అప్పగింత

**తిరుమల, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనానంతరం హడావిడిగా గది ఖాళీ చేసుకుని వదలివెళ్లిన బంగారు గొలుసును సురక్షితంగా టిటిడి సిబ్బంది భక్తులకు చేర్చారు. సోమవారం ఉదయం ఈ సంఘటన జరిగింది. గుంటూరుకు చెందిన నాగరాజు కుటుంబం సన్నిధానం విశ్రాంతి భవనం 5వ నంబర్ గదిలో దిగారు. శ్రీవారిని దర్శించుకుని గదిని ఖాళీ చేశారు. హడావిడిలో ఓ బ్యాగ్ వదలిపోయారు. అందులో సుమారు రూ.4 లక్షల విలువైన బంగారు గొలుసు ఉంది. దీన్ని గమనించిన సిబ్బంది వెంటనే పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్ డి.భాస్కర్ నాయుడుకు అప్పగించారు. ఆయన రికార్డుల్లోని వివరాల మేరకు భక్తులకు తిరిగి అప్పగించారు.

## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో జయప్రద



నటి జయప్రద కుటుంబసభ్యులకు మెమొంటో అందిస్తున్న ఛైర్మన్, ఇఒ

**శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త:** భోళాశంకరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం సినీ నటి జయప్రద విచ్చేశారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టెసాయి ప్రసాద్ సారధ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆమె కుటుంబ సభ్యులతో హాజరు కాగా, వారికి ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వాగతం పలికిన వారిలో ధర్మకర్తల మండలి సభ్యులు పగడాల మురళి, వాకచర్ల గుర్రప్పశెట్టి, ఇఒ బికె వెంకటేశులు, ప్రోటోకాల్ ఎఇఒ మోహన్, ఎపిఆర్ఓ రవిలు ఉన్నారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనం నాయుడు ఉన్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయానికి విరాళం అందిస్తున్న హైదరాబాదు వాస్తవ్యులు

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

**శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. సోమవారం హైదరాబాద్‌కు చెందిన పసుపులేటి రవితేజ భ్రమరి దంపతులు కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసినవారు సంతృప్తితో విరాళం అందించుటకు ఎఇఒ మోహన్‌ను సంప్రదించారు. వారు రూ.లక్ష చెక్కును ఎఇఒ ద్వారా ఆలయ ఆర్థిక శాఖకు అందించారు. వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాల దర్శనంతో పాటు వేదపండితులచే ప్రత్యేక ఆశీర్వచనాలను ఎఇఒ మోహన్ ఏర్పాటు చేసారు. ఆశీర్వచనాలను ఎపిఆర్ఓ రవి పర్యవేక్షణలో ఏర్పాటుచేసారు.

## పని చేయని సర్వర్లతో తిప్పలు

**● పూజలు చేయించుకోకుండా వెనుదిరిగిన భక్తులు**

**● అధికారులపై అసహనం.. స్పందించిన అధికారులు**



ఆన్‌లైన్ టిక్కెట్లు కోసం టికెట్ మిషన్ల వద్ద భక్తుల పడిగాపులు

**శ్రీకాళహస్తి, మే 25 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో అన్ని సేవలు, పూజలను ప్రభుత్వాదేశాల మేరకు 'ఆన్‌లైన్' చేసారు. దాంతో గత మూడు రోజులుగా సర్వర్లు పని చేయక భక్తులు తిప్పలు పడుతున్నారు. సోమవారం ఉదయం రాహుకాల సమయంలో పూజలకు వచ్చిన భక్తులకు సర్వర్లు పని చేయక పోవటంతో అసహనానికి గురయ్యారు. వెంటనే అధికారుల స్పందించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసినప్పటికి వచ్చిన భక్తులు పూజలు చేయించుకోలేక పోయారు. దాంతో కొందరు అవగాహన లేని భక్తులు నొచ్చుకుంటూ పూజలు చేయించుకోకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితి. భక్తి భావంతో వచ్చిన భక్తులు దర్శనం లేకుండా వెనుదిరగాలంటే ఎంతో బాధ వ్యక్తం చేసారు. ఆదివారం అస్ట్రేలియాలో ఉంటున్న ఓ కుటుంబానికి చెందిన వ్యక్తి అనారోగ్యానికి గురికాగా ఓ అర్చకుడు శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభిషేకం చేయించాలని సూచించగా చెన్నైలో ఉంటున్న ఇద్దరు మహిళలు ఇక్కడకు వచ్చారు. అయితే ఇక్కడకు వచ్చిన తరువాత రుద్రాభిషేకం టిక్కెట్లు లేవు అనటంతో వారు తల్లడిల్లిపోయారు. కౌంటర్లలో అడిగితే నో ఛాన్స్ అన్నారు. అధికారులను మొరబెట్టుకుంటే ససేమిరా అన్నారు. దాంతో ఆమె కళ్ళు చెమర్చాయి. ఇది గమనించిన ఒకరు ధర్మకర్తల మండలి సభ్యుని కోటాలో టిక్కెట్లు కొనిచ్చి అభిషేకాలు జరిపించి వారిని ఓదార్చారు.

**సమాచారం లేక అమలు:** ఆలయాల్లో మార్పులు, చేర్పులు, సంస్కరణలకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే సమయంలో ముందుగా భక్తులకు అవగాహన కల్పించాలి. అలాగే సంస్కరణలకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలి. అయితే ప్రభుత్వం చెప్పింది తాము అమలు చేస్తున్నామని కాకుండా ముందుగా భక్తులకుసమాచారం ఇవ్వాల్సింది. అలాగే దశల వారిగా అమలు చేసి ఉండాలి. కానీ అలా కాకుండా ఒకే సారి అన్ని 'ఆన్‌లైన్' అనటంతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది.

**రెండు రోజులుగా సర్వర్లు మొరాయింపు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండు రోజులుగా ఆన్‌లైన్ సర్వర్లు మొరాయిస్తున్నాయి. దాంతో భక్తులు తిప్పలు పడుతున్నారు. ఆదివారం కూడా సర్వర్లు మొరాయింగా ఆలయ ఇఒ బికె వెంకటేశులు స్పందించి మ్యానువల్ టిక్కెట్లను జారీ చేసి సముదాయించారు.

## నేడు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ భాగస్వాముల సదస్సు

**మెడ్‌టెక్ ఛాలెంజ్ గ్రాండ్ విజేతల ఎంపిక**

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కృతిమ మేధో(ఎఐ) ఆధారిత ఆరోగ్య వ్యవస్థ వ్యూహాత్మక భాగస్వాముల సదస్సు, "మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్" ఫైనల్ కార్యక్రమం మంగళవారం జరగనుంది. ఆరోగ్య రంగంలో రకరకాల కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంకుర సంస్థలు, ఏజెన్సీల ముఖ్య ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, ఇతర రంగాలకు చెందిన వారు కలిపి సుమారు 300 మంది ఈ సదస్సు, మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్ కార్యక్రమానికి హాజరుకాబోతున్నారు. ప్రభుత్వాసుపత్రు (పైలట్)ల్లో ఏఐ ఆధారిత సేవలు అందించిన అంకుర సంస్థల ప్రతినిధులు తమ అనుభవాలను మంగళగిరిలోని జరిగే ఈ సదస్సులో డెమో ద్వారా సభికులకు వివరించనున్నారు. మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్‌లో విజేతలుగా నిలిచే అంకుర సంస్థలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నగదు పారితోషికాలు అందచేస్తారు.

**4 కేటగిరీల్లో 18 అంకుర సంస్థల నూతన ఆవిష్కరణలు:** ఎపి మెడ్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ప్రకటనకు అనుగుణంగా దయాగ్నస్టిక్ టూల్స్ కేటగిరి, పోర్టబుల్ పాయింట్ ఆఫ్ కేర్ కేటగిరి, స్మార్ట్ మానిటరింగ్ అండ్ వేరియబుల్స్ కేటగిరి (శరీరానికి ఉప పరికరాలు అమర్చి), రిమోట్ కేర్ టెలిమెడిసన్ కేటగిరీల్లో 18 అంకుర సంస్థలు ప్రభుత్వాసుపత్రుల్లో తమ సేవలను అందించాయి. మొత్తం 37 రోజుల వ్యవధిలో సుమారు 15 వేల మంది రోగులకు వైద్యుల సమక్షంలో సేవలు అందించాయి. టిబి, ఐ స్క్రీనింగ్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్, నవజాత శిశువుల్లో శ్వాశ సంబంధిత సమస్యలు, గుండె సంబంధిత సమస్యలు, రోగులతో వైద్యులు ఏఐ స్క్రైబ్ ద్వారా మాట్లాడడం, వంటి కొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవలు అందించడంలో పోటీపడ్డాయి. రోగులకు అందించిన వైద్య సేవలు, వాటి ఫలితాలను క్యాథ్ కమిటీ (కమిటీ ఫర్ అప్లైడ్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్) 4 కేటగిరీల్లో ప్రోత్సాహకాల్ని అందించేందుకు సంస్థల్ని మంగళవారం ఎంపిక చేయనున్నారు. ఈ కేటగిరిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చే అంకుర సంస్థలకు (మొత్తం 12) కూటమి ప్రభుత్వం రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున కలిపి మొత్తం రూ.40 లక్షలను ప్రోత్సాహకాల కింద ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ కార్యక్రమం మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో జరుగనుంది. సిఎం చంద్రబాబు విజన్ అనుసరించి.. ప్రయోగాత్మక విధానంలో జరిగిన ఏఐ ఆధారిత సేవలు మంచి ఫలితాలు ఇచ్చాయి.

**వైద్య సేవల్లో ఏఐ వినియోగంపై ప్రత్యేక సదస్సు:** వైద్య సేవల్లో ఏఐ వినియోగంలో బెస్ట్ ప్రాక్టీసెస్ గురించి విడిగా జరిగే సదస్సులో పలువురు నిపుణులు వివరించనున్నారు. నేషనల్ హెల్త్ అథారిటీ జాయింట్ సెక్రటరీ కిరణ్ గోపాల్ వస్క, గోవిన్ క్యాపిటల్(సింగపూర్) ఫౌండర్ సిఇఒ డాక్టర్ ఆనంద్ గోవిందలూరి, అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా డాక్టర్ వైవియస్ ప్రభాకర్, రెడిక్స్ ఇన్ఫినిట్ (టొరంటో, కెనడా) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ గణేషన్ వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధరబాబు సదస్సులో పాల్గొననున్నారు.

# క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం

**- తిరుపతి జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య**



**తిరుపతి, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని తిరుపతి జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య సూచించారు. మహానాడుకు ముందు ఆయన జోనల్ కోఆర్డినేటర్‌గా తొలిసారి తిరుపతికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ ముఖ్య నాయకులు కలిశారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు సమిష్టిగా అడుగులు వేయాలన్నారు. తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో తిరుపతి జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్యని, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ్మ, తుడా ఛైర్మన్, టిడిపి ప్రధాన కార్యదర్శిసి. డాలర్స్ దివాకర్ రెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి, నాయకులు సుగుణమ్మ, శ్రీధర్‌వర్మ, వి.పుష్పావతియాదవ్, నరసింహాయాదవ్, బుల్లెట్ రమణ, కంకణాల రజనీకాంత్ నాయుడు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కుల

# అభివృద్ధికి కృషి



**వచ్చిన పెట్టుబడులలో 60 శాతం విశాఖ రీజియన్ కే -ఇంటికో పారిశ్రామిక వేత్త ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్ అభిషిక్ కిషోర్**

విశాఖపట్నం-ప్రభాతవార్త

జిల్లాలో ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ నుండి 38 ఇండస్ట్రియల్ పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం కంచరపాలెంలో 14.50 కోట్ల వ్యయంతో నిర్మించే ఫ్లోటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలిసి సోమవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెస్ ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్ పెన్యూర్ నినాదంతో యువతను పారిశ్రామిక రంగంలోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో 138 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసింద న్నారు. జిల్లాలో ఏడు ఎస్ఎంఈ పార్కులకు గాను ఆరు పార్కులకు శంఖు స్థాపన చేయడం జరిగిందని, పెదగంట్యాల్లో పార్కు ఇప్పటికే ప్రారంభమైందని, మిగిలిన పురోగతిలో ఉన్నాయని తెలిపారు .విశాఖపట్నం సౌత్‌లో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయవలసి ఉందని, సౌత్ నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయవలసి ఉందని, సౌత్ నియోజకవర్గం పోర్టు ప్రాంతంలో ఉంది కాబట్టి విశాఖపట్నం పోర్టు అధికారులతో మాట్లాడి ఒక లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ. పాలసీతో 10 కోట్లతో ఇండస్ట్రీ పెడితే 75% వరకు ఇన్సెంటివ్స్, రాయితీ రూపంలో వెనక్కు తెచ్చుకోగలిగే అవకాశం ఉందన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ.లు పెడుతున్న ప్రతి ఒక్కరూ దీన్ని అర్థం చేసుకోవాలని, ఐటిఐ చదువుతున్న యంగ్ స్టూడెంట్స్‌లో అవగాహన తీసుకు రావాలన్నారు. అప్పుడే మనం పెట్టుకున్న వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్ప్రెన్యూర్ నినాదం సాధ్యమవుతుందన్నారు. యువ పారిశ్రామికవేత్తలను సహకారం అందించడానికి రతన్ టాటా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. గత రెండు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం 28 ఇండస్ట్రియల్ పాలసీలు తీసుకువచ్చిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో దేశానికి వచ్చిన ఇన్వెస్ట్మెంట్‌లో 16% మన రాష్ట్రానికి వచ్చాయని, రెండో సంవత్సరంలో వచ్చే వచ్చిన ఇన్వెస్ట్మెంట్లలో 25 శాతం మన రాష్ట్రానికి వచ్చాయని అన్నారు. రాష్ట్రానికి వచ్చిన 10 లక్షల కోట్ల ఇన్వెస్ట్ మెంట్లలో సుమారు 60శాతం పైగా విశాఖ ఎకనామిక్ రీజియన్ (9 జిల్లా లకు) కే రావడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇది మన ప్రాంతానికి సువర్ణ అవకాశం అని,దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### యువతను పారిశ్రామిక విధాలుగా చేయడమే లక్ష్యం

శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ నార్త్ నియోజకవర్గ పరిధిలో ఫ్లోటేడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ 83 సెంట్లు విస్తీర్ణంలో 36 మంది 8వ పేజీలో

## రూ.33,660 కోట్లతో

# ‘భవ్య’ పథకం ప్రారంభం..

**100 ప్లగ్-అండ్-ప్లే పార్కులతో పారిశ్రామికీకరణకు ఊతం.. 15 లక్షల మందికి ఉపాధి అవకాశాలు : ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్**



విశాఖపట్నం, ప్రభాతవార్త

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని, దేశీయ ఉత్పాదక రంగాన్ని బలోపేతం చేయడం మరియు ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులను అభివృద్ధి చేయడం లక్ష్యంగా రూ.33,660 కోట్ల వ్యయంతో “భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య)” పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని ఆంధ్ర ప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఆరు సంవత్సరాల వ్యవధిలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో దేశవ్యాప్తంగా 100 ప్లగ్-అండ్-ప్లే పార్కులను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. తొలి దశలో 50 పార్కుల ఏర్పాటుకు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించగా, “ఛాలెంజ్ మోడ్” విధానంలో మొదటి రెండు నెలల్లో 20 పార్కులు, తదుపరి రెండు నెలల్లో మరో 30 పార్కులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 100 నుంచి 1000 ఎకరాల విస్తీర్ణంలో (కొండ ప్రాంత రాష్ట్రాల్లో కనీసం 25 ఎకరాలు) గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల రూపంలో ఈ పార్కులు అభివృద్ధి చేయబడతాయని చెప్పారు. మౌలిక వసతుల కల్పన కోసం ఎకరానికి గరిష్ఠంగా రూ.1 కోటి వరకు కేంద్రం సహాయం అందించనుండగా, ప్రైవేట్ భాగస్వామ్య ప్రాజెక్టులకు ఎకరానికి రూ.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందని వెల్లడించారు. క్లస్టర్ ఆధారిత అభివృద్ధి ద్వారా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు మరియు గ్లోబల్ పెట్టుబడిదారులకు “రెడీ టు యూజ్” ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ అందుబాటులోకి రానుందని మాధవ్ తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన రహదారులు, విద్యుత్, నీటి సరఫరా, లాజిస్టిక్స్ వంటి అన్ని ఆధునిక సదుపాయాలతో కూడిన పారిశ్రామిక పార్కులు ఈ పథకం కింద అభివృద్ధి చేయబడతాయని పేర్కొన్నారు. “ప్లగ్ అండ్ ప్లే” విధానంలో పరిశ్రమలు వేగంగా స్థాపించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయడం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆయన అన్నారు. ఎగుమతుల ప్రోత్సాహం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు), అలాగే “ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” సంస్కరణలు దేశ పారిశ్రామికీకరణకు మరింత దోహదపడతాయని పేర్కొన్నారు. భవ్య పథకం ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను పెంపొందించడం 9వ పేజీలో

## పెందుర్తి, దగ్గువానిపాలెం, రాడివారి కళ్లాల్లో ప్రభుత్వ భూములను

# కబ్జా చేస్తున్న గండి బాబ్జీని అడ్డుకోండి..






విశాఖపట్నం, ప్రభాతవార్త

పెందుర్తి మండలం, దగ్గువాని పాలెం, రాడివారి కళ్లాలు సర్వే నంబర్ 107/11లో గల 8.08 ఎకరాల ప్రభుత్వ భూముల దురాక్రమణను సాగిస్తున్న గండి బాబ్జి చట్ట విరుద్ధ చర్యలను అడ్డుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి విజ్ఞప్తి చేశారు. అదే భూమిపై ఇళ్ళు కట్టుకొని నివసిస్తున్న అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ బాధితులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. అనం తరం ఆమె బాధితులతో కలిసి పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మీడియాతో 8వ పేజీలో

## ఎంబీబీయస్ పరీక్షా ఫలితాల్లో

# ఏఎంసికి 93.6శాతం ఉత్తీర్ణత

**తొమ్మిది డిస్టింక్షన్లతోపాటు 152 ఫస్ట్ క్లాసులు- 74 సెకండ్ క్లాస్‌లు కైవసం**

**-అధ్యాపకులు పీజీలు గ్రాడ్యుయేట్లను అభినందించిన అదనపు డిఎంఇ డా.సంధ్యాదేవి**



8లో

# విశాఖ పోర్ట్‌లో కేంద్ర మంత్రి సురేష్ గోపి పర్యటన

**పోర్టు అభివృద్ధి, హరిత కార్యక్రమాలను అభినందించిన మంత్రి**



8లో

# గంటా శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలిసిన మళ్ల సురేంద్ర



విశాఖపట్నం - ప్రభాతవార్త

భీమిలీ నియోజకవర్గం టీడీపీ అబ్సర్వర్‌గా నియమితులైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళా సురేంద్ర, ఈ సందర్భంగా మాజీ మంత్రి, శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుని విశాఖలో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గ పార్టీ పరిస్థితుల, ఈ నెలలో 27, 28న జరగబోతున్న మహానాడు విజయవంతం చేయడం గురించి చర్చించిన అనంతరం మళ్ళా సురేంద్రను అభినందించి శుభాకాంక్షలు మాజీ మంత్రి, భీమిలీ శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు తెలిపారు.

# సింహాచలంలో రాత్రి 7కే దర్శనాలు ముగింపు

**నమ్మాళ్వార్ తిరునక్షత్రం నేపథ్యంలో ఈ నెల 26 నుంచి 28 వరకు ప్రత్యేక ఏర్పాట్లు**



8లో

# ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ

విశాఖపట్నం- ప్రభాతవార్త

నగరంలో వున్న వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ పాల్గొని బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సమస్యల పరిష్కారంపై నిర్ణీత గడువులో బాధితులకు సమాచారం అందించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ ప్రజా దర్బార్‌కు మొత్తం 6 వినతులు అందాయి. వాటిలో ప్లానింగ్‌కు సంబంధించినవి 2, ఇంజనీరింగ్‌కు సంబంధించినది 1, ఎస్టేట్‌కు సంబంధించినవి 2, ఇతర సేవలకు సంబంధించినది 1 ఉన్నాయి. కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, డీఎఫ్ఓ శిరీష, ముఖ్య ప్లానింగ్ అధికారి దివ్యలత, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మహానాడును విజయవంతం చేయండి..



టీడీపీ యువ నాయకులు కర్రి సాయికృష్ణ

విశాఖపట్నం - ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ యువనాయకులు కర్రి సాయికృష్ణ పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28 తేదీలలో నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమం రద్దు అయిన నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ విధానంలో ఆయా క్లస్టర్లలో మహానాడు నిర్వహిం చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మునగపాక పరిధిలోని క్లస్టర్-6 మహానాడు కార్యక్రమాన్ని మునగపాకలో నిర్వహించనున్నట్లు క్లస్టర్-6 ఇన్‌చార్జి కంద్రేగుల శంకర్ తెలిపారు. అలాగే క్లస్టర్-7 మహానాడు కార్యక్రమాన్ని వెంకటాపురంలోని రిసార్ట్‌లో నిర్వహించనున్నట్లు క్లస్టర్-7 ఇన్‌చార్జి దొడ్డి రమేష్ వెల్లడించారు. మహానాడు నిర్వహణకు సంబంధించి వేదిక, అలంకరణ, భోజన వసతి, ఇతర ఏర్పాట్లను ఈరోజు ఉదయం టీడీపీ యువనాయకులు కర్రి సాయికృష్ణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరసెట్టి శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అడారి మంజు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 27, 28 తేదీలలో జరగనున్న మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. మునగపాక మండల పరిధిలో రెండు క్లస్టర్లలో మహానాడు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉల్లింగల గోవింద్, దొడ్డి బుజ్జి, కంద్రేగుల గణేష్, మల్ల నర్సింహారావు, దాడి శ్రీను, దాడి గంగాజీ, సూరిశెట్టి రాము, ఎదురి రాము తదితరులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



8లో



# ఎస్సీ కమిషన్ సభ్యుడికి ఘన సత్కారం

గాజువాక,మే 25,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారామ్‌ను 'సూర్య' దినపత్రిక ఉత్తరాంధ్ర బ్యూరో చీఫ్ చెట్ల రాము, విశాఖ ప్రతినిధి బొడ్డు వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విశాఖలోని కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం, పత్రిక డైరీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాల సాధనకు, అణగారిన వర్గాల హక్కుల రక్షణకు కమిషన్ కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని, వివక్షకు గురైన వారికి చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. అలాగే, దళిత యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలపై గ్రామస్థాయి నుంచి అవగాహన పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు.

# తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

## బంగారం చోరీ కేసులను ఛేదించిన పోలీసులు

## నిందితుడు అరెస్ట్.....230 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

ఆనందపురం, మే 25, ప్రభాతవార్త



ఆనందపురం, పద్మనాభం, భోగాపురం మండలాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస బంగారం చోరీలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పలు కేసులను సమగ్రంగా దర్యాప్తు చేసిన అనంతరం నిందితుడి వద్ద నుంచి సుమారు 230 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆనందపురం మండలం చందక గ్రామానికి చెందిన రెడ్డి రమేష్ ఈ ఏడాది ఏప్రిల్ 2న ఇంటికి తాళం వేసి, తాళం చెవిని ఇంటి బయట ఉంచి పనిమీద వెళ్లాడు. అనంతరం ఇంటికి వచ్చిన ఆయన భార్య తాళం చెవి కనిపించకపోవడంతో అనుమానం వ్యక్తం చేసి భర్తకు సమాచారం ఇచ్చింది. ఇంటికి చేరుకున్న రమేష్ వెనుక తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించాడు. ఇంట్లోని కబోర్డులో ఉంచిన చేప లాకెట్‌తో కూడిన బంగారు చైన్, అర తులం గణపతి ఉంగరం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అలాగే శిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ శంకర్ కుటుంబ సభ్యులు కూడా ఇంటి తాళం చెవిని బయట ఉంచి వెళ్లే అలవాటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఏప్రిల్ 7న కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో భద్రపరిచిన మూడున్నర తులాల బంగారు గొలుసు, మూడున్నర తులాల బంగారు హారాన్ని అపహరించాడు. పాలవలస గ్రామానికి చెందిన మద్ది శివ ఇంట్లో కూడా ఇదే తరహాలో చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లిన సమయంలో దొంగ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన పుస్తెలతాడు, రెండు తులాల బంగారు చైన్, అర తులం బంగారు బుట్టలు, నాలుగు చిన్న బంగారు ముక్కలను దొంగిలించాడు. ఇవే కాకుండా భోగాపురం మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఇప్పిలి అప్పలకొండ ఇంట్లో బంగారు నెక్లెస్, ఉంగరాలు చోరీకి గురయ్యాయి. అలాగే పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన భావన అప్పలరాజు ఇంట్లో రెండున్నర తులాల బంగారు చైన్, బోత్సపేట గ్రామానికి చెందిన బొత్స సత్యవతి ఇంట్లో బంగారు నెక్లెస్ చోరీ అయినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ ఘటనలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ వరుస చోరీ ఘటనలను విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ప్రత్యేకంగా పరిశీలించారు. డీసీపీ క్రైమ్స్ కె. లతా మాధురి, ఏసీపీ క్రైమ్స్ జి. భవ్యరెడ్డి పర్యవేక్షణలో నార్త్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బి.ఎస్.ఎస్. ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలు, స్థానిక సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు చివరకు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడు పున్నాన రాంబాబు అలియాస్ నిహాన్ (31)గా గుర్తించారు. అతడు విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పి.కే. పాలవలస గ్రామానికి చెందినవాడని వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 230 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాళం చెవులను ఇంటి బయట ఉంచడం వల్లే ఈ చోరీలు సులభమయ్యాయని పేర్కొంటూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కేసులను ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన నార్త్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బి.ఎస్.ఎస్. ప్రకాష్, డీఎస్ఐ ఎస్కే షరీఫ్, ఏఎస్ఐ కేబీజీ రాజు, కానిస్టేబుళ్లు బంగార్రాజు, అప్పలనాయుడు, తాతంనాయుడు, అప్పలరాజు, పాపారావులను ఉన్నతాధికారులు అభినందించారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలి

## జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ ఈ.ఎన్.వి.నరేష్ కుమార్

## -సీతమ్మధార రైతు బజార్లో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర హానికరమని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తూర్పు జోన్ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 23వ వార్డు పరిధిలోని సీతమ్మధార రైతు బజార్లో "ప్లాస్టిక్ వినియోగాన్ని స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారులు, దుకాణదారులు, స్థానిక ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా వస్త్ర సంచులు, నార సంచులు, పేపర్ బ్యాగులు, స్టీల్ కంటైనర్లు, బయోడిగ్రేడబుల్ ప్లేట్లు మరియు కప్పులను వినియోగించాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించి, సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణానికి పర్యావరణహిత అలవాట్లు ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26లో విశాఖ నగరం పరిశుభ్ర నగరంగా, ప్లాస్టిక్ రహిత నగరంగా,పర్యావరణహిత నగరంగా దేశంలోనే ప్రథమ స్థానం పొందేందుకు వ్యాపారులు, కొనుగోలుదారులు, ప్రజలు సహకరించాలని సీఎంహెచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ బి. ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మార్కెట్ వ్యాపారులు మరియు ఇతర జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ పిజిఆర్ఎస్‌కు 69 ఫిర్యాదులు

విశాఖపట్నం, మే 25 ప్రభాతవార్త



పోలీసులు నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు సోమవారం 69 ఫిర్యాదులు వచ్చాయి. ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) నిర్వహించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత భాగ్చి ఆదేశాలతో డిసిపి-02 మేరీ ప్రశాంతి, డి.సి.పి క్రైమ్స్ కే లతామాధురి, నగర సబ్-డివిజన్ ఏ.సి.పిలు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనీ, ఫిర్యాదులు స్వీకరించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి 69 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా పోలీసు ఉన్నతాధికారులకు అందజేసినారు. పోలీసు ఉన్నతాధికారులు ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదిదారులతో స్వయముగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించ వలసినదిగా ఆదేశాలు ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

# ప్రజలకు నేరాలపై అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం, మే 25 ప్రభాతవార్త

నగరంలో ప్రజలకు నేరాలపై పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించారు.

కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నగరంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాలపై అవగాహనా సదస్సు నిర్వహించి, సైబర్ నేరాల పట్ల, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎపుడైనా ఇంట్లో అందరూ ఊరు వెళితే ఎల్ హెచ్ ఎం ఎస్ సేవలు వినియోగించుకోవాలని, వాహనాలు బయట పార్కింగ్ చేస్తే తాళం సరిగా వేయాలని, వాకింగ్‌కు వెళ్లే వారు బంగారు ఆభరణాలు ధరించరాదని తెలిపారు. ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దానివలన ప్రతి ఒక్కరి భద్రతతో పాటు, నేరస్తులను గుర్తించడం నేరాలు నివారించడంలో ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు, ఇంట్లో పనివాళ్ళని నియమించుకునేటప్పుడు వారి యొక్క పూర్తి వ్యక్తిగత వివరాలు తెలుసుకోవాలని సూచించారు.





# ఘనంగా వంటాలమామిడిలో 'జన్ భాగీదారీ అభియాన్' ముగింపు వేడుకలు : ఐటీడీఏ పీఓ ఆదిత్య వర్మ

పాడేరు,మే25,ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'జన్ భాగీదారీ అభియాన్' కార్యక్రమ ముగింపు వేడుకలలో సోమవారం మధ్యాహ్నం పాడేరు మండలం వంట్లమామిడి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం వంట్లమామిడిలో ఏర్పాటుచేసిన జాతీయ గరిమ ఉత్సవ్ 2026, జన్ భగీదారీ అభియాన్, "సబ్సే దూర్- సబ్సే పెహలే " ఈనెల 18వ తారీకు నుండి 20వ తారీకు వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించడం జరిగిందని ముగింపు కార్యక్రమాన్ని వంటలు మాములుగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముందుగా బిర్సముండా, అల్లూరి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ చేసారు. ఈ మెగా క్యాంప్‌లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ మాట్లాడుతూ ఈ పథకాల ద్వారా ప్రతి ఒక్క గిరిజన మహిళ ఆర్థికంగా నిలదుక్కోవడమే కాక ప్రతి ఒక్కరూ వ్యాపారవేత్తగా ఎదగాలని లక్ష్యంతో ఈ పథకాలు అమలు జరుగుతున్నాయని వీటిని ఏ విధంగా అందిపుచ్చుకోవాలో ఇలాంటి సదస్సుల ద్వారా అవగాహన తెచ్చుకుని గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయాన్ని పొంది ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రకృతి పరంగా ఎన్నో వనరులు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే చాలని తెలిపారు. గ్రామీణ మహిళలు వీడి వీకల ద్వారా తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులు ఎంతగానో బాగుందని, వాటిని మార్కెటింగ్ చేసే విధానం తెలుసుకుంటే మీరంతా వ్యాపారవేత్తలవడం తధ్యమని అన్నారు. జిల్లాలో ఐటీడీఏ ద్వారా గ్రామీణ పేద మహిళలకు అన్ని రకాల శిక్షణలు ఇస్తూ వారు ఆర్థికంగా బలోపేతం చెందేందుకు సబ్సిడీల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఏం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో భారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 777 గ్రామాలకు ఈ పథకం జాన్ భగీ దారీ అభియాన్ అమలు జరిగిందని, 260 గ్రామాలకు డిఏజుగా పథకం కింద లబ్ధి పొందుతున్నారన్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా ప్రజలకు క్యాంపు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై వివరించారు. ఈ ముగింపు వేడుకల్లో భాగంగా ప్రజల సౌకర్యార్థం, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వారు ఏర్పాటుచేసిన మెడికల్ హెల్త్ క్యాంపు, ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్లో మిల్లెట్స్ తో తయారుచేసిన వివిధ రకాల వంట వంటకాలు, ప్రకృతి ఉత్పత్తులను పరిశీలించి మిల్లెట్స్ తో తయారు చేసిన వంటకాలను ఆయన రుచి చూశారు. జిల్లా ఘోరమైన అభివృద్ధి సంస్థ, నాబార్డు, వెలుగు, ఏ ఎస్ఆర్ జిల్లా పాడేరు వందన వికాస్ కేంద్రం ద్వారా తయారు చేసిన వివిధ రకాల పచ్చళ్ళు తినబండారాలను పరిశీలించారు, ఈ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ సెంటర్ ను కూడా ఆయన పరిశీలించారు. అధికారులచే గ్రామంలో పర్యటన (ట్రాన్సిట్ వాక్), ఉచిత మెగా వైద్య శిబిరం (మెగా మెడికల్ క్యాంప్), ఆధార్ నమోదు మరియు సవరణ స్టాల్, విడివికె, స్టాల్, ఐసీడీఎస్ స్టాల్, గృహ నిర్మాణ లబ్ధిదారుల నమోదు (హౌసింగ్ స్టాల్), పీఎం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల నమోదు స్టాల్లను కేంద్ర బృందం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ 'జన్ భాగీదారీ అభియాన్' క్షేత్రస్థాయి పరిశీలన, డాక్యుమెంటేషన్ కొరకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు చిరాగ్ ఖురానా (టీమ్ లీడర్), వరుణ్ జునేజా (కో-టీమ్ లీడర్)లతో కూడిన బృందం ఐటిడిఏ పీఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పాడేరు ఎంపీడీఓ,నోడల్ అధికారిగా తేజ రతన్, వంటాలమామిడి పంచాయతీ కార్యదర్శి గ్రామ స్థాయి అధికారిగా భారతి వ్యవహరిస్తూ, ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. ఎంపీటీసీ ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ పాంగిరాము, డిఆర్డిఏ పిడి మురళి, ఐసిడిఎస్ పిడి ఝాన్సీరాంపడాల్, జిల్లా అదనపు మెడికల్ అధికారి డా. ప్రతాప్, ఐటిడి పరిపాలన అధికారి హేమలత, ఈఈ పిఆర్ పడాల్, మైక్రో ఇరిగేషన్ అధికారి రహీం, ఇతర జిల్లా అధికారులు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# సమస్యల సాధనకు అంతా కలిసికట్టుగా ఉండాలి

## మండల దర్జీల యూనియన్ నేతల అభిప్రాయం

కొయ్యూరు మే 25 ప్రభాతవార్త

అన్ని వర్గాల సమస్యల పట్ల పరిష్కార దిశగా ప్రస్తుత రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తున్న తరుణంలో దర్జీల సమస్యల పరిష్కారానికి దర్జీలంతా కలిసికట్టుగా వ్యవహరించాలని మండల దర్జీల యూనియన్ నేతలు అభిప్రాయపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని అల్లూరి కళామందిరంలో మండల దర్జీ యూనియన్ నేతల సమావేశం నిర్వహించ తలపెట్టినప్పటికీ ఎండల తీవ్రత కారణంగా ఈ సమావేశం వాయిదా పడింది. అయినప్పటికీ హాజరైన స్థానిక యూనియన్ నేతలు కాకర చిన్నారావు, ప్రసాద్, సాయి తదితరులు మాట్లాడుతూ - ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాలనా తీరు సక్రమంగానే ఉన్నప్పటికీ, తమ సమస్యలను కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మొదట తమపైనే ఉందని, అందుకే సమావేశం నిర్వహించ తలపెట్టామని, అయితే ఎండ తీవ్రత కారణంగా కొంతమంది టైలర్లు హాజరు కాని కారణంగా మరొక రోజు నిర్వహించనున్నట్టు తెలిపారు. అడగనిదే అమ్మయినా పెట్టదని, తమ సమస్యలు తెలియజేస్తేనే ప్రభుత్వ పెద్దలు స్పందిస్తారని వారు సానుకూలంగా స్పందించారు.

# ఏఐ, మ్యూజిక్, డాన్స్‌పై సమ్మర్ కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలి..

పాడేరు,మే25, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, జి.మాడుగుల, జి.కె వీధి, కిలగాడ, డంబ్రిగూడ, చింతపల్లి,అరకు, హుకుంపేట,డుశీ బ్రిగూడ ప్రాంతాల పాఠశాలల్లో ఐటీడీఏ మరియు చైతన్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే 25 నుండి జూన్ 6 వరకు ఆశ్రమ స్కూల్ విద్యార్థినులకు నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ కార్యక్రమాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని చైతన్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రవికుమార్ పెనుమాక పిలుపునిచ్చారు. సోమవారం పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఆదేశాల మేరకు 8,9,10 తరగతులుకు ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ 12 రోజుల సమ్మర్ కోచింగ్‌లో ఏఐ మ్యూజిక్, డాన్స్, యోగా, ఆర్ట్స్, హెల్త్ అంశాలపై వాలింటర్స్ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థినుల్లో సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కోచింగ్‌లో దిద్దె రవికుమార్, పాంగి మత్యకొండబాబు, బొడ్ల చిరంజీవి, వెంకట చలం,మధు, సిహెచ్ మనోజ్ కుమార్, ఏం గీత, వినోద్, తదితరులు కోచింగ్ ఇస్తున్నారు.

# ఋషికొండలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు అభినందనీయం

## -యూజేఎఫ్ అధ్యక్షులు డా.ఎం.ఆర్.ఎన్ వర్మ



విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త

ఋషికొండలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు అభినందనీయమని ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యు.జే.ఎఫ్) అధ్యక్షులు డా. ఎం. అర్. ఎన్. వర్మ అన్నారు. వేసవి శిక్షణా శిబిరాన్ని సందర్శించిన వర్మ మాట్లాడుతూ శాప్ చైర్మన్ రవినాయుడు పట్టుదల వల్లే విశాఖకు అకాడమీ వచ్చిందని పేర్కొన్నారు. ఆసక్తి గల యువత జల క్రీడల్లో రాణించి.. సాధన చేసినట్లయితే ఒలంపిక్స్‌లో కూడా పతకాలు పొందే అవకాశం ఉందని అన్నారు. క్రీడా కోటా ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. సముద్ర తీరం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో.. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో 100 కిలోమీటర్ల పైగా సముద్రతీరం ఉందన్నారు. ఈ ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్‌కు గొప్ప అవకాశం ఉండడంతో పాటు సముద్రంలో చిక్కుకున్న వారికి రక్షించేందుకు వీలుగా శిక్షణ పొందేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. మత్స్యకార పిల్లలకు జలక్రీడలు పెద్ద ఊత మిస్తాయని పేర్కొన్నారు. చిన్నప్పుడు నుంచే ఈత నేర్చుకోవడం,నీటిలో బ్యాలెన్స్ ఎరిగిన తత్వం అలవడుతుందన్నారు. తక్షణం జల క్రీడలు జరిగే ప్రాంతంలో నో యాంకర్ జూన్ ఏర్పాటు చేయాలన్నారు. కమాండో దాస్ నాయకత్వం లో శిక్షణతో ఉత్తరాంధ్ర పిల్లలు ఒలంపిక్ మెడల్ కొట్టవచ్చన్నారు.జల క్రీడల వల్ల బరువు తగ్గవచ్చని,గుండె ఊపిరితిత్తులు బలంగా పనిచేస్తాయని, ప్రశాంతత అలవడుతుందన్నారు. గోవాలో చాలా క్రిడల వల్ల పర్యాటక శాఖ ఆకర్షణతో రూ 300 కోట్ల ఆదాయం వస్తుందన్నారు.అదే తరహాలో విశాఖ ఋషికొండ బీచ్ కేంద్రంగా జల క్రీడలో ప్రోత్సాహంతో పర్యాటకం పెరుగుతుందని వర్మ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వేసవి శిక్షణా శిబిరం (సమ్మర్ క్యాంప్)లో భాగంగా విశాఖపట్నం ఋషికొండ బీచ్‌లోని వాటర్ స్పోర్ట్స్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన వర్మ అక్కడ శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో ముచ్చటించారు. విశాఖపట్నం ఋషికొండలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించడం శుభపరిణామన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు తన శాయశక్తులా కృషి చేసి, పట్టుదలతో ఈ వాటర్ స్పోర్ట్స్ అకాడమీని విశాఖపట్నానికి తీసుకువచ్చారని కొనియాడారు. ఆయన ప్రత్యేక చొరవతోనే ఈ అకాడమీ భూమి పూజ కూడా విజయవంతంగా పూర్తయిందని గుర్తుచేశారు. "విద్యార్థుల జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా సగభాగం కావాలి. క్రీడల్లో రాణించడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు అద్భుతమైన భవిష్యత్తు ఉంటుంది." యువత క్రీడలను కేవలం ఒక వినోదంగానే కాకుండా, కెరీర్‌గా కూడా ఎంచుకోవాలని ఆయన ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ వంటి ప్రతిష్టాత్మక ప్రభుత్వ రక్షణ వ్యవస్థలలో యువత ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు ఈ వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఒక గొప్ప వేదికగా మారుతుందని వర్మ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, విశ్రాంత పోలీసు అధికారి అప్పలరాజు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ విశ్రాంత అధికారి ధనరాజ్, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారి ఆదిరెడ్డి వెంకటరమణ విద్యార్థులు పాల్గొన్నారు.

## సముద్రపు ఒడ్డు నుండి పిఎంఓ వరకు నా జీవిత ప్రయాణం

కోచ్ దాస్ తన జీవిత ప్రయాణాన్ని పంచుకుంటూ... "నేను కూడా మీలాగే 52 సంవత్సరాల క్రితం ఇదే సముద్రపు ఒడ్డున పుట్టి, ఇక్కడే పెరిగాను. కానీ కేవలం చదువు, క్రమశిక్షణ వల్లే నేను దేశంలోనే అత్యున్నతమైన ప్రధాన మంత్రి కార్యాలయం వరకు వెళ్లి డ్యూటీ చేసే స్థాయికి ఎదిగాను. మళ్లీ ఇప్పుడు నా ప్రాంతం పిల్లలను, నా తమ్ముళ్లను జలక్రీడల్లో ఛాంపియన్లుగా మార్చడానికి, శాప్ చైర్మన్ రవినాయుడు పిలుపు మేరకు కోచ్‌గా మీ ముందుకు వచ్చాను" అని తెలిపారు.

# అదృశ్యమైన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

విశాఖపట్నం, మే 22, ప్రభాతవార్త

ఒత్తిడిని తట్టుకోలేక ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని పోలీసులు అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉద్యోగ, మానసిక ఒత్తిడి కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని మహారాణిపేట పోలీసులు గుర్తించి కౌన్సిలింగ్ చేసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఓ వ్యక్తి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. అనంతరం అతనికి కౌన్సెలింగ్ నిర్వహించి మానసిక ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నగర పోలీసు కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, మహారాణిపేట పోలీసు సిబ్బంది అప్రమత్తత, బాధ్యతాయుత చర్యలను అభినందించారు.

# సింహాచలంలో రాత్రి 7కే దర్శనాలు ముగింపు

సింహాచలం, మే 25, ప్రభాతవార్త:

సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నమ్మాళ్వార్ తిరునక్షత్రం ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు రాత్రి 7 గంటలకే దర్శనాలు నిలిపివేయనున్నట్లు దేవస్థానం ఈఓ వెంకటరావు తెలిపారు. ఈ మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాత్రి 7 గంటల తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించబోమని, భక్తులు ముందుగానే దర్శనం చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఈ నెల 30వ తేదీ నుంచి స్వామివారి గోశాలలో జరిగే ఆరోజు సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# ఎంబీబీయస్ పరీక్షా ఫలితాల్లో..

విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త

ఆంధ్రా వైద్య కళాశాల (ఏఎంసి) చివరి సంవత్సర ఎంబీబీయస్ ఫలితాల్లో అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ ను కనబరిచారు. తొమ్మిది మంది డిస్టింక్షన్‌లను సాధించగా 152 మంది ప్రథమ శ్రేణిలోను 74 మంది ద్వితీయ శ్రేణిలో పాస్ అయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ అదనపు డిఎంఇ డా.కేవీ యస్ఎం సంధ్యా దేవీ ఒక ప్రకటన లో తెలిపారు. అద్భుతమైన పాస్ పర్సెంటేజ్‌ను సాధించిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అందుకు కారకులైన కళాశాల అధ్యాపకులను పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులను సోమవారం వైద్య కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అభినందించారు. ఉత్తీర్ణత సాధించిన వైద్య విద్యార్థులతో విడివిడిగా గ్రూప్ ఫోటోస్ దిగి వారితో ఆనందాన్ని పంచుకున్నారు.

# విశాఖ పోర్ట్‌లో కేంద్ర మంత్రి సురేష్ గోపి పర్యటన

విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త

కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి సోమవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించారు. ఈ సందర్భంగా పోర్ట్ చైర్‌పర్సన్ జె.ఎస్. బింద్రా మంత్రికి ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా మంత్రి లాంచ్ ద్వారా సింగిల్ పాయింట్ మూరింగ్ ప్రాంతానికి వెళ్లి అక్కడి కార్యకలాపాలను పరిశీలించారు. సింగిల్ పాయింట్ మూరింగ్ పనితీరు, పోర్టు సమగ్ర కార్యకలాపాలపై చైర్‌పర్సన్ మంత్రికి వివరించారు. పోర్టులో జరుగుతున్న ఎగుమతి-దిగుమతి కార్యకలాపాలు, ఆధునీకరణ, యాంత్రీకరణ చర్యలు, అమలు చేస్తున్న పలు హరిత కార్యక్రమాల గురించి కూడా మంత్రికి వివరించారు. విశాఖపట్నం పోర్టులో కొనసాగుతున్న అభివృద్ధి, ఆధునీకరణ కార్యక్రమాలను కేంద్ర మంత్రి సురేష్ గోపి అభినందించారు. వీపీఏ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ విషయాలను పోర్ట్ కార్యదర్శి ఎం.శంకర్ బాబు మీడియాకు తెలిపారు.

# పెందుర్తి, దగ్గువానిపాలెం, రాడివారి కళ్లాల్లో ప్రభుత్వ భూములను..

7వ పేజీ తరువాయి ..

మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలోని రాడివారి కల్లాలకు చెందిన 107/11 సర్వే నెంబర్‌లోని భూమి ప్రభుత్వ భూమిగా ప్రభుత్వ విచారణ ద్వారా గుర్తించారని తెలిపారు. సదరు భూమిపై తమకు హక్కులు ఉన్నట్లుగా గండి బాబ్జి, ఎంవివి బిల్డర్స్, అప్పల నాయుడు తదితరులు గత కొన్ని ఏళ్లుగా వ్యాజ్యాలు నడిపిన, వారికి అనుకూలంగా రిపోర్టు రాలేదన్నారు. అదే సందర్భంలో అనేక దఫాలుగా దురాక్రమించ డానికి వారంతా ప్రయత్నించారని ఆమె ఆరోపించారు. ఇవన్నీ మీడియా ద్వారా బహిర్గతం అయ్యాయని గుర్తు చేశారు. అయితే చాలా కాలంగా ఆక్కడ నివసిస్తున్నట్లు విచారణ ద్వారా ప్రభుత్వ విభాగాలు గుర్తించాయని తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించుకొని ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పథకం లో భాగంగా 80-08-2026న దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే గండి బాబ్జి ఒత్తిడితో ఏ కారణం చెప్పకుండానే వాటిని అధికారులు రిజెక్ట్ చేశారని తెలిపారు. ఇప్పుడు గండి బాబ్జి తదితరులు, ఈనెల 19 నుండి సర్వే నంబర్ 107/11లో గల ప్రభుత్వ భూమిని దురాక్రమించడానికి ట్రాక్టర్లను, బుల్డోజర్లను ఉపయోగించి పెద్ద ఎత్తున ఆ భూమిని చదును చేసి రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న కాలనీ ప్రజలను మీ సంగతి కూడా చూస్తామనీ, మీ ఇల్లు ఎలా క్రమబద్ధీకరణ చేస్తారో మీకు ఎలా పట్టాలు వస్తాయో చూస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. పేదల ఇళ్ల స్థలాలను క్రమబద్ధీ కరించడానికి అది చెరువు భూమిగా నమోదయిందని అధికారులుగా చెబుతూ వస్తున్నారన్నారు. రాడివారి కల్లాల ప్రజలు 30-03-2026న ఇచ్చిన ఫిర్యాదు కూడా పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. ఈ తరుణంలో భూ దురాక్రమణకు పాల్పడుతున్న వారిని నిరోధించి, ప్రభుత్వ భూమిగా బోర్డులు పెట్టి, నివాసితులకు క్రమబద్ధీకరణలో భాగంగా పట్టాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్లు కోరినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఎస్.వెంకటలక్ష్మి, నివాసితులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కుల..

7వ పేజీ తరువాయి ..

నూతన పారిశ్రామికవేత్తలకు 725 చదరపు అడుగుల స్థలాలను, భవనాలను కేటాయిస్తామన్నారు. పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి విశాఖలో మైక్రోస్మాల్ ఫెసిలిటేషన్ సెంటర్ చేసినట్లు ఆయన తెలిపారు చిన్న పరిశ్రమల వివాదాల వేగవంత పరిష్కారం కోసం డిస్ప్యూట్ రిజల్యూషన్ పోర్టల్ ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది అన్నారు .మీవీజు చట్టప్రకారం సరుకు సరఫరా చేసిన 45 రోజులలో చెల్లింపులు జరగాల్సి ఉంటుందని ఆలస్యమైతే వడ్డీతో చెల్లింపు జరిగేలా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. యువతను పారి శ్రామిక రంగంలో తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, ఐటిఐ, పాలిటెక్ని విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ద్వారా కల్పిస్తామని పేర్కొన్నారు కొత్త పరిశ్రమలు స్థాపించే వారికి రాయితీలు ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని ఆయన అన్నారు. పరిశ్రమ నిర్వాహకులకు ఎదురైన టెండర్ల సమస్యను పరిష్కరించి వారికోసం ప్రత్యేక కోటా తీసుకువచ్చామన్నారు. పారిశ్రామిక ప్రాంతాలలో తక్కువ ధరలకు స్థలాలు పొంది వాటిని సొంతంగా నిర్వహించకుండా ఇతరులకు అద్దెకు ఇచ్చే విధానాన్ని అరికట్టాలని, పరిశ్రమలు పెట్టినవారు ఉత్పత్తిని సాధించలేకపోతే ఆ స్థలాలను డిఐసికి తిరిగి స్వాధీనం చేసి నూతన పారిశ్రామికవేత్తలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐలా చైర్మన్ జగపతి రాజు, ఏపీఐఐసీ అధికారులు, జోనల్ మేనేజర్ సింహాచలం జిఎం ఇండస్ట్రీస్, వి.ఆదిశేషు, పారిశ్రామికవేత్తలు, స్థానిక నాయకులు లొడగల కృష్ణ, ఉషా, కిరణ్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.


**గౌరవనీయులైన విశాఖపట్నం డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ వారి సమక్షంలో**

గ్రౌండ్ & మొదటి అంతస్తు, శ్రీ నారాయణ్ భవన్, సాయి బాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020.

**O.A. 94/2026**

బిట్వీన్ :

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీతమ్మధార బ్రాంచ్, విశాఖపట్నం ... దరఖాస్తుదారుని బ్యాంక్

మరియు

M/s. శ్యామల డ్రై ఫ్రూట్స్ & ఇతరులు ... ప్రతివాదులు

1) M/s. శ్యామల డ్రై ఫ్రూట్స్, #10-50-82/A, గ్రౌండ్ ఫ్లోర్, AG పార్క్, వాల్తేర్ మెయిన్ రోడ్, రామ్ నగర్, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా-530002, ఆం.ప్ర. (ప్రతివాది 1)

2) శ్రీమతి మావుడూరి స్వాతి, భర్త: శ్రీ మావుడూరి వివేక్, డి.నెం. 22-77-5, చెలకొండవారి వీధి, 1 టౌన్ పోలీస్ స్టేషన్, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా-530001, ఆం.ప్ర. (ప్రతివాది 2)

3) శ్రీ మావుడూరి రవి, తండ్రి: వేణు, డి నెం.10-5106/1/A, 1వ అంతస్తు, కల్లమెట్ల, చిన్న వాల్తేర్ విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా-530003, ఆం.ప్ర. (ప్రతివాది 3)

4) శ్రీమతి మావుడూరి స్వాతి, భర్త: శ్రీ లేటు మావుడూరి వివేక్ (మరణించిన మేనేజింగ్ పార్టనర్ శ్రీ మావుడూరి వివేక్ గారి చట్టపరమైన వారసురాలు (భార్య), డి.నెం.22-77-5, చెలకొండవారి వీధి, 1 టౌన్ పోలీస్ స్టేషన్, విశాఖపట్నం, విశాఖపట్నం జిలా-530001. (ప్రతివాది 6)

5) శ్రీ ఎమ్. వేణు (మరణించిన మేనేజింగ్ పార్టనర్ శ్రీ మావుడూరి వివేక్ గారి చట్టపరమైన వారసుడు (తండ్రి), డి.నెం.22-77-5, చెలకొండవారి వీధి, 1 టౌన్ పోలీస్ స్టేషన్, విశాఖపట్నం, విశాఖపట్నం జిలా-530001. (ప్రతివాది 7)

**ప్రతివాదులు D1, D2, D3, D6 & D7 వారికి పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు**

గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డిఆర్టి విశాఖపట్నం వద్ద, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ చట్టం 1993, సెక్షన్ 19 క్రింద ధరఖాస్తుదారు ఇతర పరిహారాలతో పాటు అందులో తెలిపిన బ్యాంక్‌కు రావాల్సిన బకాయి తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలను కలిపి మొత్తమును దాబట్టుకొనేందుకు ధరఖాస్తు చేశారు. సదరు క్లెయిమ్‌కు జవాబు ఇచ్చేందుకు **తేది.02/06/2026, ఉ।। 10.30 గం।।లకు** ట్రిబ్యునల్ సమక్షంలో హాజరై వ్రాతకపూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా ఆదేశిస్తూ మీకు సమన్లు జారీచేయడమైనది.

మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ నమోదిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.

ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్ మీ గైర్హాజరులో విచారించబడి నిర్ధారించబడునని గమనించవలెను.

**నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.19 మే 2026 న విశాఖపట్నం నందు జారీచేయబడినది.**

సం/- రిజిస్ట్రార్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

## వర్షంతో కూడిన ఈదురు గాలులకు పాఠశాల భవనం పైరేకులు ధ్వంసం



డుంబ్రిగుడ, మే 25, ప్రభాతవార్త

మండలంలోని కితలగి పంచాయితీ పాములపుట్టు గ్రామంలో సోమవారం ఒంటి గంట సమయం నుంచి మూడు గంటల వరకు దట్టమైన ఈదురుగాలులతో కుడిన వాడగల్ల వాన కురవడంతో ఆగ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాల భవనం పైరేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దీంతో భవనంపై భాగం పూర్తిగా పాడైపోయింది. ఈపాఠశాలలో సుమారు 36 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న ఈపాఠశాల భవనం పాక్షికంగా పాడవ్వడంతో జూన్ 12 పాఠశాల మొదలయ్యే సమయానికి భవనం పైరేకులు ఏర్పాటు చెయ్యాలని ఆగ్రామ గిరిజనులు కోరుతున్నారు. సంబంధిత ఉన్నతధికారులు స్పందించి పాఠశాల భవనం పైరేకులను ఏర్పాటు చేయ్యాలని కోరుతున్నారు.

## అరకులోయలో నేషనల్ ట్రెక్కింగ్ క్యాంప్ ప్రారంభం

అరకు రూరల్, మే 25, ప్రభాతవార్త



అరకులోయ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్‌సిసిడిటిఈ ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్ సోమ వారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్ ముఖ్యఅతిథి గా పాల్గొన్నారు. ఈ ట్రెక్కింగ్ క్యాంప్ ఈనెల 31వ తేదీ వరకు అరకులోయ పరిసర ప్రాంతాలలో జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఏపీ ఎన్ సిసి ట్రాకింగ్ క్యాంప్ అరకులోయలో నిర్వహిం చడం అల్లూరి జిల్లాకి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమం విజయ వంతానికి అన్ని శాఖల సమయంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ 13వ బెటాలియన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో జరుగుతున్న ట్రెక్కింగ్ క్యాంపులో దేశం నలుమూలల నుండి 600 మంది క్యాడేట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. ట్రెక్కింగ్ క్యాంపులో ప్రకృతి అందాలతో పాటు స్థానికంగా ఉన్న సంప్రదాయాలు, ఆచారాలు శాంతమైన జీవన విధానం తెలుస్తాయని అన్నారు. స్థానికంగా ఉన్న యువత ఇతర ప్రాంతాల నుండి వచ్చిన ఎన్‌సిసి క్యాడేటల్‌తో కలిసి అనుభవాలను పంచుకోవాలని అన్నారు. అలాగే స్నేహభావాలను పెంచుకోవాలని అన్నారు. ట్రెక్కింగ్ సమయంలో క్యాడేట్లు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎన్సిసి ద్వారా యువతలలో క్రమశిక్షణ దేశభక్తి నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని చెప్పారు. క్యాండేట్లు పొందిన సర్టిఫికెట్లు ద్వారా డిఫెన్స్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రత్యేక ప్రాధాన్యత రిజర్వేషన్లు పొందవచ్చునన్నారు. అల్లూరి జిల్లాలలో మొదటి ఎన్‌సిసి యూనిట్ జూలైలో ప్రారంభమవుతున్నట్లు చెప్పారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులకు మెమెంటోళ్లను అందజేశారు. విశాఖపట్నం గ్రూప్ కమాండర్ కమాండర్ సుమంతరాయి, కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కర్నూల్ నీరజ్ కుమార్, విశాఖపట్నం 13వ ఆంధ్ర బెటాలియన్ లెఫ్టినెంట్ కర్నూల్ స్వర్ణిం ప్రభాత్, అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి, ఎస్సై టి.మల్లేశ్వరరావు, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## మానవుల అక్రమ రవాణా నిరోధం అందరి బాధ్యత



ఆనందపురం, మే 25, ప్రభాతవార్త

మానవుల అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరాల్లో ఒకటిగా మారిందని దాన్ని నిరోధించడానికి అందరూ కృషి చేయాలని ఎంపీడీవో వి.జానకి కోరారు. ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమ వారం మానవుల అక్రమ రవాణాపై అవగాహన కలిగిస్తూ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.జానకి మాట్లాడుతూ ఉద్యోగాలు, సినిమా అవకాశాల పేరుతో మహిళలు, యువతులను మోసం చేసి విదేశాలకు తరలిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజ్వల కో-ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ పద్మశ్రీ డా.సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ప్రజ్వల సంస్థ గత 29 ఏళ్లుగా మహిళలు, బాలికల అక్రమ రవాణా, లైంగిక దోపిడీ నిరోధానికి కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటి వరకు 30,200 మందికి పైగా మహిళలు, బాలికలను రక్షించి పునరావాసం కల్పించినట్లు చెప్పారు. గ్రామాల్లో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులు ఏర్పాటు చేయడం ద్వారా అక్రమ రవాణాను అరికట్టవచ్చున్నారు. మహిళా పోలీసులు మాట్లాడుతూ యువత మొబైల్, ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ బారిన పడుతున్నా రని, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. భోపాల్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ అంబర్ సింగ్, డిప్యూటీ ఎంపీడీవోలు కె.రామారావు, ఎన్.కవిప్రసాద్, ఏఆర్ కె.నాయుడు, మండల స్వర్ణ గ్రామ అధికారి శ్రీరామమూర్తి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి కె.హరికృష్ణ, ఓఎస్‌సి అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రవణ్య, డివి సెల్ సోషల్ కౌన్సలర్ జ్యోతి లత మహిళా పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## పార్వతి పరమేశ్వరుల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన

ఆనందపురం, మే 25, ప్రభాతవార్త



ఆనందపురం మండలం రామవరం గ్రామం లోని భీముడిబంధ కొలనులో శ్రీ పార్వతి పరమేశ్వరుల విగ్రహాల ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. రామవరం గ్రామ మాజీ సర్పంచ్ ఎర్ర పైడిరాజు, గ్రామ పెద్దల అభ్యర్థన మేరకు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు రిసార్ట్ అధినేత ఎర్రమిల్లి రమేష్ (రామ్) సుమారు రూ.20 లక్షల స్వంత నిధులతో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎర్ర పైడిరాజు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం ముందుకు వచ్చి సహకారం అందిస్తున్న ఎర్రమిల్లి రమేష్‌కు అభినందనలు తెలిపారు.

## టీడీపీ మహానాడు విజయవంతానికి సన్నాహక సమావేశం

ఆనందపురం, మే 25, ప్రభాతవార్త



భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమ వారం ఉదయం ఆనందపురం మండలం బీసీ కల్యాణ రోడ్డులోని శుభశ్రీ కళ్యాణ మండపంలో టీడీపీ మహానాడు వర్చువల్ సమావేశానికి సంబంధించి మండల టీడీపీ అధ్య క్షులు ఆధ్వ ర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 27, 28 తేదీలలో జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై నాయకులకు పలు సూచనలు, మార్గదర్శకాలు తెలియజేశారు. ఈ సమావేశం మండల పార్టీ అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి మీసాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమం లో జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు బమ్మిడి ఉమా, మండల జనరల్ సెక్రటరీ లొడగల వెంకట్రావు, మండల ఉపాధ్యక్షుడు సూరాల సత్యవరప్రసాద్, బీఆర్‌బీ నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, గండ్రెడ్డి సోం బాబు, బలిరెడ్డి చంటి, ఎర్రరాజు, కోరాడ నవీన్, మహంతి శివాజీ, కొట్యాడ రెడ్డిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి నాయకులు హాజరై మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు నాయకులు ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు సూచించారు.

## గాజువాకలో బీజేపీ సమన్వయ సమావేశం



గాజువాక, మే 25,ప్రభాతవార్త

పాతకర్నవానిపాలెం బీజేపీ కార్యాల యంలో సోమవారం సాయంత్రం 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పై నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. నియోజకవర్గ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ.. గాజువాకలోని 309 పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించామని, వీరికి జూన్ 2న తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి కొత్త ఓట్ల నమోదు చేయనున్నట్టు పేర్కొన్నారు. జాబితాలో ఉన్న డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను తొలగించి పారదర్శక జాబితా తయారు చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని, దీనివల్ల వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి వి. రోహిణి, ఉపాధ్యక్షురాలు వర్రి లలిత, జిల్లా కార్యదర్శి సోంబాబు, గూటూరు శంకరరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 28 తేదీ టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష జూన్ 5కు వాయిదా : జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్

ఆరిలోవ, మే 25, ప్రభాతవార్త



ఈనెల 28వ తేదీన జరగాల్సిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష జూన్ 5వ తేదీకి వాయిదా వేసి నిర్వహిస్తున్నట్లు విశాఖ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. బక్రీద్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 28వ తేదీ సెలవు ప్రకటించడంతో ఆరోజు జరగాల్సిన ఇంగ్లీష్ తో పాటు ఇతర పరీక్షలను జూన్ 5వ తేదీకి వాయిదా వేసినట్లు విద్యాశాఖ ఉత్తర్వుల్లో తెలియజేసినట్లు డీఈవో తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఈ తేదీ మార్పును గమనించాలని తెలిపారు. సోమవారం నుండి ఇప్పటికే టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మే 25: ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్-1), మే 26: ఫస్ట్ లాంగ్వేజ్ (పేపర్-2), ఓ ఎస్ ఎస్ సి మెయిన్ లాంగ్వేజ్, మే 27: సెకండ్ లాంగ్వేజ్, మే 28: ఇంగ్లీష్, మే 29: మ్యాథమెటిక్స్, మే 30: ఫిజికల్ సైన్స్, జూన్ 1: బయలాజికల్ సైన్స్, జూన్ 2: సోషల్ స్టడీస్, జూన్ 3: ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2, జూన్ 4: ఒకేషనల్ కోర్స్ జరుగుతాయన్నారు.

## ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా పీఎం జవహర్‌లాల్



విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త

ఐఎన్‌టియుసి (ఇంటక్) అనుబంధ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా సీనియర్ నాయకులు పిఎం జవహర్ లాల్ ఎన్నికయ్యారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి, ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆస్కారరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ పెన్షన్ దారుల కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లోజిల్లా అధ్యక్షులుగా ఎస్‌వీ రమణ ఉపాధ్యక్షు లుగా కేఎం ఈశ్వరిబాయ్, పి.వసుంధర జాయింట్ సెక్రటరీగా కే.సత్యవతి, పీవీ నరసింహమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా టి.శ్రీనివాసరావు, ఎల్.కోటేశ్వరరావు, కోశాధికారిగా కడలి నాగశ్రీను ఎన్నికయ్యారు. వీరి పదవుల్లో రెండేళ్ల పాటు కొనసాగుతారని ఆస్కారావు పేర్కొన్నారు. నగర నూతన కార్యవర్గం ఎన్నిక అనంతరం సంఘం నగరశాఖకు నూతన కార్యవర్గంను కూడా ఎన్నుకుంది. నగర నూతన అధ్యక్షుడిగా వై.గోపి, కార్యదర్శిగా గంగాధర్‌రావు, ఉపాధ్యక్షులుగా పి.కమలకుమారి, యోగిత, ఎస్‌బి అశోక్ కుమారి, జాయింట్ సెక్రటరీలుగా జి.సుజాత, జి.గంగాభవాని, బి.కిషోర్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.వెంకటేష్, ఎల్.శ్రీనివాసరావు, కే.సత్తిరాజు, కోశాధికారిగా బి.శంకర్రావు ఎన్నికయ్యారు.

## 2.5 కోట్ల విత్తన బంతులు కార్యక్రమం జయప్రదం చేద్దాం..

విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త



2.5 కోట్ల విత్తన బంతులు కార్యక్రమం జయప్రదం చేద్దాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం విశాఖ పట్నం జిల్లా పెందుర్తి మండలం పెద్ద గాడి గ్రామం వద్ద ఉన్న సంకల్ప కళా గ్రామంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన విత్తన బంతుల తయారీ కోసం సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు వంద కిలోల చింత గింజలు అందజేసిన అనంతరం రత్నం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అటవీశాఖకు విత్తన బంతులు, దేశీయ విత్తనాలు అందచేద్దాం అని అన్నారు. ప్రతి ఒక్కరూ చింత గింజలు, కొంకుడు గింజలు, మనం తినే మామిడి పండ్ల టెంకలు, నేరేడు, సపోటా, రామాఫలం, శీతాఫలం, లక్ష్మణా ఫలం, నారింజ, బత్తాయి, కెమెరా, ఉసిరి తదితర దేశీయ విత్తనాలు అందచేద్దాం అని అన్నారు. ఈ ఏడాది శీతోష్ణస్థితి వేడెక్కిన తీరు మనం చవిచూశాం. భవిష్యత్తులో ఈ వేడి ఇంకా పెరగకుండా ఉండడానికి విపరీతంగా చెట్లు పెంచాలి, భూగర్భ జలాలు పెంపొందించాలని కోరారు. విత్తనాలు అందచేద్దాం వాటి ద్వారా అటవీశాఖ కృషి తో పెరిగిన సామాజిక వనాలు పెంచుదామని, తద్వారా శీతోష్ణస్థితి వేడెక్కకుండా ఉండే అవకాశం ఉందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మన చేతుల్లోనే మన వాతావరణం ఉంటుంది అని ప్రతి ఒక్కరూ తెలుసు కోవాలి అని ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప కళా గ్రామం ప్రతినిధులు ఆకుల చలపతిరావు, పార్వతి, జమీలియా, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## పాస్ పోర్టు దరఖాస్తుదారులకు ముఖ్య గమనిక

మాధవధార, మే 25, ప్రభాతవార్త

మే నెలలో పాస్ పోర్టు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు కొన్ని తేదీలలో సమూల మార్పులు చేసినట్లు విశాఖ జిల్లా పాస్ పోర్ట్ అధికారి సుయాష్ చవాన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే నెలలో బక్రీద్ పండుగ ముందుగా మే 27వ తేదీ నిర్ణయించడం జరిగిందని, అయితే ఈ సెలవును మే 28వ తేదీకి మార్చడం వలన మే 28వ తేదీకి అపాయింట్మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు మే 27వ తేదీన హాజరుకావాలని సూచించారు.దరఖాస్తుదారులు తమ అసలు అపాయిట్మెంట్లలో జరిగిన మార్పులను గమనించి, పుణ:ప్రణాళిక చేయబడిన అపాయిట్మెంట్‌ల ప్రకారం పాస్ పోర్టు సేవా కేంద్రాలు / పోస్ట్ ఆఫీస్ పాస్ పోర్ట్ సేవా కేంద్రాలు/విశాఖపట్నం రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీస్ లోని విచారణ కౌంటర్లకు హాజరు కావాలని సూచించారు.

## మే 26న చిన్నజీయరస్వామి, జులై 20న చాగంటి, అనంతుని సన్నిధికి రాక

పద్మనాభం, మే 25,ప్రభాతవార్త

పద్మనాభం గ్రామంలో గోస్తనీ నదీ తీరంలో వేంచేసియున్న అనంతపద్మనాభస్వామి సన్నిధికి ఈ నెల 26న త్రిదండి చిన్నజీయర స్వామి, జూలై 20న బ్రహ్మశ్రీ ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర రావు రానున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కోరాడ రమణ చెప్పారు. భీమిలి ఎమ్మెల్యే గంటా చొరవతో వీరు అనంతుని సన్నిధికి రానున్నారని ఆయన అన్నారు. అయితే చిన్నజీయరస్వామి మంగళ వారం సాయంత్రం ఐదు గంటలకు కొండపైన ఉన్న అనంతునిని దర్శించుకుంటారని, అనంతరం కొండదిగువన ఉన్న కుంతీమాధవ స్వామిని దర్శించుకుంటారని ఆయన అన్నారు. అనంతరం అదే ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులకు ఆలపిస్తారని అన్నారు.



## జూలో ఏనుగును దత్తత తీసుకున్న బాలిక

ఆరిలోవ, మే 25, ప్రభాతవార్త

ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్‌లో ఉన్న సరస్వతి అనే ఆసియా ఏనుగును కుమారి నిత్య జాస్తి దత్తత తీసుకున్నారు. జాస్తి శ్రీకాంత్, ఆశ దంపతులు తమ కుమార్తె నిత్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దత్తత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మే 25 నుండి జూన్ 24 వరకు ఒక నెల కాలానికి గాను 36,000 విరాళాన్ని అందజేశారు. దీనితో పాటు, రాబోయే ఏడాది కాలం పాటు ప్రతి నెల 36,000 చొప్పున ఈ దత్తత కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సీనియర్ వెటర్నరీ డా.భాను, అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపీ, పి.వి.చౌదరి, ఎఫ్.ఎస్.ఓ హరి పాల్గొన్నారు.

## గాజువాక గ్రంథాలయంలో ముగిసిన వేసవి శిబిరం

గాజువాక, మే 25,ప్రభాతవార్త



గాజువాక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ శిబిరంలో భాగం గా పిల్లలకు కథలు చదవడం, సొంతంగా రాయ డం ఆకట్టుకునేలా చెప్పడంపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సృజనాత్మకతను, ఏకాగ్రతను పెంపొందించేలా 'పేపర్ గ్లాస్‌ల ఆటలు' ఆడించి అలరించారు. గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ పర్యవేక్షణలో సాగిన ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. వేసవి సెలవులను పిల్లలు ఇలాంటి విజ్ఞానదాయకమైన ఆటపాటలతో సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు.

## 11వ వార్డులో 'మహానాడు' ఏర్పాటుపై వార్డు కమిటీ సమావేశం



ఆరిలోవ, మే 25, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు సోమ వారం 11వ వార్డులో వార్డు అధ్య క్షులు ముగడ రాజారావు, పార్టీ నాయకులు కాకి గంగరాజు ఆధ్వ ర్యంలో మహానాడు" ఏర్పాట్లపై వార్డు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ శ్రేణులు మాట్లాడుతూ మహానాడు కార్యక్రమం గాంధీనగర్ "అరవ లక్ష్మి కళ్యాణ మండపం"లో ఈ నెల మే 27, 28 తేదీల్లో నిర్వహిస్తున్నామని, మహానాడు మన ఇంటి పండగ లాగా జరపాలని ప్రతి కార్యకర్త నాయకులు అందరూ హాజరై మహానాడు కార్యక్రమమును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే నాయకులు కార్యకర్తలు వారి యొక్క సూచనలు సలహాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జ్ మద్దిల రాజేష్, వార్డు నాయకులు సిహెచ్. ఆదినారాయణ రాజు, బర్రి సూర్యనారాయణ, పేపర్ నాయుడు, రంగాల మంగరాజు, ఎస్.కె.బాబా, లింగబోతు అప్పారావు, బోధ లక్ష్మణరావు, కర్రి రమేష్, మహిళలు రేఖా జ్యోతి, మజ్జి లక్ష్మి, రావాడ జయ, చందక లలిత, కోడూరి జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తు సరఫరా

### గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ వ్యవస్థకు నష్టం -పునరుద్ధరణ చర్యలు వేగవంతం :ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త

ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు మెరుపుల కారణంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, డా అంబేద్కర్ కోనసీమ, అనకాపల్లి, ఈస్ట్ గోదావరి జిల్లాల పరిధిలో విద్యుత్ వ్యవస్థకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు సంస్థ సీఎండీ శ్రీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు విద్యుత్ లైన్లపై కూలి పోవడం వలన విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం, విద్యుత్ లైన్లు తెగిపోవడం వలన సరఫరా వ్యవస్థకు అంతరాయం కలిగిందన్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో 41 విద్యుత్ స్తంభాలు, పలు చోట్ల ట్రాన్స్ఫార్మర్లు, అనకాపల్లి, జగ్గంపేట డివిజన్ల పరిధిలో 279 విద్యుత్ స్తంభాలు, 31 ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నాయని మరియు అనేక ప్రాంతాల్లో సుమారు 20 కిలోమీటర్ల విద్యుత్ లైన్లకు కూడా నష్టం సంభవించినట్లు వెల్లడించారు. సంఘటనలు చోటు చేసుకున్న వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు కాంట్రాక్ట్ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా విభజించి, క్రేన్లు పోల్ డ్రిల్లింగ్ మెషిన్లు మరియు ట్రాక్టర్ల సహాయంతో అత్యంత క్లిష్ట పరిస్థితుల మధ్య, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, తెగిపోయిన లైన్ల పునరుద్ధరణ ప్రమాదకర వృక్షాల తొలగింపు వంటి పనులను వేగవంతంగా పూర్తి చేసి, విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసామని తెలిపారు. విద్యుత్ సరఫరా త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన సామగ్రి, యంత్రాలు, ట్రాన్స్ఫార్మర్లను ఆయా జిల్లాలో సమీకరించినట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెగిపోయిన విద్యుత్ తీగలు, దెబ్బతిన్న స్తంభాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా విద్యుత్ సంబంధిత ప్రమాదకర పరిస్థితులు గమనించినట్లయితే కాల్ సెంటర్ నెంబర్ 1912కు లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ లో సహకరిస్తున్న సిబ్బందికి, సహనం పాటిస్తున్న వినియోగదారులకు సీఎండీ కృతజ్ఞతలు తెలిపారు.

## రూ.10 కోట్ల ప్రజాధనం వృథా!

### అంధకారంలో పెదగంట్యాడ అల్లూరి పార్కు -కనీస వసతులు శూన్యం..

### ఆకతాయిలకు అడ్డా -కమిషనర్ స్పందించాలని కాలనీవాసుల డిమాండ్

గాజువాక,మే 25,ప్రభాతవార్త



భారీ బడ్జెట్‌తో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కు అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నాణ్యతా లోపానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. సుమారు రూ. 10 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించినప్పటికీ, కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.

### అడుగడుగునా లోపాలే..

పార్కు ప్రారంభోత్సవ సమయంలోనే అల్లూరి విగ్రహం వద్ద లైట్లు ఏర్పాటు చేయాలని ఏఈ రవికి స్థానికులు సూచించినా నేటికీ మోక్షం కలగలేదు. పిల్లల ప్లే ఏరియాలో కూడా విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో చీకటిని ఆసరాగా చేసుకుని ఆకతాయిల ఆగడాలు పెరుగుతున్నాయని, ఇది బాలికల భద్రతకు ముప్పుగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పార్కులో ఎక్కడా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన వాష్‌రూమ్‌లలో నీటి సదుపాయం లేక అవి నిరుపయోగంగా మారాయి. మొక్కల కోసం వేసిన ప్లంబింగ్ "వాటర్ స్పిట్లు" ప్రారంభం నుండి పనిచేయడం లేదని పార్కు సిబ్బందే స్వయంగా చెబుతున్నారు.

### కమిషనర్ తనిఖీ చేయాలి..

"రూ.10 కోట్ల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లు దేనికి ఖర్చు చేశారు? ఇంత నాణ్యతా లోపానికి బాధ్యులెవరు?" అని పెదగంట్యాడ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నగర కమిషనర్ నేరుగా వచ్చి పార్కును పరిశీలించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుని, పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

## పద్మనాభంలో ఎట్టకేలకు కొండగెడ్డ కాలువలో చెత్తాచెదారం తొలగింపు పనులు



పద్మనాభం, మే 25,ప్రభాతవార్త

మండల కేంద్రమైన పద్మనాభం గ్రామంలో కొండగెడ్డ కాలువలో చెత్తాచెదారం తొలగింపు పనులను అధికారులు ఎట్టకేలకు చేపట్టారు.అయితే అనంతుని కొండ మెట్ల వద్ద ఉన్న గిరిజన కాలనీ నుండి బి.సి.కాలనీ మీదుగా ఉన్న కొండగెడ్డ కాలువ పనులను గ్రామ ఎంపీటీసీ కంటుబోతు లక్ష్మీనాయుడు చొరవతో సచివాలయ అధికారులు గత నాలుగైదు రోజుల నుండి చేయిస్తున్నారు. చెత్తాచెదారంతో ఊర కోనేరు వరకు నిండి ఉన్న ఈ కాలువను జెసిపితో శుభ్రం చేయిస్తున్నారు. దీంతో రెండు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హిమాచల్ నగర్‌లో పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు :పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

గాజువాక,మే 25,ప్రభాతవార్త



జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ పరిధిలో శ్రీ పెంటమాంబ అమ్మవారి మూరు వారం పండుగ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన గణబాబుకు స్థానికులు, భక్తులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చుక్క నీరు లేదు.. బిందెలతో పోరుబాట

### 68వ వార్డులో 200 కుటుంబాల తాగునీటి ఘోష -గాజువాక జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద మహిళల ధర్నా



గాజువాక,మే 25,ప్రభాతవార్త

తాగునీరు అందక ఆ ప్రాంతమంతా అల్లాడిపోతోంది. మూడు నెలలుగా చుక్క నీటి కోసం మైళ్ల దూరం నడవాల్సిన దుస్థితి నెల కొంది. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన మహి ళలు ఖాళీ బిందెలతో రోడెక్కారు. గాజువాక మండలం అక్కిరెడ్డిపాలెం పరిధిలోని 68వ వార్డులో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. విశాఖ డైరీ వెనుక, రైల్వే ట్రాక్ సమీప ప్రాంతంలో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత మూడు నెలలుగా వీరికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. నిత్యం కనీస అవసరాలకు కూడా నీరు దొరక్క నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు.

### కార్యాలయం ముట్టడి..

అధికారుల నిర్లక్ష్య వైఖరిపై విసిగిపోయిన బాధితులు.. సోమవారం పెద్ద ఎత్తున ఖాళీ బిందెలతో జోనల్ కమిషనర్ కార్యాలయానికి తరలివచ్చారు. కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తాము పడుతున్న కష్టాలను మీడియా ఎదుట వివరిస్తూ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. కూలి పనులు మానుకొని నీటి కోసం తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

## మహానాడు పార్టీ సామగ్రి అందజేత

విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త



ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు వర్చువల్ సమావేశాలకు సంబంధించిన పార్టీ సామగ్రిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. భీమిలి నియోజకవర్గంలో భీమిలి, ఆనంద పురం, పద్మనాభం మండలాలు, 1 నుంచి 8 వార్డులు, 98 వార్డు సహా మొత్తం 12 క్లస్టర్లు ఉన్నాయి. ప్రతి క్లస్టర్ లోనూ మహానాడు కార్యకలాపాలు వీక్షించడానికి వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ దిశానిర్దేశం మేరకు ముఖ్య నాయకులు పాల్గొనున్నారు. పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన తోరణాలు, జెండాలు, కండువాలు, బ్యాడ్జీలు, టోపీలు తదితర సామగ్రిని ఆనందపురం, పద్మనాభం, జీవీఎంసీ 5, 6, 7 వార్డు పార్టీ శ్రేణులకు గంటా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, కోరాడ రమణ, మొల్లి లక్ష్మణరావు, మాన్యాల సోంబాబు, కానూరు అచ్యుతరావు, సూరాల సత్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.33,660 కోట్లతో..

7వ పేజీ తరువాయి ..

ప్రధాన లక్ష్యమని మాధవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల అమలుతో సుమారు 15 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ప్రభుత్వ అంచనాలను ఆయన ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు ఈ పథకం బలమైన ప్రోత్సాహం ఇవ్వనుండగా, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి కూడా దోహదపడు తుందని అన్నారు. "ఆత్మనిర్భర్ భారత్", "వికసిత భారత్ 2047" లక్ష్యాల సాధనలో "భవ్య" పథకం కీలక పాత్ర పోషించ నుందని పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు.

## బాల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

### పిల్లలకు డైట్ కిట్లు పంపిణీ చేసిన కెఎన్‌పి చక్రవర్తి



పిఎం పాలెం, మే 25, ప్రభాతవార్త:

రత్నం బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ సోమవారం ప్రారంభమైంది. పీఎం పాలెం సృజనా స్కూల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి కెఎన్‌పి చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో సుమారు 50 మంది బాలబాలికలు పాల్గొన్నారు. జీవీఎంసీ సౌజన్యంతో ప్రతిరోజు పిల్లలకు గుడ్డు, బిస్కెట్ ప్యాకెట్, మజ్జిగ, చిక్కి అందజేయనున్నారు. సంఘం అధ్యక్షులు డీకేవీఆర్ మోహన్ రావు, కార్యదర్శి నక్క శ్రీకాంత్, కోశాధికారి భాస్కరరావు క్యాంప్ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా కెఎన్‌పి చక్రవర్తి పిల్లలకు డైట్ కిట్లు పంపిణీ చేసి, నిర్వాహకులు మరియు విద్యార్థులను అభినందించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

## పింఛన్‌ల పంపిణీలో సమయపాలన ముఖ్యం

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త:** సామాజిక భద్రతా పింఛన్‌ల పంపిణీలో అవినీతికి తావులేకుండా సమయపాలన పాటించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పింఛన్ పంపిణీ అధికారుల(పిడిఓ)తో సమావేశం కాగా జిల్లాలోని యంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్‌లు, ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతినెల 2,26,396మంది పింఛన్ లబ్దిదారులకు రూ.98.52కోట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. లబ్దిదారులకు ఏవిధమైన ఇబ్బంది కలుగకుండా లబ్దిదారుల ఇంటివద్దే పింఛన్‌లు అందించాలని ఆదేశించారు. పింఛన్‌ల పంపిణీ చేసే సమయంలో లబ్దిదారులతో మంచి, మర్యాదతో వ్యవహరించాలని, ఫిర్యాదులు లేకుండా పంపిణీ జరగాలన్నారు. పింఛన్‌ల పంపిణీ అనంతరం ఐవిఆర్‌ఎస్ కాల్స్ ద్వారా వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను అధికారులు నిరంతరం పరశీలిస్తూ ఎక్కడైన పొరపాట్లు జరిగితే వాటిని సరిచేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నాణ్యమైన సేవలు అందించటం ద్వారా ప్రజల నుండి సానుకూల స్పందన పొందవచ్చన్నారు. ప్రభుత్వ పథకాల అమలుతీరుని నిరంతరం పర్యవేక్షించాలని, పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో అదృశ్యమైన బాలిక విజయవాడలో గుర్తించిన పోలీసులు

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త:** అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అదృశ్యమైన బాలిక ఆచూకిని పోలీసులు కొద్దిగంటల్లోనే గుర్తించారు. విశాఖపట్నంలో బాలిక అదృశ్యం కాగా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా సదరు బాలిక విజయవాడ దుర్గగుడి పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం విశాఖపట్నం గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యం అయిన ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించారు. అదృశ్యమైన బాలిక ఫోటోను ఆర్‌టిజిఎస్‌లో పొందుపరచగా, సోమవారం మధ్యాహ్నం బాలిక కనకదుర్గగుడి వద్ద ఏర్పాటు చేసిన ఫెషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కెమెరాలలో కనిపించింది. వెంటనే అప్రమత్తమైన కమాండ్ క ంట్రోల్ సిబ్బంది సిసిఎస్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సిసిఎస్ సిబ్బంది బాలికను పట్టుకుని, గాజువాక పోలీసులకు, బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

**సైబర్ నేరాల నియంత్రణకు పోలీస్‌లకు శిక్షణ:** సైబర్ నేరాల నియంత్రణకు విజయవాడ కమీషనరేట్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్ నుండి ఒక కానిస్టేబుల్‌కు 5 రోజులపాటు సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈమేరకు సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని విజయవాడ సిపి రాజశేఖరబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్ది సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. వీటి నియంత్రణకు సైబర్‌నేరాల నియంత్రణలో ఏఐ పరిజ్ఞానం వినియోగించే అంశంలో కానిస్టేబుళ్ళకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పదే పదే పెట్రో ధరలు పెంచడం దుర్మార్గం

• సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మోడీ ప్రభుత్వం పదే పదే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై గుదిబండ మోపడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడొక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం గత 10 రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరల భారం మోపడమే పనిగా పెట్టుకుంది. నేడు నాలుగో దఫా పెట్రోలపై రూ.2.84 డీజిల్‌పై రూ.2.86 పెంచటం దుర్మార్గం. విపరీతంగా పెంచిన పెట్రోల్ ,డీజిల్ ధరలతో రవాణా ఖర్చులు, నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి జనజీవనం అస్తవ్యస్తమవుతుంది. పెట్రో ధరలు విపరీతంగా పెంచాలనే యోచనతోనే ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలంటూ ప్రధాని మోడీ కుంటి సాకులు చెప్పారు. 2014 లో ఇప్పటికంటే అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర బ్యారెల్ కు 109 డాలర్లు ఉండగా, పెట్రోల్ లీటర్ దర రూ.57లుగా ఉండేది. 2026 లో బ్యారెట్ ముడిచమురు ధర 106 డాలర్లుగా ఉన్నప్పటికి పెట్రోల్ ధర లీటర్‌కు రూ.117 రూపాయలకు పైగా చేరింది. 2014 కంటే క్రూడ్ ఆయిల్ ధరలు నేడు తక్కవగా ఉన్నప్పటికీ పెట్రోల్,డీజిల్ రేట్లు రెట్టింపుకు చేరాయి. 2020 కోవిడ్ కాలంలో బ్యారెల్ ముడిచమురు ధర అమాంతం రూ.37.63కి పడిపోయింది. ముడి చమురు ధరలు మూడో వంతుకు పడిపోయినప్పటికీ మోడీ ప్రభుత్వం మన దేశంలో పెట్రోల్ ఉత్పత్తుల ధరలు ఏమాత్రం తగ్గించలేదు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగితే దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతున్నారేగాని తగ్గినప్పుడు మాత్రం తగ్గించిన పాపాన పోలేదు. అంతేకాకుండా పెట్రో ఉత్పత్తులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తామేమి తీసిపోమన్నట్లుగా ఎపీ ప్రభుత్వం అధిక పన్నులు సుంకాలు వడ్డిస్తూ ప్రజల నడ్డి విరుస్తోంది. గతంలో క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గినప్పుడు పెట్రో ఉత్పత్తులు ధరలు ఏమాత్రం తగ్గించని కేంద్రం, యుద్దాన్ని బూచిగా చూపిస్తే పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను మరింత పెంచటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనిని బట్టి ప్రజా శ్రేయస్సు, సంక్షేమం పట్ల మోడీ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనేది బహిర్గతమవుతోంది అని ఈశ్వరయ్య దుయ్యబట్టారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెంపును వ్యతిరేకిస్తూ నిరసనల తెలుపండి

• ప్రజాప్రతినిధులకు సిపిఎం పిలుపు

**విజయవాడ, మే 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల నడ్డి విరిచే విధంగా రోజూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు తెలియచేయాలని, ప్రజా ప్రతినిధులను (యంపీలు, ఎమ్మెల్యేలను) నిలదీయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ప్రజలకు పిలుపునిచ్చింది. పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. వరుసగా నాలుగోసారి మళ్లీ ఈ రోజు రూ.2.86, రూ.2.84లు చొప్పున చమురు ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచే కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. గత పది రోజులుగా రెండు మూడు రోజులకొకసారి చమురు ధరలను పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజానీకంపై పెనుభారం వేయడం గర్హనీయమన్నారు. దఫదఫాలుగా భారాలు వేస్తుండడంతో నిత్య జీవితావసరాల ధరలు పెరిగి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. మరోవైపు చమురుపై రాష్ట్ర ప్రభుత్వం టాక్స్‌లు తగ్గించడం లేదని చెప్పారు. ఇష్టానుసారం ధరలు పెంచి దోచుకుంటున్న ప్రైవేట్ ఆయిల్ కంపెనీలకు ముకుతాడు వేయాలి.. కానీ అదానీ, అంబానీలకు, అమెరికా ఆయిల్ కంపెనీలకు లొంగిపోయిన ప్రభుత్వం ఆ భారాన్ని ప్రజలపై వేస్తున్నది తప్ప ప్రజల బాధలు కనపడడం లేదు అని ధ్వజమెత్తారు. ప్రజలు వ్యతిరేకించి నిరసనలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మాట తప్పి మోసం చేసిన ప్రభుత్వ తప్పుడు విధానాన్ని ప్రజలు నిరసించాలన్నారు. పెంచిన చమురు ధరలను ఉపసంహరించాలని ఎక్కడికక్కడ ప్రజలను కదిలించి నిరసనలు తెలపాలని పార్టీ శాఖలకు పిలుపునిచ్చారు.

# ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు జూన్ 12 వరకు మూసివేత

• దుర్గమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యాల పరిశీలించిన కలెక్టర్

**ఇంద్రకీలాద్రి, మే 25 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో భక్తులకందుతున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ లక్ష్మిషా సోమవారం పరిశీలించారు. దేవస్థానం లో గల ప్రథమ చికిత్స కేంద్రంను జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు. వేసవి ఎండ నేపథ్యంలో భక్తులకు అందిస్తున్న వైద్య సదుపాయాలు గురించి వివరాలు తెలుసుకున్నారు. రోగుల వివరాల రిజిస్టర్ పరిశీలించారు. భక్తుల నిమిత్తం దేవస్థానం శివాలయం వైపు, ఘాట్ రోడ్ వైపు వేసవి తీవ్రత రీత్యా అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించేలా అవసరమైన ఏర్పాటు చేయాలని ఈవో శీనా నాయక్‌ను ఆదేశించారు. రాజగోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులతో కలెక్టర్ ముచ్చటించారు. అనంతరం మహామండపం వైపు నుండి ఆలయ ధర్మకర్తలు, అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు. కలెక్టర్ ఈ సందర్భంగా శ్రీ దుర్గమ్మ హారతులు దర్శించుకున్నారు. ఈవో వికె శీనా నాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదములు అందజేశారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**మరమత్తు పనులవల్ల జూన్ 12వరకు ఘాట్‌రోడ్డు మూసివేత:** దుర్గమ్మ ఆలయం ఘాట్‌రోడ్డుకు మంగళవారం నుండి మరామత్తు పనులు జరుగుతాయని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. మే 26 నుండి జూన్ 12 వరకు మరామత్తు పనులు ఆర్‌అండ్‌బి శాఖవారిచే జరుపుతున్నందున ఘాట్‌రోడ్డును మూసివేస్తామని భక్తులు ఈ విషయాన్ని గమనించి కనకదుర్గానగర్ నుండి మాత్రమే శ్రీ దుర్గమ్మవారి ఆలయానికి రావాలన్నారు.




**భక్తుల విరాళాలు:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుజిల్లా తాడేపల్లికి చెందిన కె శిరీష రు.1,00,120ల విరాళం సోమవారం అందించారు. అలాగే దేవదాయ శాఖ రిటైర్డ్ రీజినల్ జాయింట్ కమిషనర్ డి భ్రమరాంబ రు.1,00,001ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, అందించగా వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

**అగ్నిప్రమాదక మాక్‌డ్రిల్:** దుర్గమ్మ ఆలయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారించడానికి వీలుగా సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, దుర్గమ్మ ఆలయ సెక్యూరిటి సిబ్బందికి, దేవస్థాన సిబ్బందికి దేవాదాయ శాఖ కమిషనర్ వారి ఆదేశాల ప్రకారం ఇంద్రకీలాద్రి పై ఫైర్ సేఫ్టీ ఆడిట్‌లో భాగంగా అగ్ని ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా మాక్ డ్రిల్ జరిగింది. జిల్లా సహాయక అగ్ని మాపక అధికారి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అగ్ని మాపక చర్యలు గురించి వివరించారు.





## నా స్థలాన్ని నాకు ఇప్పించండి

భీమవరం 'స్పందన'లో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్

**ఏలూరు, మే 25 పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో:** మా స్థలాన్ని కబ్జా చేసి మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దయచేసి మమ్మల్ని కాపాడండి మా స్థలం మాకు ఇప్పించండి అంటూ ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ భూవివాదం విషయంలో అధికారులను ఆశ్రయించారు. తమ కుటుంబానికి చెందిన భూమిని కబ్జా చేసి, బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆయన పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో భాగంగా భీమవరంలోని జిల్లా కలెక్టరేట్‌కు స్వయంగా వచ్చి ఆయన ఈ ఫిర్యాదును అందజేశారు. వివరాల్లో కెళితే యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామంలో తమ కుటుంబానికి చెందిన 5 సెంట్ల ఉమ్మడి స్థలాన్ని ఆక్రమించారని అనంత శ్రీరామ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంలో సీనియర్ రాజకీయవేత్త, మాజీ మంత్రి హరిరామజోగయ్య కుమారుడైన సూర్యప్రకాశ్ తమను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. తమ ఉమ్మడి స్థలాన్ని తమ అనుమతి లేకుండానే వేరొకరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ స్థలంలో అక్రమంగా చొరబడ్డారని లారీలతో మెటీరియల్ కూడా దించారని ఆయనన్నారు. ఈ భూవివాదంపై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తోందని అనంత శ్రీరామ్ తెలిపారు. అయినప్పటికీ, తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, గ్రామంలో ఉంటున్న తన తల్లిదండ్రులకు తగిన రక్షణ కల్పించాలని జిల్లా అధికారులను ఆయన అభ్యర్థించారు. ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి 15 రోజుల్లో మీకు సమాధానం అందజేస్తామని తెలిపారు.



సోమవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విహెచ్‌పి ప్రతినిధులు

## గో హత్యలు ఆపేందుకు కృషి చేస్తా

గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో చట్టవిరుద్ధమైన గో హత్యలను ఆపేందుకు కృషి చేస్తానని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా హామీ ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించడం శిక్షార్హమన్నారు. సమాజంలో అందరి విశ్వా సాలను గౌరవించాల్సిందేనని ఆయన చెప్పారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రతినిధి బృందం గవర్నర్ కలిసింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, గోరక్ష, సాధు సంతులు విభాగం ప్రతినిధులు గవర్నర్‌కు వినతిపత్రాన్ని అందజేసి కొన్ని విషయాలను తెలిపారు. రాష్ట్రంలో అక్రమంగా బైండోవర్లు కొన సాగిస్తూ తమ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తూ మజ్లీస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసు యంత్రాంగం తీరును వారు గవర్నర్‌కు వివరించారు.

బక్రీద్ సందర్భంగా వేలాది గోమాతలను బలిచ్చేందుకు డంపు చేసి ఉంచారని, వాటిని విడిపించి గోశాలకు తరలించడంలో పోలీసులు ఘోరంగా విఫలం చెందారని ఆరోపిం చారు. రాష్ట్రంలో హిందువుల మనోభావాలకు ఏమాత్రం గౌరవం లేదని, గోమాతలు హత్యకు గురవుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదని, ఓటుకు ఇచ్చినంత విలువ గోమాతలకు ఇవ్వడం లేద న్నారు. గవర్నర్ మాట్లాడుతూ తనకున్న విశిష్ట అధికారాలను వినియోగించి గోవుల రక్షణకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విహెచ్‌పి నాయకులు యాదగిరిరావు, రమేష్, పగుడాకుల బాలస్వామి, సుభాష్‌చందర్, దుర్గా నందపురిస్వామి, విశోకతీర్థస్వామి, శ్రీకాంత్ ఇంద్రస్వామి, కృష్ణ చాముం డేశ్వరీనాథస్వామి, హరికిషన్‌శర్మ, అనిల్ పాల్గొన్నారు.

## ఎండిపోతున్న కృష్ణమ్మ.. వట్టిపోతున్న శ్రీశైలం డ్యామ్

కుడి, ఎడమగట్టున నిలిచిపోయిన విద్యుదుత్పత్తి

వెంటాడుతున్న ఎల్‌నినో భయాలు.. ఆలస్యం కానున్న వర్షాలు

అదే జరిగితే తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్ సాగు, తాగునీటికి కటకటే

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాలకు గుండెకాయ లాంటి శ్రీశైలం జలాశయం పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. ఎప్పుడూ నిండు కుండలా, జలకళతో ఉట్టిపడే శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రస్తుతం వేగంగా అడుగంటిపోతోంది. ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాదకరంగా పడిపోతూ డెడ్ స్టోరేజీ వైపు దూసుకుపోతోంది. దీంతో అటు రాయలసీమతోపాటు ఇటు ఇరు తెలుగు రాష్ట్రాల్లోని సాగు, తాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు. కానీ ప్రస్తుతం అందులో కేవలం 817 అడుగుల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మొత్తం 215 టీఎంసీలకుగాను ఇప్పుడు జలాశయంలో కేవలం 39 టీఎంసీల నీరు మాత్రమే మిగిలి ఉంది. సాధారణంగా 800 అడుగులకు నీటిమట్టం పడిపోతే దాన్ని డెడ్ స్టోరేజీగా పిలుస్తారు. అంటే శ్రీశైలం ఆ మార్కుకు మరెంతో దూరంలో లేదు. నీళ్ల క్రమంగా అడుగంటుతుండటంతో కుడి, ఎడమ గట్టున ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని అధికారులు ఇప్పటికే పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం కేవలం ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాల కోసం (ఇండెంట్ ప్రకారం) మాత్రమే నీటిని వాడుతున్నారు. ఒకవేళ నీటిమట్టం 800 అడుగులకు చేరితే అసలు విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశమే లేకుండా పోతుంది. నిజానికి గత ఏడాది శ్రీశైలం ప్రాజెక్టుకు రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చింది. కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి ఊహించని విధంగా భారీగా వరద రావడంతో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జూన్ నెలలోనే ప్రాజెక్ట్ పూర్తిగా నిండిపోయింది. గతంలో ఎప్పుడూ ఇంత త్వరగా శ్రీశైలం నిండిన దాఖలాలు లేవు. అప్పట్లో దాదాపు 1,218 టీఎంసీల నీరు శ్రీశైలానికి రాగా అధికారులు ఆ నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. కానీ గతేడాది అంతలా మురిపించిన కృష్ణమ్మ ఈ ఏడాది మాత్రం జనాన్ని టెన్షన్‌లో పడేస్తోంది. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల వర్షాలు చాలా ఆలస్యంగా వచ్చే అవకాశం ఉంది. వర్షాలు ముఖం చాటేస్తే శ్రీశైలం ప్రాజెక్టుపై ఆ ప్రభావం మరింత ఘోరంగా ఉంటుంది. వర్షాలు లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కూడా బాగా ఆలస్యమవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ శ్రీశైలం పైనే ఆధారపడి ఉన్నాయి. అలాగే దిగువన ఆంధ్ర, తెలంగాణల్లోని సాగర్ ఆయకట్టుకు కూడా శ్రీశైలం ప్రాజెక్టే ప్రధాన ఆధారం. ఈ నేపథ్యంలో వర్షాలు పడటం మరింత ఆలస్యమైతే రాబోయే రోజుల్లో తాగునీటి కోసం తీవ్రమైన కఠిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని నీటిపారుదల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## థియేటర్లలో పర్సంటేజ్

చిరంజీవితో ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల గిల్డ్, ఎగ్జిబిటర్ల భేటీ

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** సినిమాల ప్రదర్శనకు సంబంధించి పర్సంటేజ్ విధానంపై నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై మెగాస్టార్ కొణిదల చిరంజీవి దృష్టిసారించారు. ముఖ్యంగా పెద్ది సినిమా నుంచే తమకు పర్సంటేజి విధానాన్ని అమలు చేసే విషయంపై చర్చించేందుకు తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ హైదరాబాద్‌లో సోమవారం చిరంజీవితో భేటీ అయింది. ఈ భేటీలో పర్సంటేజి విధానంతో పాటు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు, రెంటల్ విధానంలో తాము చూస్తున్న నష్టాలను గురించి అసోసియేషన్ చర్చించింది. అలాగే పర్సంటేజిపై తమ నిర్ణయాలను ఫిలిం చాంబర్ అధ్యక్షుడు సురేష్ బాబు, కేఎల్ నారాయణ, నిర్మాత దిల్ రాజు చిరంజీవికి వివరించారు. దాదాపు గంట సమయంపాటు ఈ సమావేశం కొనసాగింది. సమావేశం ముగిసిన అనంతరం చిరంజీవి గిల్డ్ నిర్మాతలకు ఫోన్ కాల్ చేసి పిలిచారు. గిల్డ్ నిర్మాతలంతా చిరంజీవి ఇంటికి చేరుకుని, ఆయనతో సమావేశమయ్యారు. ఎగ్జిబిటర్ల సమావేశం ముగిసిన తర్వాత నిర్మాత దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. చిరంజీవితో సమావేశం అనంతరం ఎగ్జిబిటర్లంతా సంతోషంగా ఉన్నామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. సినీ పరిశ్రమకు సంబంధించిన సమస్యను ఆయన అర్థం చేసుకున్నారని, రెండ్రోజుల్లో ఎగ్జిబిటర్ల సమస్యకు ఫుల్ స్టాప్ పెట్టేలా నిర్ణయం వెల్లడిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని దిల్ రాజు చెప్పారు. ఎగ్జిబిటర్ల డిమాండ్లపై ఫిలిం చాంబర్ ఇప్పటికే ఒక కమిటీ వేసిందని, ఆ కమిటీ ఇచ్చిన రిపోర్టును చిరంజీవి తెప్పించుకుంటారని తెలిపారు. మరోవైపు రేపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో సినీ నిర్మాతలు భేటీ కానున్నారు. చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించడంతో పాటు, పర్సంటేజీ విధానంపై కూడా చర్చించనున్నారు.

# కర్ణాటక సాగునీటి ప్రాజెక్టులతో రైతుల ప్రయోజనాలకు భంగం కలగొద్దు

ఆ రాష్ట్ర మంత్రి బోసురాజుతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కృష్ణా జలాల వినియోగంపై సచివాలయంలో ఉభయ రాష్ట్రాల మంత్రుల కీలక భేటీ

**హైదరాబాద్, మే 25, ప్రభాతవార్త:** తెలంగాణ– కర్ణాటక రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వినియోగం, తాగు నీటి అవసరాలపై కీలక సమావేశం జరిగింది. ఈ మేరకు సోమవారం తెలంగాణ సచివాలయంలోని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చాంబర్‌లో కర్ణాటక చిన్న నీటిపారుదలశాఖ మంత్రి బోసురాజు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలుగకుండా కర్ణాటక ప్రాజెక్టుల రూపకల్పన ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాలకు మేలుజరిగే రీతిలో సాగు, తాగునీటి ప్రాజెక్టు లపై కూలంకషంగా చర్చించారు. కృష్ణానదిపై ప్రాతిపదిత బ్యారేజ్ నిర్మాణ అంశాలపై సాంకేతిక అంశాలపై విస్తృతం గా చర్చ జరిగింది. తెలం గాణ సాగునీటి హక్కులు, భవిష్యత్ అవసరాల పరిరక్షణ, కృష్ణా జలాల సమన్యాయ విని యో గంపై రాష్ట్ర హక్కు లను కాపడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరు రాష్ట్రాల మంత్రులు చర్చించారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. తెలం గాణ రైతాంగం సాగునీటి అవసరాలపై ఈ సందర్భంగా చర్చల్లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. పరస్పర అవగాహనతోనే కృష్ణా జలాలను తెలంగాణ, కర్ణాటక వినియోగించాలని మంత్రులు నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, రాయచూరు ఎంపి. కుమార్ నాయక్, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి, రాయచూరు రూరల్ ఎమ్మెల్యే బసవన్న గౌడ, ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, వంశీ కృష్ణ, రాష్ట్ర నీటిపారుదల కార్యదర్శి ఇ. శ్రీదర్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ.ఎన్.సి రమేశ్‌బాబు, కర్ణాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ కార్యదర్శి బి.కే. పవిత్ర తదితరులు పాల్గొన్నారు.




## ఎల్ అండ్ టి గెస్ట్‌హౌస్‌లో అగ్నిప్రమాదం

• ఘటనస్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ సంకీర్త్ • విచారణకు ఆదేశాలు

**మహాదేవపూర్, మే 25, ప్రభాతవార్త:** మహాదేవ పూర్ మండలం అంబటి పల్లి గ్రామ సమీపంలోని ఎల్ అండ్ టీ గెస్ట్ హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం స్థాని కంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షి ంచారు. ఈ సందర్భంగా అగ్నిప్రమా దానికి గల కారణాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలు సుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టారన్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు వేగంగా స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చా రన్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. అయితే ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెలుగులోకి రానున్నాయి. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వెంట కాటారం డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఎల్ అండ్ టీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



26skl13:26skl13.qxd 25-05-2026 22:14 Page 1



## బహిరంగ వేలం లేకుండా లీజు పొడిగింపా?

### మండిపడుతున్న తెట్టంగి గ్రామ ప్రజలు



వీరఘట్టం, మే 25, ప్రభాతవార్త :

అన్న సత్రం భూములకు సంబంధించి లీజు గడువు ముగిసినప్పటికీ , బహిరంగ వేలం నిర్వహించకుండా మళ్లీ అదే వ్యక్తికి నిబంధనలకు విరుద్ధంగా అప్పజెప్పడంపై తెట్టింగి గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. ఈ మేరకు సోమవారం వారు జిల్లా కలెక్టర్ కు నేరుగా ఫిర్యాదు చేశారు మండలంలోని తెట్టింగి గ్రామ పరిధిలో గల బేవర గోపాలనాయుడు అన్న సత్రంకు సంబందించిన తెట్టింగి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 289-6లో గల 4.21 ఎకరాల దేవాదాయ భూములుకు బహిరంగ వేలం నిర్వహించకుండా నిబంధనలుకు విరుద్ధంగా లీజు పొడిగించారనీ , తెట్టంగి రెవెన్యూ సిబ్బంది, దేవాదాయ సిబ్బంది కలిపి సదరు పాత కౌలుదారుడితో చేతులు కలిపి ఎటువంటి ముందుస్తూ ప్రభుత్వం ప్రకటన గానీ, ఓపెన్ అక్షన్ గానీ నిర్వశీచకుండా రహస్యంగా మళ్ళీ అదే వ్యక్తికి ఏకపక్షంగా కౌలును పొడిగించారనీ వారు ఆరోపించారు. ఈ చర్య పూర్తిగా చట్టవిరుద్ధంగా చేయడంతో పాటు అధికార దుర్వినియోగం తీసుకోని హక్కును కాలరా స్తున్నారనీ , ఇది ఎంత మాత్రమూ సమంజసం కాదని వారు నిలదీస్తున్నారు దీనిపై తక్షణమే విచారణ చేపట్టి , స్థానిక సిబ్బంది పై విచారణ జరిపించి తక్షణమే ఓపెన్ అక్షన్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు తీర్మానించారు. తీర్మానం ప్రకారంస్థానిక నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు గర్భనా సత్తిబాబు , జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ సూచనలు మేరకు సోమవారం పార్వతీపురం మన్యం కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డికి, జిల్లా దేవాదాయ శాఖాధికారికి వినతిపత్రాన్ని గ్రామం ప్రజలు తరుపున అందజేయడంతజరిగిందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రిటైర్డ్ హెడ్ మాస్టర్ వందాన సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వందాన సాయి కిరణ్, జనసేన నాయకులు పి. జె మోహన్ రావు, వందాన శ్యామ్, పొట్నూరు శ్రీనివాసరావు, వందాన సురేష్, గెదల కన్నబాబు, వందాన దామ్, వందాన సీతారామ్ వందాన ప్రసాద్ జరజాపు పద్మరాజు, స్థానిక గ్రామ నాయుకులు ప్రజలు, తదితరులు ఉన్నారు.

## బడి ఈడు పిల్లల వివరాల సేకరణ



సీతంపేట, మే 25, ప్రభాతవార్త :

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశాలు డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర సూచనల మేరకు బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఐటీడీఏ ఉప విద్య శాఖ అధికారి పాలక నారాయడు ఆధ్వర్యంలో కుసిమి, సంతమల్లి, దారిమల్లి, మాసడుగూడ గ్రామాల్లో బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. బడి ఈడు పిల్లల గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించివివరాలు సేకరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న పిల్లలను గుర్తించి, వారిని ఒకటవ తరగతిలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మల్లి పాఠశాల హెచ్ఎం ఏవి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి ఎం. ఆనందరావు, మూటక ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవలు వేగవంతం చేయాలి : జేసీ

వీరఘట్టం, మే 25, ప్రభాతవార్త :



జిల్లాలో ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడంతో పాటు పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సి యస్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు రెవెన్యూ సేవలు పారదర్శకంగా, వేగంగా అందే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో మొదటగా రెవెన్యూ పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని, అనవసరంగా పెండింగ్‌లో ఉంచరాదని అధికారులకు సూచించారు. మ్యుటేషన్ ప్రక్రియల పురోగతిపై సమీక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి పిలిచినా పలికే డాక్టర్ ఇకలేరు...



కోటబొమ్మాళి, మే 25, ప్రభాతవార్త :

ప్రజల ఆరోగ్యానికి అండగా నిలిచిన సీనియర్ వైద్యులు డాక్టర్ సదాశివుని నిరంజన్ రావు ఇకలేరు. హైద రాబాదులో తన కుమారుడు ప్రవీణ్ నివాసంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసిన వెంటనే కోటబొమ్మాళి మండలం, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గత 15 సంవత్సరాలుగా కోటబొమ్మాళి ప్రాంత ప్రజలకు ఆయన అందించిన వైద్య సేవలు మరువలేనివిగా నిలి చాయి. అర్ధరాత్రి వేళల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పల్లె వారి ఇండ్లకు కాంపౌండర్ లేకుండా తన స్కూటీ పైన మందుల సంచితో స్వయంగా వెళ్లి చికిత్స అందించిన అరుదైన వైద్యు నిగా డాక్టర్ నిరంజన్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారు. పేద, ధనిక అనే తేడా లేకుండా 24 గంటలు అందుబాటులో ఉండి ఎన్నో కుటుంబాలకు భరోసాగా నిలిచారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల తన కుమారుడు ప్రవీణ్ ఇంటివద్ద హైదరాబాదుకు వెళ్లారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి కన్ను మూశారు. వైద్య వృత్తితో పాటు రాజకీయ రంగంలో కూడా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కింజరాపుఎర్రన్నాయుడు ఎమ్మెల్యేగా ఉన్న కాలం నుండి నేటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వరకు తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పని చేసిన ముఖ్య కార్యకర్తగా డాక్టర్ నిరంజన్ రావు ప్రశంసలు పొందారు."ప్రాణాలకు ప్రాణం పోసిన డాక్టర్ ఇకలేరు" అంటూ గ్రామస్తులు, పార్టీ నాయకులు, ఆయన సేవలు పొందిన ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు.

## భూసారం ఆధారంగా పంటలు వేసుకోవాలి : ఏవో

కోటబొమ్మాళి,మే 25, ప్రభాతవార్త :



భూసార పరీక్షలు ఆధారంగా భూమిలో గల పోషకాల వివరాలను తెలుసుకుని తగు మోతాదులో ఎరువులు వేసుకోవడం ద్వారా ఎరువుల ఖర్చును తగ్గించి అదిక గుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు అన్నారు. ఆయన సోమవారం మండలంలోగల పెద్దబమ్మిడి గ్రామంలో మట్టినమూనాలను సేకరించు విదానం పై చైతబిలకు అవగాహన కల్పించారు. 25 ఎకరాలకు నమూన చొప్పున్న గ్రామ వ్యవసాయ సహాయకులు సహకారంతో మట్టినమునా సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. మండలంలో 218 నమూనాలు మే నెలలో సేకరణ లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామని ఆయన తెలిపారు. మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు, వీఏఏ డి. జాన్ని రైతులు పాల్గొన్నారు.

## దుక్క చత్రపతి రెడ్డి స్మారకార్థం..

## ఉపాధి హామీ వేతనదారులకు టోపీలు పంపిణీ



మెళియాపుట్టి , మే 25, ప్రభాతవార్త :

మండల కేంద్రంలో దుక్క చత్రపతి రెడ్డి స్మారకార్థం కుమారుడు దుక్క నరసింహారెడ్డి (బాబు) మండుతున్న ఎండలు దృష్ట్యా ఉపాధి హామీ వేతన దారుల ఇబ్బందులు చూసి చలించి, ఉపాధి హామీ వేతన దారులకు తలకు టోపీలు పంపిణీ చేశారు. నరసింహారెడ్డి (బాబు) మాట్లాడుతూ వేతనదారులు మండు వేసవిలోనూ ఉపాధి హామీ పనులు చేస్తూ ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించి, వారికి ఎండ నుండి ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో తన తండ్రి జ్ఞాప కార్థం తలకు టోపీలు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్ చాణుక్య, ఉపాధి హామీ మేట్లు, స్థానిక యువకులు పట్నాన ఈశ్వరరావు, నిద్రబింగి విజయ్ కుమార్, మారం వెంక రావుదల్లి చినబాబు, మురళీమోహన్ పాత్రో మాస్టారు, నక్కల కిరణ్ కుమార్ రెడ్డి,గంప శ్యామ్,పరపటి రవి కుమార్ రెడ్డి,, పరపటి వినోద్ కుమార్, మాడుగుల మణికంఠ, ప్రసాదు, బాలు స్థానిక యువకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి కార్యాలయం ప్రారంభోత్సవం

రాజాం, మే 25, ప్రభాత వార్త:



రాజాం నియోజకవర్గంలో నూతనంగా వైఎస్ఆర్సిపి నూతన పార్టీ కార్యాలయాన్ని మాజీ ఉప ముఖ్య మంత్రి రాజన్న దొర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జడ్పి చైర్పర్సన్ మజ్జి చిన్న శ్రీనివాసరావు, పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి ముఖ్య అతిథులుగా పాల్గొనివివిధ విభాగాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. పాలవలస శ్రీనివా సరావు, మాజీ సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, సోషల్ మీడియా వారియర్స్, వివిధ మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈదుపురంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం



ఇచ్ఛాపురం, మే 25, ప్రభాత వార్త:

ఈదుపురం గ్రామ పంచాయతీలో ఉపాది ,హామీ పనులు ప్రారంభించారు. 9 లక్షలతో చేపట్టనున్న కోమటి చెరువు పనులను వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద రెడ్డి ప్రారంభించారు. 18 గ్రూప్‌లకు పని కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటిసి ప్రతినిధి ఉప్పాడ రాజా రెడ్డి,మాజీ ఎంపీటీసీ దుక్క నీలాద్రి రెడ్డి,ఉప్పాడ ఈశ్వర రావు దువ్వు నీలయ్య,ఆసి ధర్మరాజు,ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్తోరా, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపాను శాశ్వతంగా పాతాళానికి పంపుతాం

### - రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, మే 25, ప్రభాతవార్త :




గత వైకాపా పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారిని కమీషన్ల పేరుతో వేధించి భయభ్రాంతులకు గురిచేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నాకెంత.. నీకెంత" అంటూ పారిశ్రామికవేత్తలను భయపెట్టడం వల్లే వారు ఈ రాష్ట్రానికి దండం పెట్టి వెనుదిరిగారని ఆయన మండిపడ్డారు. టెక్కలి నియోజకవర్గం, కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ పరిధిలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10.51 కోట్ల వ్యయంతో, 12.22 ఎకరాల విస్తీర్ణంలో 74 ప్లాట్లతో నూతనంగా అభివృద్ధి చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఎంఎస్ఎంఈ పార్కులు విప్లవాత్మక సోపానాలుగా నిలుస్తాయని మంత్రి ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 38 పార్కులకు వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ గారు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశ్రమలతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం : మంత్రి

కోటబొమ్మాళి, మే 25:

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం చీపురులపాడు గ్రామపంచాయతీ పరిధిలోని 12 ఎకరాల విస్తీర్ణంలో అంచనా వ్యయం రూ. 10.51కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎం ఎస్ ఎం ఈ ( ) పార్క్ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో దశలవారీగా ఎం ఎస్ ఎం ఏ పార్కులు అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగా జిల్లాలోని టెక్కలి, ఆముదాలవలస, ఇచ్చాపురం, నరసన్నపేట నియోజవర్గాలలో ఎం ఎస్ ఎం ఈ పార్కులను అమరావతి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 12 ఎకరాల్లో భూమిని 74 ఫ్లాట్ గా చదును చేసి రహదారులు, విద్యుత్తు, తాగునీటి, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి జిల్లాలో ప్రధానమైన ఎంఎస్సీ పార్కుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ఎంఎస్ఎమ్ఈ పార్క్ కు నలు దిక్కులా రహదారుల సౌకర్యం ఉన్నందున పారిశ్రామిక వాడగా రూపొందించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, కళింగ వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, కోటబొమ్మాళి పీ ఏ సి ఎస్ అధ్యక్షులు వెలమల విజయ లక్ష్మీ, ఏపీ ఐఐసి జోనల్ మేనేజర్ వి. కృష్ణ ప్రసాద్, ఆర్డీవో ఎమ్.కృష్ణ మూర్తి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం. సుధాకర్, తహసీల్దార్ ప్రసాద్, ఎమ్ పీ డీ ఓ ఫణేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేట వారపు సంతలో మజ్జిగ పంపిణీ

సీతంపేట, మే 25, ప్రభాతవార్త:



వేసవి తీవ్రత దృష్టిలో పెట్టుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సీతంపేట వారపు సంతలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీబీ మిశ్రా. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు. కార్యదర్శి రామకృష్ణ, ఇమరక పవన్, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి బాబులకు ఇక చుక్కలే!



### క్షణాల్లో తేల్చేస్తున్న అధునాతన కిట్

పలాస, మే 25, ప్రభాత వార్త:

మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై కాశీబుగ్గ పోలీసులు ఉక్కుపాదం మోపారు. పట్టణంలో గంజాయి సంస్కృతికి చరమగీతం పాడేందుకు సరికొత్త సాంకేతికతను రంగంలోకి దించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బిఎన్ని రామకృష్ణలి ఆధ్వర్యంలో వారి సిబ్బంది పలాస కాశీబుగ్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా అనుమానితులను పరీక్షించేందుకు ప్రత్యేక లి'గంజాయి డిటెక్షన్ కిట్లను' ఉపయోగించడం స్థానికంగా కొందరు జులయి యువతలో కలకలం రేపింది. ఇప్పటివరకు ఎవరైనా గంజాయి సేవించారా లేదా అని నిర్ధారించడం పోలీసులకు కొంత సవాలుగా ఉండేది. కానీ, ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఈ సరికొత్త డిటెక్షన్ కిట్ ద్వారా కేవలం కొద్ది నిమిషాల్లోనే ఫలితం తేలిపోతుంది. ఎవరైనా గంజాయి తాగినట్లు అయితే, ఈ కిట్ ద్వారా వెంటనే తెలియడంతో చర్యలకు అవకాశం ఉంది.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక దువ్వాడ దుష్ప్రచారాలు

### దువ్వాడ శ్రీధర్ పై నిప్పులు చెరిగిన టీడీపీ నేతలు

పలాస, మే 25, ప్రభాత వార్త:



రాజకీయ రంగంలో మచ్చ లేని కుటుంబం గౌతు కుటుంబమని టీడీపీ నేతలు తమ్మినేని గంగారం, కుత్తుమ్ లక్ష్మన్,దువ్వాడ సంతోష్ కుమార్ నాయుడు, దువ్వాడ శ్రీహర్ష, తదితరులు పేర్కొన్నారు. ఇటీవల వైసీపీ అని చెప్పుకొని తిరిగే దువ్వాడ శ్రీధర్ గౌత కుటుంబం పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొంటూ స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి గౌతు శివాజీ చలవతోనే పిఏసిఎస్ చైర్మన్ గా నాడు ఎన్నికయ్యావని గుర్తు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి దృష్టిలో పడి వైసీపీ టికెట్ సంపాదించుకునేందుకు అవాకులు చవాకులు మాట్లాడడం సరికాదన్నారు.



## బడిఈడు పిల్లలు బయట ఉండరాదు

ఇచ్ఛాపురం, మే 25, ప్రభాతవార్త:

మండలంలోని బడిబయటి పిల్లలు, బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కలెక్టరు ఆదేశానుసారం మండల పరిధిలో ఎంపిడిఓ ప్రభాకర్ రావు అధ్యక్షతన మరియు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ రమేష్ అధ్యక్షతన స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు శ్రీకాకుళం పర్యవేక్షణలో స్థానిక తహసీల్దారు వెంకట్రావు శ్రీనివాస రావు, ఇరువురు మండల విద్యాశాఖాధికారులు, సూర్యా రావు,విశ్వనాథం లు సి అర్ ఎం టి లు, సచివాలయ విద్యాసహాయకులకు "బడిపిలుస్తోంది" కార్యక్రమంపై వేర్వేరుగా సమావేశములు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అవాసప్రాంతాల్లో ఉన్న బడి ఈడు పిల్లల్ని తక్షణమే ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అంగన్వాడి కార్యకర్తలకు, సచివాలయ విద్యాసహాయకులకు,సి అర్ఎంటిలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మరియు ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో బడిపిలుస్తోంది విద్యా అవగాహన కార్యక్రమాల్ని రేపటినుంచి నిర్వహించి మరో మూడు రోజుల్లో బడి ఈడు మరియు బడిబయటి పిల్లలని తక్షణమే బడుల్లో చేర్పించాలని ఆదేశాలు జారీచేశారు. బడివయస్సు గల ప్రతి ఒక్క బాలబాలికలు తప్పకుండా బడుల్లో చేర్పించాలని జిల్లాకలెక్టరు ఆదేశానుసారం మండల మరియు మున్సిపాలిటీ పరిధిలో విద్య అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు తెలియజేశారు. బడిపిలుస్తోంది గోడ, కర పత్రికలుఎంపిడిఓ ప్రభాకర్ మున్సిపల్ కమిషనర్ రమేష్ వేర్వేరుగా విడుదల చేశారు.

## ప్రతీ ఇంటికో పారిశ్రామికవేత్తే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, మే 25, ప్రభాతవార్త :



ఏపీలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రేగిడి మండలం, గుల్లపాడు పంచాయతీ ఉంగరాడ మెట్ట వద్ద 30 ఎకరాలలో రూ. 4.20 కోట్లతో ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రేగిడి ఎంపీడీవో కార్యాలయంలో ఎంఎస్ఎంఈ పార్క్ వర్చువల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలవనుందన్నారు.నేడు రాష్ట్రంలో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు,గురవాణ నారాయణ రావు, పాలవలస రమణ మూర్తి, దుప్పలపూడి శ్రీను, గేదెల బాబురావు, గేదెల బాలమురళీ, ధనుంజయ, రామచంద్రరావు, ఉషారాణి,క్రాంతి,కర్నేన మహేష్, చల్లా భుజంగరావు, రమణ , గర్లె హరి, తదితర కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు, తహసీల్దార్ , ఎంపీడీఓ, ఉద్యోగులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి : సిపిఐ డిమాండ్

రాజాం, మే 25, ప్రభాతవార్త :

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.దేశంలో ఎక్కడా లేని విధంగా డబల్ ఇంజిన్ సర్కారీ చెప్పుకుంటున్నాను ఆంధ్ర ప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో డీజిల్ పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉండటం దురదృష్టకరమని అన్నారు పెంచన్న ధరలను తక్షణమే సహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు ఆగ్రహానికి మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇరాన్ అమెరికా యుద్దాన్ని బూచిగా చూపి ఇంధన ధరలు పెంచడం దుర్మార్గమైన అన్నారు కేంద్ర ప్రభుత్వం పది రోజుల్లో నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలు నడ్డి విరిచిందని అన్నారు. ఈ నెల 15న పెట్రోల్ పై మూడు డీజిల్ పై మూడు రూపాయలు 19న పెట్రోల్ పై 87 డీజిల్ పై 81 పైసా 23న 91 పైసా పెట్రోల్ పై 90 పైసలు డీజిల్ పై 25న పెట్రోలపై రెండు 84 పైసలు డీజిల్ 2 86 పైసలు పెంచడం దుర్మార్గమన్నారు.

## ఆత్మహత్యాయత్నం నుంచి ప్రేమికులను రక్షించిన శక్తి టీమ్ సిబ్బంది

### శక్తి టీమ్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం (ఆమదాలవలస), మే 25:



పాలకొండ మండలానికి చెందిన పి.లావణ్య,బి.గణేష్ గత నాలుగు నెలలుగా పరస్పరం ప్రేమించుకుం టున్నారు. కుటుంబ సభ్యులు వారి వివాహానికి అంగీకరించకపోవడంతో ఈనెల 19వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయారు. అనంతరం వారి వద్ద ఉన్న డబ్బులు అయిపోవడంతో పాటు భవిష్యత్తుపై ఆందోళనకు గురై తీవ్ర మనస్తాపం చెందారు.ఈ నేపథ్యంలో సోమవారం ఆమదాలవలస బస్టాండ్ ఎదురుగా ఉన్న రైల్వే పట్టాల వద్ద ఆత్మహత్యకు యత్నిస్తున్న సమయంలో విధుల్లో ఉన్న శక్తి టీమ్-2 ఇన్‌చార్జి ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ తమ్మినేని అమ్మాజీ, ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ ధనలక్ష్మి వారిని గమనించి వెంటనే అప్రమత్తమై రక్షించారు.వారిద్దరిని ప్రశ్నించి పూర్తి వివరాలు సేకరించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఆమదాలవలస పోలీసులకు, పాలకొండ ఎస్ఐకు సమాచారం అందించారు. తర్వాత యువజంటను పాలకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.జిల్లా ఎస్పీ అభినందన సమయస్ఫూర్తితో స్పందించి ఇద్దరి ప్రాణాలను కాపాడిన శక్తి టీమ్ సిబ్బందిని అభినందించారు. యువతకు నిత్య జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా క్షణకావేశంలో ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం : ఎస్పీ



శ్రీకాకుళం, మే 25, ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆయా ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ , పరిష్కారం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా ఎస్పీ మొత్తం 70 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పౌర సంబంధిత వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు, మోసపూరిత ఘటనలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 70 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు.

## సాంకేతికతపై పట్టు సాధించాలి

శ్రీకాకుళం రూరల్ , మే 25, ప్రభాతవార్త :

జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని (తండేవలస) జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, సోమవారం సాయంత్రం సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న ట్రైనీ కానిస్టేబుళ్లతో మాట్లాడి, వారికి అందిస్తున్న శిక్షణ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.పోలీసు విధుల్లో క్రమశిక్షణ, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలపై ట్రైనీ కానిస్టేబుళ్లకు సూచనలు చేశారు.శిక్షణ కేంద్రంలో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణ కార్యక్రమాలను జిల్లా ఎస్పీ పరిశీలించి కొత్త చట్టాలు, సైబర్ నేరాలు, దర్యాప్తు విధానాలు తదితర అంశాలపై అందిస్తున్న శిక్షణను, అవుట్‌డోర్‌లో పరేడ్, డ్రిల్, శారీరక దారుఢ్య శిక్షణ, ఆయుధాల వినియోగం వంటి అంశాలను పరిశీలించి ట్రైనీ కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. పోలీసు విధుల్లో శారీరక సామర్థ్యంతో పాటు చట్టాలపై సమగ్ర అవగాహన కూడా అవసరమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.అనంతరం శిక్షణ కేంద్రంలో కల్పిస్తున్న మౌలిక వసతులు,మెడికల్ సెంటర్, భోజనశాల,ఆహార నాణ్యత, వసతి గదులు,పరిశుభ్రత, కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు తదితర సదుపాయాలను పరిశీలించారు. శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరు,శిక్షణ ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కేంద్ర డీఎస్పీ గోవిందరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన వేగవంతం చేయాలి : కలెక్టర్

శ్రీకాకుళం, మే 25, ప్రభాతవార్త:




జిల్లాలో జనగణన గృహ జాబితా లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు జనగణన ఎంతో కీలకమైందని, ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు ప్రజలతో స్నేహపూరిత వాతావరణంలో మెలుగుతూ సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్తున్న సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి, సరైన వివరాలు అందించాలని కోరారు. డేటా నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, ఆర్డీఓ కృష్ణమూర్తి, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

## ఎలుగుబంటి హల్‌చల్

పలాస, మే 25, ప్రభాత వార్త:

మఖరజోల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి భారీ ఎలుగుబంటి హల్ చల్ చేసింది. వేసవి కాలం కావడంతో డాబాలు మీద గ్రామస్తులు నిద్రిస్తుండగా రావడాన్ని గమనించారు. దీంతో కలకలం చెలరేగింది. గ్రామంలో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. టార్చ్ లైట్ వేసి ఎలుగుని తరిమేందుకు ప్రయత్నించారు అనంతరం గ్రామస్తులు కేకలు వేయడంతో డాబా మీద నుంచి పరుగులు తీసిన సమీప తోటలోనికి వెళ్ళిపోయింది. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని వారంతా ఆందోళన చెందుతున్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతదేహం

రైల్వే పరిధిలో పలాస - పూండి రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 50-55 సంవత్సరాలున్న గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. మృతదేహం శరీరం సన్నముగా ఉండి, జుట్టు కొంచెం తెలుపు రంగులో ఉన్నది. మృతదేహాన్ని పలాస గవర్నమెంట్ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. వివరాలు తెలిస్తే పలాస రైల్వేస్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు 9247585743 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలి.

**CHANGE OF NAME**

I, KILLAM SETTY PARVATEESAM S/O LATE VASAYYA, R/O PLOT NO 8-301, SBI Colony, Punyapu Veedhi, Srikakulam 532001. Have changed my name from KILLAMSETTY PARVATHEESAM (Old name) to KILLAM SETTY PARVATEESAM (New name). Henceforth I will be called as KILLAM SETTY PARVATEESAM (New name) for all purpose.

26 -5Pg9th cheli.qxd:26 -5Pg9th cheli.qxd 1/1/02 6:23 AM Page 1





ఆరోగ్యం కోసమని చాలామంది మళ్లీ ఇనుప కడాయిని ఎంచుకుంటున్నారు. దానిలోనూ కొన్ని పదార్థాలను వండవద్దు. టొమాటో, చింతపండు వంటి పుల్లని

# ఇనుప కడాయిలో ఇవొద్దు!

పదార్థాలు వండొద్దని తెలుసు కదా! వెనిగర్, నిమ్మ, టొమాటో సాస్‌లు వాడే ఆహారాలకీ ఇది సరిపడదు. ఇంకా ఆ జాబితాలోకి ఆకుకూరలు, మాష్రూమ్‌లు కూడా వస్తాయి. ఇవి సున్నితంగా ఉంటాయి. త్వరగా అడుగంటుతాయి కూడా. అంతేకాదు.. దీని నుంచి వచ్చే అతివేడికి పోషకాలూ పోతాయి. తినీ ప్రయోజనం ఉండదు. అందుకే వీటినీ వండొద్దు. చేపలు, సముద్ర ఆహారమేదైనా దీనిలో వండక పోవడమే మంచిది. ఇవీ వండే క్రమంలో పాత్ర అడుగు భాగాన అతుక్కు పోతాయి. నూనె, నెయ్యి ఎక్కువ మొత్తంలో వాడినా ప్రయోజనం ఉండదు. నూనె అతిగా అవ్వడమే కాదు, రుచీ మారిపోతుంది. అన్నం, పాస్తాలకీ ఈ సూత్రం వర్తిస్తుంది. పైగా వీటిల్లోని నూనెలు ఇనుముతో చర్యనొందుతాయి. అందుకే వీటికీ ఇనుప కడాయి సరికాదు. ఆమ్లెట్, కోడిగుడ్డు పొరటు, స్వీట్లు.. సిద్ధం చేయడానికీ ఇనుప కడాయి మంచి ఎంపిక కాదు. వీటి తాలూకూ వాసనలు ఇనుమును త్వరగా పట్టేస్తాయి. ఎంత శుభ్రంగా కడిగినా త్వరగా వదలవు. తర్వాత వండేవాటికి పట్టి, వాటి రుచిపై ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు గుడ్లలోని సల్ఫర్ ఇనుముతో చర్య పొందుతుంది. రుచిపై ప్రభావం చూపడంతోపాటు అది త్వరగా సిలుము పట్టేలా చేస్తుంది. అందుకే వీటిని సిద్ధం చేసేప్పుడు వేరేపాత్రలను ఎంచుకోమంటారు.

# ఇంటర్వ్యూకు వెళ్తున్నారా!



అమ్మాయిలు ఎన్నో ఇంటర్వ్యూ వెళు తుంటారు. ఈ సారైనా ఉద్యోగాన్ని సంపాదించ గలనో లేదో అని భయపడు తుంటారు. ఇటువంట ప్పుడు జాబ్‌కు సంబంధించిన విషయాలతో పాటు బాడీ లాంగ్వేజ్‌లో పొరపాట్లుంటే సరిదిద్దుకొని వెళ్లడం మంచిది.

ఇంటర్వ్యూ చేస్తున్నవారికి ఎదురుగా ఒంటి కూర్చోవడం, కాలుపై కాలు వేసుకొనో.. లేదా టేబుల్‌కు దూరంగా కుర్చీకి జారగిలపడటం వంటివి చేయకూడదు. ఇవన్నీ మీలో ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్నట్లు, ఉద్యోగం పట్ల ఉత్సాహం లేదన్నట్లుగా చూపిస్తాయి. ఈ కదలికలు అవతలివారి ఏకాగ్రతను దూరం చేస్తాయి. స్ట్రెయింగ్.. మీ గంభీరతను చాటుతూ ప్రొఫెషనలిజాన్ని చూపెడుతుంది. చేతులు కట్టుకొని కూర్చోవడం కూడా సరైనది కాదు. ఈ భంగిమ స్వీయరక్షణగా అనిపిస్తుంది. అలాగే మీరు చెప్పగలిగేది ఇకపై ఏదీ లేదనే సంకేతాన్ని అవతలివారికి ఇస్తుంది. అలాకాకుండా చేతులు రెండూ ఫ్రీగా ఉంచి కూర్చోవడం మేలు. అప్పుడే ఎదుటివారు చెప్పేదానిపై మీ శ్రద్ధతోపాటు వారిపట్ల మీరు పాటిస్తున్న మర్యాద కనిపిస్తుంది. ముఖంపై పడిన జుట్టు సర్దుకోవడం, గోళ్లరంగు చూస్తూ.. కాళ్లూపడం, నిమిషానికొకసారి ముఖంపై చేతితో రుద్దు కోవడం వంటివి చేయకూడదు. దాన్ని మీ నిరాసక్తత లేదా భయంగా ఎదుటివారు భావిస్తారు. ఇంటర్వ్యూలో ఎటువంటి కదలికలను ప్రదర్శించకుండా అవసరమైనంత మనరకు జవాబు చెబుతూ, వారు చెప్పేది పూర్తిగా వినడంపై ఏకాగ్రత ఉంచితే మేలు. అడుగడుక్కీ చేతి వాచీ, గోడ గడియారం లేదా ఫోన్‌లో సమయం చూడటం మీ అసహనాన్ని ప్రదర్శిస్తుంది. ఆ ఇంటర్వ్యూపై మీకు ఆసక్తిలేదనే తప్పుడు సంకేతాన్ని స్తుంది. సమయం పూర్తవుతుందనే కంగారు మీకు ఉండి ఉండొచ్చు. అలాకాకుండా ఎదుట కూర్చున్న వారు మీ కోసం కేటా యించిన సమయానికి మర్యాద నివ్వ గలిగితే చాలు. బలపై ఉన్న పేపర్ వెయిట్, పెన్ లేదా కీ చెయిన్ వంటి వస్తువులను కదపడంవల్ల మీరు తీవ్ర ఒత్తిడికి గురవుతు న్నట్లులేదా బోర్ ఫీలవుతున్నట్లు ఎదుటి వారికి అనిపి స్తుంది. కాబట్టి సౌక ర్యంగా కూర్చొని పూర్తిగా అవతలి వారు అడిగే ప్రశ్నలమీదే దృష్టిని కేంద్రీకరించి ఆత్మ విశ్వాసంతో సమాధానం చెప్పగలిగినప్పుడే మంచి ఫలితాలొస్తాయి.

# అందాల 'కేన్' కట్టు

ఎందరో
సుందరీమణులు
అందరికీ వందనాలు
నుదుటిన బొట్టు
చేతికి సొగసులూనే బ్రేస్‌లెట్టూ
అందాలుచిందే జాకట్టు
ఇవే కదా!



భారతీయ సౌందర్యానికి ఆనవాళ్లు. ఆధునిక సమాజం ఎన్ని పోకడలు పోయినా ఎంతగా మారినా భారతీయతను ఏ మాత్రం వదిలి పెట్టదు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పక్కన పెట్టలేదు. పెళ్లిళ్లా పేరంటానికి సంప్రదాయ వస్త్రధారణయితే ఫ్రెండ్స్ క్లబ్‌లకు ఫ్యాషన్ పేరేడ్‌లకు ఆధునిక వస్త్ర ధారణను ఎంచు కుంటున్నారు. ఈ కాలం యువతులు సంప్ర దాయ వేడుకలైనా ఆటపాటల రంగోళీలకైనా మనవాళ్లు అలా తళుక్కున మెరిసి అంద చందాల వన్నెచిన్నెలకు మాకు మేమేసాటి అని నిరూపించు కుంటారు.



ఫ్రాన్స్‌లో జరిగిన 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా మన సెలబ్రిటీలంతా వారికి నచ్చిన, తోచిన రీతిలో సంప్రదాయ వస్త్ర వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ ఫెస్టివల్ ఏటా జరిగే మెగా ఈవెంట్‌గా ప్రపంచానికి తెలుసు అదొక చిత్రోత్సవకమే అయినా సౌందర్య సొబగుల ప్రపంచం అక్కడ సాక్షాత్కరిస్తుంది. ఈ ఏడాది ఆ ఉత్సవంలో ఎందరో సుందరాంగనలు భారతీయ సంస్కతికి ప్రతిబింబాలుగా రాణించారు. భారతీయత పాలు ఎక్కువే దర్శించ గలిగాం. చాలా లుమినారా వస్త్రాధారణతో సినీనటి ఐశ్వర్యరాయ్ వేదికను అలరించింది. సాంప్రదాయ నౌవారీ చీర ధరించి రెడ్ కార్పెట్‌పై నడిచిన మరాఠీ సినీనటి ప్రాజక్త మాలి అద్భుతంగా కనిపించారు. మరాఠీ సినిమా చరిత్రలో తొలిసారిగా ఒక నటి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెడ్ కార్పెట్‌పై నడిచి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమె తన సాంప్రదాయ రూపం, గ్లామరస్ శైలి రెండింటితోనూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నౌవారీ చీర అనేది మహారాష్ట్ర సాంప్రదాయ తొమ్మిది గజాల చీర, ఇది సుమారు ఎనిమిది మీటర్ల పొడవు ఉంటుంది. 36 ఏళ్ల మరాఠీ నటి ప్రాజక్తమాలి నిర్మాతగా, రచయిత్రిగా కూడా రాణిస్తున్నారు. మరాఠీ సినిమాలు, టెలివిజన్‌లో తనదైన ముద్ర వేశారు. 60 ఏళ్ల నటి నివేదిత సరఫ్‌మంగళ సూత్రంతో కూడిన సాంప్రదాయ పైఠానీ చీర ధరించి, మరాఠీ బోర్డ్ బ్లౌజ్ డిజైన్‌ను ప్రదర్శించారు. ఆమె సాంప్రదాయ రూపం వెంటనే అందరి దృష్టిని ఆకర్షించింది. కేన్స్‌లో తన ప్రదర్శన కోసం, నివేదిత మహారాష్ట్ర సంస్కృతిని అత్యంత సొగసైన రీతిలో చాటి చెప్పే ఒక అందమైన సాంప్రదాయ పైఠానీ చీరను



ఎంచుకున్నారు. ఈ చీరలో లేత పాస్టెల్ రంగులతో పాటు పూల డిజైన్లు ఉన్నాయి, వీటికి జత చేసిన ముదురు నీలం రంగు అంచు ఈ రూపానికి రాజసం ఉట్టిపడేలా చేసింది. ఆమె మంగళసూత్రం, నాథ్, లేయర్డ్ నెక్లెస్‌లు, గాజులు, చెవి పోగులు గజ్రాతో అలంకరించిన చక్కని జుట్టు ముడి వంటి సాంప్రదాయ మహారాష్ట్ర ఆభరణాలతో తన దుస్తులను పూర్తి చేసుకుంది.

# వైరాగ్య చింతన

వైరాగ్యం అనేది మానసిక భావన. ఆ భావన కలిగిన వారు సమస్త వస్తువులు, భౌతిక సుఖాలపట్ల విరక్తితో ప్రవర్తిస్తారు. దాన్నే వైరాగ్యం అంటారు. భక్తి పరాకాష్ట చేరితే వైరాగ్యం వస్తుందని పండితులు భావిస్తారు. జీవితంలో ఎక్కువ ఎదురు దెబ్బలు తిన్న వారు కూడా వైరాగ్యంలోకి వెళతారని అనుభవజ్ఞులు చెబుతారు. యోగి వేమన సుఖాలపై మొహం మొత్తి వైరాగ్యం కలిగింది.ఆ తరువాత నిత్య సత్యాలు, నీతి సూత్రాలతో శతకం రచించాడని వినికిడి. పూర్వం రాజుల కాలంలో కుమారుడికి రాజ్య పట్టాభిషేకం చేసిన తరువాత తండ్రి సన్యాసం స్వీకరించి అడవులకు వెళ్లి తపస్సు(ఆశ్రమంలో) చేసుకుంటూ వైరాగ్యంతో శరీరాన్ని విడిచేవారు. ప్రతి పురుషుడు బ్రహ్మాచర్యం, గృహస్థాశ్రమం, సన్యాసాశ్రమం, వైరాగ్యం స్వీకరించి మోక్షమార్గంలో వెళ్లాలని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి.స్త్రీ/ పురుషులు జీవితంలో మూడు సార్లు తాత్కాలిక వైరాగ్యన్ని పొందుతారని పురాణాలు చెబుతున్నాయి.వాటిలో మొదటిది పురాణ వైరాగ్యం. పురాణ ప్రవచనం వింటున్నంత సేపు మనలో అధ్యాత్మిక భావనలు పెరుగుతాయి. ప్రవచనం వింటున్నప్పుడు కలిగే విరక్తి ని పురాణ వైరాగ్యం అంటారు. ఆ ప్రవచనం నుంచి బయటకు రాగానే అదంతా మరచిపోయి మామూలు స్థితికి వచ్చేదాకా.రెండోది ప్రసూతి వైరాగ్యం. ప్రసవసమయంలో వచ్చే నెప్పులు భరించలేక సంసార సుఖంపై విరక్తి పొందుతారు. బిడ్డ జన్మించగానే ఆ ఆనందంతో నెప్పులు, వైరాగ్యం మర్చిపోయి యధా విధిగా సంసారంలో లీనమైపోతారు. మూడోది శ్మశాన వైరాగ్యం. అత్యంత ఆత్మీయులు,కుటుంబ సభ్యులు మరణించినప్పుడు వారి అంత్యక్రియల సమయంలో జీవితం క్షణభంగురం అనే స్థితిలోకి వెళతారు. ఏదీ శాశ్వతం కాదు,అంతా మిధ్యే అనే భావనతో వైరాగ్యం కలుగుతుంది. ఆ కార్యక్రమాలు పూర్తి అయి ఇంటికి రాగానే మళ్లీ ప్రాపంచిక మాయలో పడిపోతారు. ఈ పై మూడు తాత్కాలికమైనవే.ఇవిగాక మంద. మధ్యమ, తీవ్ర, తీవ్రతర వైరాగ్యాలుగా వర్గీకరించడం జరిగింది. శాశ్వత భావన మనసులో వచ్చినప్పుడు నిజమైన వైరాగ్యం కలుగుతుంది.భక్తితో వచ్చే వైరాగ్యం నిజమైన మోక్షమార్గం చూపుతుంది.

-యం.వి.రామారావు

# నిజాలు చెబుతున్నారా?



ఎదిగేచిన్నారులు చెప్పే ముద్దు ముద్దు మాటలకు మురవకుండా ఉండలేం. కానీ, చిన్న విషయానికే వారు అబద్ధాలు చెబుతోంటే మాత్రం అడ్డుకట్ట వేయాల్సిందే.

**అంచనా వేయండి..** పిల్లలు అబద్ధం చెబుతున్నారని తెలిసినవెంటనే వారిని కొట్టడమో, తిట్టడమో చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. పైగా అలా చేస్తే వారు తరువాత కూడా మీ నుంచి తప్పించుకోవడానికి ఈ అలవాటుని కొనసాగించే అవకాశం ఉంది. అందుకే, ముందు అలా ఎందుకు చెప్పారో తెలుసుకోండి. దీనికి మీ ఇంటి వాతావరణం లేదా మరే ఇతర ప్రభావా లన్నా వాళ్ల మీద పనిచేస్తున్నాయో గమనించి పరిష్కారం వెతకండి. **వాస్తవాలను వివరించండి..** వారేదైనా విషయం దాచడానికే ఆ పని చేస్తుంటే అలా చేయడం వల్ల జరిగే నష్టాన్ని వివరించండి. దాన్ని మీతో పంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనం చెప్పండి. ఒకవేళ వారు చెప్పిన విషయంలో అసలు వాస్తవాలు మీకు తెలిస్తే.. వారికి అర్థమయ్యేలా చెబితే మరోసారి ఆ పని చేయరు. **మీరే రోల్‌మోడల్..** చాలా ఇళ్లల్లో పెద్దలు పిల్లలు ఏం చేయకూడదో, ఎలా ఉండకూడదో చెబుతారు. కానీ, ఆచరణలో తాము మాత్రం ఆ పనిచేయరు. పైగా ఒక్కోసారి చిన్నారులతోనే నేను ఇంట్లో లేనని చెప్పు, గొలుసు కొనుక్కు న్నామని నానమ్మకి చెప్పకు అంటూ వారితోనే అబద్ధాలు చెప్పిస్తుంటారు. మీరు మాత్రం అలా చేయొద్దు. ఆపత్కాలానికి తప్ప మరెప్పుడూ అబద్ధమాడకూడదని అర్థమయ్యేలా మీరు ప్రవర్తించాలి. వారికి రోల్‌మోడల్ కావాలి.

**చెలి**

**సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చా లంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం.**

ఈ మెయిల్:**Cheli@vaartha.com**

# తెర

## సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో 'సింగ్ గీతం'

లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ముందుకు వస్తున్నారు. దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, పలు భాషల్లో దాదాపు అరవై చిత్రాలతో ఇండియన్ సినిమాని రీడిఫైన్ చేసిన సంగీతం, 94 ఏళ్ల వయసులో డైరెక్టర్ చైర్ లోకి తిరిగి వస్తూ, సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక బ్యానర్ల పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్, ఒక దిగ్గజ దార్శనికుడిని, లెజండరీ నిర్మాణ సంస్థను ఒకచోట చేర్చింది. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండేపూడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. మీట్ అవర్ వైజాగ్ హీరో ఈవెంట్ లో హీరో అయాన్ మాట్లాడుతూ.. నా పేరు అయాన్. మాది వైజాగ్. అక్కయ్యపాలెంలో పెరిగాను. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి తెలుగు సినిమాలో హీరోగా నటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. అహల్యా బమ్రూ మాట్లాడుతూ.. ఈ సినిమాలో నేను 'గౌరి' పాత్రను పోషిస్తున్నాను. మాది పుదుచ్చేరి . వైజాగ్ చూస్తుంటే నాకు పాండిచ్చేరి గుర్తొస్తుంది. శాలిని కొండేపూడి మాట్లాడుతూ.. వైజాగ్ నాకు చాలా స్పెషల్. ఐ లవ్ వైజాగ్. ఈ సినిమాలో నేను 'రేణు' పాత్రలో



కనిపించబోతున్నాను. లైవ్ వీడియో కాల్‌లో రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ.. హాయ్ వైజాగ్. లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం లో పనిచేయడం నిజంగా ఒక అదృష్టం. అలాంటి అవకాశం చాలా అరుదుగా వస్తుంది.

## 'సహా' (లైఫ్ ఆఫ్ సంజు) నుంచి 'సోల్ ఆఫ్ సహా' గ్లింప్స్ రిలీజ్



కొన్ని కథలు మనసులో ఎప్పటికీ నిలిచి పోతాయి. మన జీవితంలో ఎప్పుడో అనుభవించిన భావోద్వేగాలు, జ్ఞాపకాలు, కలలను అవి మళ్లీ గుర్తు చేస్తాయి. అలాంటి హృదయాన్ని తాకే అనుభూతిని అందించేందుకు వస్తోంది 'సహా' (లైఫ్ ఆఫ్ సంజు), నిషాంత్ దోటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కుమార్ కసారం హీరోగా నటిస్తుండగా, శ్వేత లక్ష్మణ్, వ్రజనా పాండ్యా కథానాయికలుగా కనిపించనున్నారు. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజేశ్వర్ వెల్పుచర్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ది సోల్ ఆఫ్ సహా పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ కథలో సంజు అనే వ్యక్తి తన జీవితంలోని అత్యంత అందమైన దశలను తిరిగి గుర్తు చేసుకుంటాడు. చిన్ననాటి జ్ఞాపకాలు, స్కూల్ రోజులు, కాలేజ్ ప్రేమ, వివాహ జీవితం, ఆ తర్వాత జరిగిన భావోద్వేగ క్షణాలు అన్నీ అతని ప్రయాణంలో భాగమవు తాయి. అయితే కథ అనూహ్య మలుపు తిరిగేది 'సహా' అనే యువతిని కలిసినప్పుడు. ఆశ్చర్యకరంగా ఆమె పేరు మాత్రమే కాదు, తన గత ప్రేమను గుర్తు చేసే ఎన్నో లక్షణాలు కూడా ఆమెలో కనిపిస్తాయి.ఈ పరిచయం విధి, గమ్యం, అసంపూర్తిగా మిగిలిపోయిన భావోద్వేగాలు, మళ్లీ జీవితంలోకి తిరిగి వచ్చే బంధాల గురించి ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతుంది. కేవలం ఒక ప్రేమకథగా కాకుండా, మనిషిని జ్ఞాపకాలు ఎలా మలుస్తాయి, కాలం బంధాలని ఎలా మార్చుతుంది, సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర అందించిన సంగీతం ఈ చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణ. కథలోని నాస్టాల్జియా ప్రేమ, భావోద్వేగాలను మరింత అందంగా ప్రతిబింబించేలా ఆయన స్వరాలు అలరి స్తున్నాయి.

## 'బ్లాస్ట్ జోన్' 28న విడుదల



మహిళా సాధికారతకు కమర్షియల్ అంశాలు జోడించి చేసిన గొప్ప చిత్రం 'బ్లాస్ట్ జోన్' : యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా, ప్రీతి ముకుందన్, అభిరామి ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్లాస్ట్ జోన్' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్ మెంట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదల చేస్తోంది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రానికి 'బ్లాస్ట్ జోన్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించడం విశేషం. ఈ సందర్భంగా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా మాట్లాడుతూ.. ' ఈ 'బ్లాస్ట్ జోన్' సినిమా నాకు ఎంతో ప్రత్యేకమైనది. సినిమా పూర్తయిన తర్వాత అవుట్ పుట్ చూసుకొని సంతృప్తి చెందే సినిమాలు కొన్ని ఉన్నాయి. అలాంటి సినిమా ఖిబ్లాస్ట్ జోన్‌ఖి. మన తల్లిదండ్రులకో, మన వాళ్ళకో అన్యాయం జరిగితే న్యాయం కోసం మనం ఖచ్చితంగా పోరాడతాం. టి అభిరామి మాట్లాడుతూ.. 'బ్లాస్ట్ జోన్' ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. ఇలాంటి మంచి మాస్ మూవీతో మీ ముందుకు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంత మాస్ క్యారెక్టర్ నేనెప్పుడూ చేయలేదు. నటి ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ.. . మన 'బ్లాస్ట్ జోన్' మూవీ మే 28న థియేటర్లలో విడుదలవుతోంది. మీ అందరూ థియేటర్లో సినిమాను చూసి ఆదరిస్తారని కోరుకుంటున్నాను.



టాలీవుడ్‌లో మరో అందమైన గ్రామీణ ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వస్, మోనిక, దివ్య ప్రధాన పాత్రల్లో, యువ దర్శకుడు ఎస్.ఎస్. వర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'సింగిల్ రాజు'. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఆసక్తి

## 'సింగిల్ రాజు' టైటిల్ గ్లింప్స్ విడుదల

రేకెత్తిస్తున్న ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ విడుదల కార్యక్రమం 'మా ఈవెంట్స్' సహకారంతో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి దర్శకుడు, నిర్మాత వేణు ఉడుగుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా "సింగిల్ రాజు'టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లిమ్స్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ.. ఎస్.ఎస్. వర్మ, విశ్వస్ ఇద్దరూ నాకు ఎంతో ఇష్టం. ఈ సినిమా కథ వినగానే చాలా ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. ఎంతో ధృడ సంకల్పంతో ఈ సినిమాను ప్రారంభించారు. దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మాట్లాడుతూ.. వేణు ఉడుగుల అన్న సపోర్ట్ లేకపోతే ఈ సినిమా సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం నాకంటే ఎక్కువగా మా అమ్మానాన్నలు కష్టపడ్డారు. హీరో విశ్వస్ మాట్లాడుతూ.. "దర్శకుడు ఎస్.ఎస్. వర్మ మేము ఎంతో ఫ్యాషన్ తో చేస్తున్న సినిమా. విలేజ్ లో షూటింగ్ జరుగుతున్నప్పుడు అక్కడ అందరూ సపోర్ట్ చేశారు.హీరోయిన్లు మోనిక, దివ్య మాట్లాడుతూ.. మా సినిమా అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది. విలేజ్ బ్యాక్ గ్రౌండ్ లో జరిగే కథలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. డైరెక్టర్ కు థాంక్స్. టీమ్ అందరూ సపోర్ట్ చేశారు. అని అన్నారు.టైటిల్ లోగోలో కనిపిస్తున్న "బ్రోకెన్ హార్ట్ ఎమోజీని బట్టి ఈ చిత్రం యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్టు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. త్వరలోనే నటీనటులు, ఇతర విశేషాలను చిత్ర బృందం అధికారికంగా ప్రకటించనుంది.

## బెంగళూరులో బాలక చిత్రం



బెంగళూరు మహానగరంలో బాలక చిత్రాన్ని రూపొందిస్తున్నారు.ఇటీవలే మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మొదటి లుక్, కథానాయకుడు ప్రియదర్శి విడుదల చేశారు.. ఆంధ్ర కుర్రాడు బెంగళూరులో ఎదుర్కొనే కష్టాల నేపథ్యంతో వినోదభరితమైన కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా వరంగల్, హనుమకొండ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది.నివేదా థామస్ వారి తమ్ముడు నిఖిల్ థామస్ నటిస్తున్న ఈ చిత్రానికి మల్లూ నాయక్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. విశ్వదీప్ సంగీతాన్ని అందిస్తున్నారు ,

## 'మేము కాప్'లం' 17 రోజుల్లో పూర్తి:



కిషోర్ బోయిడాపు

నాగబాబు ప్రధాన పాత్రలో ప్రదీప్ మద్దాలి తెరకెక్కించిన సిరీస్ 'మేము కాప్'లం' సిరీస్‌తో మన ముందుకు వచ్చి అందరి ప్రశంసలు అందు కుంటున్నారు. ఈ సిరీస్‌ను కేవలం 17 రోజు ల్లోనే తెరకెక్కించటంలో కీలక పాత్రను పోషించిన కిషోర్ బోయిడాపు తన సినీ ప్రయాణం విశేషలు.

**నేపథ్యం....** నా పూర్తి పేరు దుర్గ కిషోర్ కుమార్. మా ఫ్యామిలీ అంతా ఇండస్ట్రీలోనే ఉండటంతో సహజంగానే నాకు ఇంట్రెస్ట్ ఏర్పడి ఉంది. మా నాన్న గారు మమ్మల్ని ఫోటో తీసి.. ఆ ఫోటోలతోనే కథ చెప్పేవారు.

**సినీ ప్రయాణం....** 2002లో రవి ప్రసాద్ యూనిట్‌లో కెమెరా అసిస్టెంట్‌గా కెరీర్ స్టార్ట్ చేశా. ఓ నాలుగేళ్ల తరువాత ముంబైకి వెళ్లాను. అక్కడ మొదటి ప్రాజెక్ట్‌గా స్లమ్‌డాగ్ మిలియనీర్‌కి కెమెరా డిపార్ట్మెంట్‌లో పని చేశాను. ఆ తరువాత ఇంగ్లీష్ సినిమాలకి కూడా వర్క్ చేశాను. ఈ జర్నీలో నేర్చుకున్న ప్రతి విషయం నాకు చాలా విలువైనది. థ్యాంక్స్ టు అనీల్ మెహతా. కోవిడ్ తర్వాత నాకు మై నేమ్ శృతి,105 మినిట్స్ వంటి సినిమాల్లో అవకాశం వచ్చినప్పుడు, నేను సార్‌తో మాట్లాడాను.

**సవాలుతో కూడుకున్నది....** సింగిల్ షాట్‌లో సినిమా తీయడం అనేది సవాల్‌తో కూడుకున్న పని. హన్సిక గారితో చేసిన 105 సింగిల్ కారెక్టర్‌తో, సింగిల్ షాట్‌తోనే మూవీని చేశాం.

**ఫిల్మ్ నుంచి డిజిటల్...**ఒకప్పుడు ఫిల్మ్‌తో షూట్ చేసేవారు. ఇప్పుడంతా డిజిటల్‌లోకి మారింది. ఇప్పుడు ఎన్ని టేకులు అయినా తీసుకుంటున్నాం.

**వారినే ఫాలో అవుతా....**సినిమాటోగ్రఫీలో ఒక్కొక్కరిది ఒక్కో స్టైల్. రవి వర్మన్ గారు, అనీల్ మెహతా గారు, సుదీప్ చటర్జీని నేను ఎక్కువగా ఫాలో అవుతుంటాను.

**..హాలీవుడ్‌కి, మనకి తేడా అదే....** హాలీవుడ్ సినిమాల్లో కలర్ టోన్ ఎక్కువగా నేచురల్, సాఫ్ట్, మరియు సినిమాటిక్‌గా ఉంటుంది. వాళ్లు రియలిస్టిక్ లైటింగ్, కంట్రోల్డ్ కలరింగ్ ఉపయోగిస్తారు. ఇండియన్ సినిమాల్లో మాత్రం వైబ్రంట్ కలర్స్, రిచ్ స్కిన్ టోన్స్, ఎమోషనల్ లైటింగ్ ఎక్కువగా కనిపిస్తాయి. హాలీవుడ్‌లో వాడే కలర్ టోన్ వేరు. మన కథలు వేరు, మన కల్చర్ వేరు,

**17 రోజుల్లోనే షూట్...** 'మేము'కాప్'లం'మొత్తం షూటింగ్‌ను కేవలం 17 రోజుల్లో పూర్తి చేశాం. మంచి ప్రీప్రొడక్షన్ ప్లానింగ్ వల్ల, అలాగే ప్రతి డిపార్ట్‌మెంట్ ఎంతో కష్టపడి పనిచేసినందువల్లే అది సాధ్యమైంది.

**ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్ట్‌లు..** "ప్రేమకు నమస్కారం రిలీజ్‌కు రెడీగా ఉంది. షణ్ముక్, శివాజీగారు, భూమికగారు ఇందులో నటించారు.

26vzm15:26vzm15.qxd 26-05-2026 00:06 Page 1



## శంకర్ రావుకి అండగా పక్కిగ్రామం



బొబ్బిలి మే 25 ప్రభాతవార్త:

బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన శంబంగి శంకర్రావు కు గ్రామమంతా ఏకమై అన్ని విధాలుగా ఆయనకు అండగా నిలిచింది. గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై అత్యవసర చికిత్స నిమిత్తం విశాఖపట్నం అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన మధ్య తరగతి కుటుంబానికి చెందినవాడు కావడంతో గ్రామ యువత మరియు ప్రజల సహకారంతో అందరూ చేతులు కలిపి ఆర్థిక సహాయాన్ని అందించి కుటుంబానికి అండగా నిలిచారు. అదేవిధంగా ఇతర గ్రామాలకు చెందిన శంకర్రావు మిత్రులు, శ్రేయోభిలాషులు కూడా కొంతమేరకు ఆర్థిక సహాయాన్ని ఆయన తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు మాట్లాడుతూ తీవ్ర మనస్థాపానికి గురై గ్రామంలో ఎవరికైనా కష్టం వస్తే శంకర్రావు తొందరగా స్పందించేవాడని, అలాంటి తరుణంలో శంకర్రావు కష్టం వచ్చిందని తెలిసిన వెంటనే పక్కి గ్రామ యువకులు, ప్రజలు స్పందించారని అదేవిధంగా ఆర్థిక సహాయం చేయడంలో కీలక పాత్ర పోషించి బాధ్యత వహించి కష్టపడిన వ్యక్తులకు పక్కి గ్రామం మరియు ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులు స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కుటుంబ సభ్యులందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## మండల పరిషత్‌లో చలివేంద్రం ప్రారంభం



చీపురుపల్లి , మే 25, ప్రభాత వార్త :

చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో డిడిఓ కే హేమ సుందర్ సారథ్యంలో ఎంపీడీవో ఐ సురేష్ తమ సిబ్బందితోపాటు ప్రజల దాహార్తిని తీర్చడానికి సోమవారం నాడు చలివేంద్రం ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయంతో పాటు ప్రాంగణంలో గల పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు పనుల మీద వచ్చే ప్రజలు సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు డిడిఓ కేహమ్ సుందర్ వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ప్రవీణ్ కుమార్ డిప్యూటీ ఎంపీడీవో అప్పలనాయుడు, టైపిస్ట్ సురేష్, పంచాయతీ ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ నాసిక రామ్మోహన్, మండల పరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వాలీబాల్ పోటీలకు డీవీఎల్ విద్యార్థి



శృంగవరపుకోట,మే25, ప్రభాతవార్త :

జాతీయ పరా సిట్టింగ్ వాలీబాల్ పోటీలకు మండలంలోని భవాని నగర్ డీవీఎల్ స్కూల్లో తొమ్మిదివ తరగతి చదువుతున్న విద్యార్థి అడపా లోకేష్ ఎంపికయ్యాడు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పరా వాలీబాల్‌పోటీల్లో లోకేష్ మంచి సత్తాచాటి ద్వితీయ స్థానం పొందాడు. ఈమేరకులోకేష్‌కు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం దక్కింది. లోకేష్ విజయం పట్ల స్కూల్ యాజమాన్యం డాక్టర్ వరలక్ష్మీ, రాజేంద్రప్రసాద్,స్కూల్ ప్రిన్సిపాల్ జానకీ వ్యాయామ ఉపాధ్యాయులు గొర్లె రాము,పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## పనిచేశాము .. వేతనాలు ఇవ్వండి



గరివిడి, మే25, ప్రభాత వార్త:

మండలంలోని చుక్కవలస ఉపాది హామీ పథకం వేతన దారులు తాము పనిచేసిన మూడు రోజుల పనిదినాలకు వేతనాలు అందివ్వాలని కోరుతూ గరివిడి ఎంపిడిఓ ఎం వి బి సుబ్రహ్మణ్యం కి వినతిపత్రం అందించారు.అలాగే చుక్కవలస వేతన దారులకు వంద రోజుల్లో 50 శాతం పనిదినాలు కూడా ఇవ్వటం లేదని వారు తమ పిర్యాదు లో పేర్కొన్నారు.ఉపాధి పనుల్లో అవినీతి అక్రమాలు నిగ్గు తేల్చాలని వారు వేడుకున్నారు. చుక్క వలస ఉపాధి వేతన దారులు గ్రామ పరిధిలో గల తోట పల్లి కాలువ పని మూడు రోజులు నిర్వహించారు. కాగా ఉపాధి హామీ పథకం లో ఎటువంటి అవినీతి అక్రమాలు చోటు చేసుకోలేదని ఎంపిడిఓ ఎంవిబి సుబ్రహ్మణ్యం అన్నారు. కాగా ఉపాధి హామీ పథకం ఇంజనీరింగ్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ చుక్క వలస వేతన దారులకు తోటపల్లి కాలువ పని కొనసాగిస్తున్నామని చెప్పారు. వేతన దారులు అపోహ పడొద్దన్నారు. అవినీతి అక్రమాలు చోటు చేసుకునే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు.

## ఎన్సిసి క్యాడేట్లకు పది రోజుల ప్రత్యేక శిక్షణ



చీపురుపల్లి , మే 25, ప్రభాతవార్త :

చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న సుమారు 50 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఎన్సిసి లో భాగంగా ఇంటర్ గ్రూప్ కాంపిటేషన్ కొరకు తగరపువలసలోని ఏ ఎన్ ఐ టి ఎస్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్సిసి అధికారి మామిడి శ్రీనివాసరావు సోమవారం నాడు విలేకరులు తెలిపారు. ఈనెల 25 నుండి జూన్ నెల 3 వరకు 10 రోజుల పాటు ఏ ఎన్ ఐ ఎస్ ఇంజనీరింగ్ కాలేజీ లో నిర్వహించ పడుతుందని వివరించారు. శిక్షణ లో భాగంగా క్యాడిట్లకు వివిధ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.ముఖ్యంగా దేశభక్తి, క్రమశిక్షణ, మైండ్ మ్యాపింగ్, హెల్త్ మరియు నేషనల్ ఇంటిగ్రేషన్, శారీరక దృఢత్వం ,ఇతరులకు సహాయం చేయడం, విపత్తులు జాగ్రత్తలు, యోగా మొదలైన అంశాలపై ప్రత్యేక శిక్షణ పది రోజులు పాటు విద్యార్థులకు నిర్వహించబడుతుందని ఆయన తెలియజేశారు. శిక్షణా తరగతులకు సంబంధించి బయలుదేరుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని డి. ఉమామహేశ్వరి క్యాంపును జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్సిసి అధికారి మామిడి శ్రీనివాస్ రావు తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గొంతెండుతున్న కొండపాలెం

### ఆగిన నీటి సరఫరా - ఆగని దాహం కేకలు

గరివిడి ,మే25, ప్రభాత వార్త :

నీటి కోసం కొండ పాలెం వాసులు మొర్రో అంటున్నారు. ఎండిన గొంతులతో మండిన ఎండల్లో నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు. కొండ పాలెం (గరివిడి) మేజర్ పంచాయతీ లో గత వారం రోజులుగా నీటి సరఫరా నిలిచి పోవడంతో కొండ పాలెం వాసులు గొంతెండుతోంది. కొండపాలెం ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. అధికారులు ఇదిగో ..అదిగో...అంటూ నీటి సరఫరా పై ప్రకటనలు చేస్తున్నారే తప్ప ప్రజలు గొంతు తడిపే కార్యక్రమానికి వారు సంసిద్ధులు కావడం లేదు. గరివిడి పట్టణానికి గెడ్డపువలస, గజ్జిశీగవలస నీటి పథకాల నుండి నీటి సరఫరా అవుతుంది. గజ్జిశీగవలస వద్ద మోటారు మరమ్మతులు కి గురైన నేపథ్యంలో గత వారం రోజులు గా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు నీటికోసం పాట్లు పడే దుస్థితి నెలకొంది. ట్యాంకర్ల ద్వారా కొన్ని పరిమిత కాలనీలుకి మాత్రమే చాలీచాలని నీటిని అందిస్తూ అధికారులు తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్నామని పేర్కొంటున్నారు. పరిమిత కాలనీ వాసులు సైతం కొద్దిపాటి నీటి చుక్కలు వలన మా గొంతు తడిచే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. కాగా కొండ పాలెం ఈ ఓ వేణుగోపాల్ మాట్లాడుతూ మోటారు మరమ్మతులు నేపథ్యంలో కొన్ని కాలనీ లకు నీటి సరఫరా ఆగిందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీరు అందిస్తున్నామన్నారు.కాగా ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీర్ భాస్కర్ మాట్లాడుతూ మోటారు మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని త్వరితగతిన నీరు అందించే పనులు కి చర్యలు చేపట్టామన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో వందమందికి భోజనాలు

బొబ్బిలి మే 25 ప్రభాతవార్త:

బొబ్బిలి జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ క్యాంటీన్ జనసేన పార్టీ ఇంచార్జి డా,, గిరడ అప్పలస్వామి గారు ఆధ్వర్యంలో 5వ సోమవారం బొబ్బిలి జనసేన పార్టీ కార్యాలయం ఆవరణలో 100 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది.లి లిఈ కార్యక్రమం లో బొబ్బిలి జనసేన పార్టీ నాయకులు పైల హరి ప్రసాద్,ఉల్లి సంతోష్,జమ్ము గణేష్, గొల్లపల్లి జాన్, యడ్ల మోహన్,ఎంపీటీసీ గోవిందా, గిరడ గోవిందా, మంత్రి అప్పలనాయుడు, దేవీంద్ర, గిరడ అప్పలనాయుడు, గౌరు వీర మహిళలు సవరల రామ లక్ష్మి, బిగుల లక్ష్మి, తదితరులు కార్యక్రమంని విజయవంతం చేశారు

## ద్విచక్ర వాహనంపై మీ భద్రత గురించే హెల్మెట్ : టౌన్ సీఐ




సాలూరు, మే25, ప్రభాతవార్త :

జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డుభద్రత ఇంకా మాదక ద్రవ్యాల నివారణ అలాగే మహిళల రక్షణ గురించి అవగాహన కల్పించామని టౌన్ సీఐ అప్పలనాయుడు స్థానిక విలేకరులకు తెలిపారు. సోమవారం ఆయన వివరాలు ప్రకారం వాహనదారులు ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే వేగంగా వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నా రు.అంతేకాకుండా మాదకద్రవ్యాల అక్రమరవాణా వినియోగం వంటి చర్యలపై పలు సూచనలు చేసారు.అంతేకాకుండా మహిళల రక్షణకు సంబంధించి దిశా యాప్ ఇంకా షీ టీమ్స్ అలాగే మహిళల భద్రత కోసం అమలులో ఉన్న చట్టాలు,అత్యవసర సహాయ నెంబర్లు 112 ఇంకా 1930 గురించి సీఐ వివరించారు.పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన రైతుల హక్కులను కాలరాస్తున్న అటవీ శాఖ



పాచిపెంట మే 25 ప్రభాత వార్త :

తాత ముత్తాతల నుండి తాము సాగు చేస్తున్న భూముల్లో స్థానిక అటవీ శాఖ అధికారులు కంచెలు వేసి మొక్కలు నాటడం భూములను తమ నుంచి లాక్కోవడమేనని దీనిని చూస్తూ ఊరుకోమని గిరిజన నాయకులు హెచ్చరించారు. తమ భూములను కాపాడుకునేందుకు ప్రాణ త్యాగాలకైనా సిద్ధంగా ఉంటాము తప్ప తమ భూములను వదులుకునే ప్రసక్తి లేదని ,కంచె చేను మేసిన చందంగా తమకు రక్షణగా ఉండాల్సిన ప్రభుత్వమే తమకు పట్టాలిచ్చిన భూములను తిరిగి లాక్కోవడం ఏమిటని గిరిజన నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి బొర్రమామిడి గిరిజన గ్రామంలో సోమవారం భూ పరిరక్షణ కమిటీ సభ్యులుగా సుమారు 10 గ్రామాల గిరిజనులు కమిటీగా ఏర్పడి గ్రామంలో రచ్చబండ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. గిరిజన నాయకులు సోములుబోడియ్య పోయి సన్యాసి, సోమల అప్పారావు ముఖి అమ్మన్న మాట్లాడుతూ ఈ భూములను సాగు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2005 పీసా చట్టం అమలు చేసి ఒక్కో గిరిజనులకు తాము సాగు చేసుకుంటున్న భూముల్లో పదేసి ఎకరాలు చొప్పున అటవీ హక్కు చట్టం కింద పోడు భూముల హక్కుల పట్టాలు 2009లో తమకు ప్రభుత్వం అందజేసిందని ఈ హక్కులను కాలరాస్తూ నేడు రాష్ట్ర ప్రభుత్వం తమ భూములను లాక్కునే ప్రయత్నం చేస్తుందని దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని గిరిజన నాయకులు హెచ్చరించారు. 4 పంచాయతీలలో సుమారు 600 కుటుంబాలు ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని గిరిజన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు . గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర తమను ఆదుకోవాలని కోరారు.తమ భూముల్లో అటవీశాఖ అధికారులు గోతులు తీస్తూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిలిపివేయించాలన్నారు. సిపిఎం జిల్లా నాయకులు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనుల భూములను లాక్కోవడం దుర్మార్గమైన చర్యని గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లో అటవీ శాఖ అధికారులు కంచెలు వేసి మొక్కలు నాటడం ఎంతవరకు సమంజసమని ఆయన అన్నారు. గిరిజనులు అడ్డుకుంటే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని అటవీ శాఖ అధికారులు గిరిజనులను బెదిరిస్తున్నారని వాపోయారు. అటవీశాఖ తీరుపై జిల్లా వ్యాప్తంగా గిరిజనులతో ఆందోళన తప్పదు అన్నారు. కార్యక్రమంలో ఇప్పలవలస బొర్రమామిడి తాళ్లపాడు దొరలుద్దండి, పెదకంచూరు, గరికపాడు , నాలుగు పంచాయితీ గిరిజనులు పాల్గొన్నారు.

## చంపావతి నుంచి నీటి తరలింపు పనులు ఆపాలి



నెల్లిమర్ల, మే 25 (ప్రభాతవార్త ):

నెల్లిమర్ల, జరజాపుపేట నగర పంచాయతీ ప్రజల తాగునీటి సమస్యల పరిష్కరించకుండా చంపావతి నది నుంచి ఇతర ప్రాంతాలకు తాగునీటిని తరలించేందుకు జరుగుతున్న పనులను తక్షణమే నిలుపుదల చేయాలని నెల్లిమర్ల, జరజాపు పేట గ్రామాలకు చెందిన పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయ కులు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సేతు మాధవన్‌ను కోరారు. ఈ మేరకు వారంతా సోమవారం విజయనగరం చేరుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తమ సమస్యను ఇన్చార్జి కలెక్టర్ సేతు మాధవన్‌కు, డిఆర్‌ఓకు వివరించారు. జరజాపు పేట గ్రామ ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించకుండా చంపావతి నదిలోని తాగునీటి వనరును ఇతర ప్రాంతాలకు తరలించడంపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని స్పష్టం చేశారు. జరజాపుపేట ప్రజల కోసం గతంలో మంజూరై ప్రస్తుతం నిలిచిపోయి ఉన్న మెగా రక్షిత నీటి పథకం పనులు తక్షణమే ప్రారంభించాలని అన్నారు. అలాగే చంపావతి నదిలో ఇన్ ఫిల్టర్ రేషన్ బావులను తవ్వి తాగునీటిని బయట ప్రాంతాలకు సరఫరా చేస్తే ఆ నదిపై ఆధారపడి ఉన్న తమ గ్రామ రక్షిత నీటి పథకాలు ఎండిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.తమ గ్రామానికి నీటి సమస్యలు రాకుండా భూగర్భ జలం పెరిగే విధంగా మా తమ గ్రామ సమీపంలో చంపావతిలో చెక్ డ్యాము ను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. తమ గ్రామ తాగునీటి సమస్యను పరిష్కరించకుండా అధికారులు ముందుకు వెళితే ఆందోళన బాట తప్పదని వారు స్పష్టం చేశారు. రాజకీయ పక్షాల నాయకులు సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, చిక్కాల సాంబ శివరావు, లెంక అప్పలనాయుడు, ఎంఎం నాయుడు, కాళ్ల సన్యాసిరావు,కాళ్ల రాజశేఖర్, నల్లి బంగారు చంద్రశేఖర్, మద్దిల వాసు, కిల్లంపల్లి రామారావు, డొంక కృష్ణ, సముద్రపు సత్తిబాబు పాల్గొన్నారు.

## విద్యారంగ మణిపూస రామకృష్ణ మాస్టారు

### ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు ప్రశంసలు



నెల్లిమర్ల, మే 25 ప్రభాతవార్త :

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎంతోమంది శిష్యులను ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన సింగపురపు రామకృష్ణ మాస్టారు విద్యారంగానికి మణి పూస అని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. రామకృష్ణ మాస్టార్‌ని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన శిష్యులందరూ ఆదివారం రాత్రి నెల్లిమర్లలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ రామకృష్ణ మాస్టర్ దంపతులను ఘనంగా సత్కరించారు. శిష్యులు సమర్పించిన బంగారు ఉంగరాన్ని తొడిగి జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ భౌతిక, రసాయన శాస్త్రాల బోధనలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లాస్థాయిలోనే రామకృష్ణ మాస్టారు ప్రత్యేకత సాధించారని అన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన రామకృష్ణ మాస్టారు నిరుపేద విద్యార్థులందరికీ అండగా నిలిచి ఉచిత శిక్షణల ద్వారా అధిక శాతం మంది శిష్యులకు ఉచిత శిక్షణ ద్వారా దశాబ్ద కాలంలో సుమారు 150 మందిని ఉపాధ్యాయులుగా తీర్చిన ఘనత సొంతం చేసుకున్నారని అన్నారు. రామకృష్ణ మాస్టారు పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, అటు విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి, ఇటు విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారని అన్నారు. రామకృష్ణ మాస్టారు ఉన్నత భావాలను మిగిలిన ఉపాధ్యాయులు అనుసరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ బోధనలోనూ, విధేయతలోను, నడవడికలోనూ రామకృష్ణ మాస్టారు ప్రత్యేకత సాధించారని అన్నారు. రామకృష్ణ మాస్టార్‌ని ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న శిష్యులందరూ పల్లకిపై మోసుకు రావడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమని అభివర్ణించారు. మాస్టారి శిష్యులు నరేష్ కుమార్, బాలకృష్ణ వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన కార్యక్రమంలో గరివిడి, మెరకముడుదాం, బొబ్బిలి ఎంఈఓ లు పోలుబోతు రామారావు, మాత చంద్రశేఖర్, చిప్పాడ రమేష్ కుమార్, పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద హనుమంతరావు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మద్దిల శ్రీనివాసరావు, విజయకుమార్, శ్రీదేవి, గౌరీదేవి , 200 మంది ఉపాధ్యాయులు, అభిమానులు ఆత్మీయులు పాల్గొన్నారు.

**పల్లకిపై మోసి....**

తమకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, డైట్ సెట్ లోను, డి ఎస్ సి పరీక్ష లోను ఉత్తమ మార్కులు సాధించడం ద్వారా ఉద్యోగాలు సాధించడానికి, తమ ఉన్నత స్థితికి కారణమైన రామకృష్ణ మాస్టారు సేవలకు గుర్తింపుగా, గురుదక్షిణగా ఉపాధ్యాయ స్థానాల్లో ఉన్న శిష్యులందరూ సత్కార కార్యక్రమానికి ముందు పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై మాస్టారు ని ఉంచి నెల్లిమర్ల మెయిన్ రోడ్డులో నేరుగా మోసుకుంటూ వేదిక వరకు ఊరేగింపు నిర్వహించి ఆయనకు గౌరవ సత్కారం చేయడం నెల్లిమర్లలో సంచలనంగా, చారిత్రక ఘట్టంగా నిలిచిందని చెప్పక తప్పదు.

## కొమరాడ మండల ఎంఈవో -2 గా గౌరీ శంకర్



**కొమరాడ , మే 25, ప్రభాతవార్త :** కొమరాడ మండల విద్యాశాఖ అధికారి 2 విక్రంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మజ్జి గౌరీ శంకరును నియమిస్తూ విద్యాశాఖ ఆర్జెడి ఉత్తర్వులు జారీ చేశారు ఈ మేరకు సోమవారం గౌరీ శంకర్ ఎంఈఓ2గా బాధ్యతలను స్వీకరించారు అందరి సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా అన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీ నాయనా



రామభద్రపురం, మే 25, ప్రభాత వార్త :

రామభద్రపురం మండలం ముచ్చర్ల వలస గ్రామంలో మజ్జి నితీష్ సువ్వాడ జగదీష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ను సోమవారం ఎమ్మెల్యే బేబీ అనే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులంతా జాతీయస్థాయి క్రీడలకు ఎదగాలని ఆయన కోరారు ప్రభుత్వం కూడా క్రీడలకు పెద్దిపేట వేస్తుందని ఆయన అన్నారు విద్యార్థులంతా చదువులతో పాటు మంచి క్రీడాకారులకు ఎదగాలని ఆయన కోరారు. ఈ టోర్నమెంట్లో విజయనగరం మన్యం జిల్లాల నుంచి సుమారు 50 జట్లు వరకు క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు మడక తిరుపతిరావు ముత్యాల మాజీ పంచాయతీ ప్రెసిడెంట్ కని మెరక శంకర్రావు తేదాపా క్లస్టర్ కోఆర్డినేటర్ గంటా సాయి మండల తెదేపా నాయకులు ముళ్ళు రాంబాబు సువ్వాడ బలరాం, తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్‌లో చలివేంద్రం ప్రారంభం

**చీపురుపల్లి, మే 25, ప్రభాత వార్త :** చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో డిడిఓ కే హేమ సుందర్ సారథ్యంలో ఎంపీడీవో ఐ. సురేష్ తమ సిబ్బందితోపాటు ప్రజల దాహార్తిని తీర్చడానికి సోమవారం నాడు చలివేంద్రం ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం తో పాటు ప్రాంగణంలో గల పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు పనుల మీద వచ్చే ప్రజలు సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు డిడిఓ కేహమ్ సుందర్ వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ప్రవీణ్ కుమార్ డిప్యూటీ ఎంపీడీవో అప్పలనాయుడు, టైపిస్ట్ సురేష్, పంచాయతీ ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ నాసిక రామ్మోహన్, మండల పరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరం 25 పార్వతీపురం మన్యం వార్త

## కోమటిపల్లిలో దొంగలు హల్ చల్

### ఐదు ఇళ్లు, శివాలయంలో ఏడు తులాల బంగారం, 1/2 కేజీ వెండి, రెండు లక్షల నగదు, బైకు చోరీ



దత్తిరాజేరు, మే 25, ప్రభాతవార్త :

మండలంలోని కోమటిపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో దొంగలు బీభత్సం చేశారు 7 తులాల బంగారం రెండు లక్షల రూపాయల నగదు 1/2 కేజీ వెండి ఒక బైకు దొంగలించినట్లు బాధితులు ఉల్లి శ్రీను ఇమ్మడిశెట్టిలక్ష్మణరావు వత్సవాయి నాగమణి బంగారమ్మ తెలిపారు జరిగిన వెంటనే పెదమానాపురం పోలీసులకు బాధితులు గ్రామస్తులు సమాచారం తెలియజేయడంతో వెంటనే రంగంలోకి దిగిన ఇంచార్జ్ ఎస్ఐ కిరణ్ కుమార్ సిబ్బందితో గ్రామానికి చేరుకొని శివాలయం నాలుగు ఇల్లులను తనిఖీ చేశారు వెంటనే క్లూస్ టీం సీఐ మురళీమోహన్ ఎస్ఐ శారదా దేవికి సమాచారం తెలియజేయడంతో వెంటనే సిబ్బందితో వచ్చి గ్రామానికి చేరుకొని చోరీ జరిగిన ప్రదేశాలనుతనిఖీలు చేపట్టారు బాధితులు ఫిర్యాదు మేరకు నిందితులను త్వరలో పట్టుకుంటామని బాధితులకు తెలిపారు. ఉల్లి శ్రీను తాలూకా ఇంట్లో 6 తులాల బంగారం రెండు లక్షలు నగదు 1/2 కేజీ వెండి చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేశారు శివాలయంలో పార్వతి దేవి తాలూకా తులం పుస్తెలతాడు దేవుడు హుండీలో సుమారు 15 వేల రూపాయలు నగదు దొంగతనం చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. వత్సవాయి నాగమణి ఇంట్లో కిటికీ గ్రిల్స్ తీసి ఇంట్లో చొరబడ్డారని దాచుకున్న 10వేలు నగదు 5వేలు విలువచేసే చేతి గడియారం దొంగలించారని ఇమిడి సెట్టిశెట్టి లక్ష్మణరావు తాలూకా ఒక బైకు రాజులమ్మ ఇంటిలోకీ చొరబడి సరికి ఇంట్లో ఉన్న కుక్క కేకలుకు మేడ మీద పడుకున్నా ముగ్గురికి మెలుకువ రావడంతో వెంటనే దాబా దూకి వెళ్లిపోయారని బాధితులు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇల్లలను సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు గ్రామానికి చేరుకొనిచోరీ ఎలా జరిగిందని బాధితులను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై మరియు సిబ్బంది కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తామని బాధితులకు తెలిపారు. కార్యక్రమంలో క్లూస్ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గాలికి కొట్టుకుపోయిన 'రైతు' ఆశలు

### 'నిమ్మకు నీరెత్తిన' పాలకులు..



చీపరుపల్లి, మే 25, ప్రభాత వార్త :

చీపురుపల్లి మండలంలోని ఇటీవల వీచిన భారీ గాలులకు అహర్నిశలు కష్టపడి పండించుకున్న పంట గాలికి కొట్టుకుపోయి రైతుల ఆశలను దెబ్బతీశాయి.ఈ ఫోటోలో కనిపిస్తున్న రైతు పేరు బైరెడ్డి పున్నయ్య...విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కలిశెట్టిబడి గ్రామం. పున్నయ్య అరటిచెట్ల మధ్య కూర్చోలేదు... నేలపాలైన తన ఏడాది కష్టం మధ్య కూర్చున్నాడు.ఈ నెల 22న వచ్చిన హుదూద్ తలపించిన భీకర గాలులు, అరటి చెట్లను మాత్రమే కాదు... ఒక రైతు ఆశలను, అతని భవిష్యత్తును, అతని ధైర్యాన్ని కూడా నేలకూల్చేశాయి. సుమారు 3 లక్షల రూపాయలు పంట నష్టం వాటిలినట్టు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..పంట పోయిన 48 గంటలు దాటిపోయాయినా ఏ ఒక్క అధికారి గానీ ప్రజా ప్రతినిధి గాని, "ఏం అయ్యింది అన్నా...?" అని అడిగిన నాదులు లేకపోగా. "భయప డొద్దు... ప్రభుత్వం ఉంది" అని చెప్పిన నాయకుడు లేకపోవడం పట్ల రైతులు విమర్శల వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలప్పుడు మాత్రం... ఒక్క ఓటు కోసం ఇంటి గుమ్మం దగ్గర చెప్పులు తీసి నిలబడే వాళ్లు... ఇప్పుడు రైతు కష్టాన్ని చూడటానికి గ్రామం దారి కూడా గుర్తు పట్టలేకపోతున్నారు అంటూ రైతులు విమర్శల వర్షం కురిపిస్తున్నారు.ప్రభుత్వాలకు రైతు అంటే... పోస్టర్లలో కనిపించే "అన్నదాత" మాత్రమేనా...? లేక, పంట పోయాక పట్టించుకోనక్కర్లేని ఓటు యంత్రమా అని ప్రశ్నిస్తున్నారు.ప్రకృతి విరుచుకుపడితే ఆపలేము... కానీ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని మాత్రం ఖచ్చితంగా ఆపొచ్చు రైతులు సూచిస్తున్నారు. పంట నష్టంతో వచ్చిన బాధకంటే...బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రభుత్వ తీరే...తమని ఎంతో బాధకు గురిచేస్తోందంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ నిస్సహాయ కళ్ళల్లో కనిపిస్తున్నది కేవలం నష్టం మాత్రమే కాదు... నమ్ముకున్న వ్యవస్థ తమను ఒంటరిని చేసిందనే నరకప్రాయమైన ఆందోళన రైతులు వ్యక్తపరుస్తున్నారు. నేలకొరిగిన అరటి గెల తన కష్టానికి గుర్తు కాదు... ప్రభుత్వ నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం అంటూ రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా నిద్రపోతున్న అధికార యంత్రాంగం కళ్ళు తెరిచి, తక్షణమే ఈ గ్రామాన్ని సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులను ఆదుకొని నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలసిన జనగణన రాష్ట్ర పరిశీలకులు



విజయనగరం, మే 25, ప్రభాతవార్త :

జనగణన రాష్ట్ర పరిశీలకులు వి.వి.ఎల్.ఎన్. శర్మ జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డిని సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమం, క్షేత్రస్థాయి నిర్వహణ తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. డీఆర్వో సత్తిబాబు పాల్గొన్నారు.

## జనగణనను నాణ్యవంతంగా సకాలంలో పూర్తి చేయాలి

### - రాష్ట్ర పరిశీలకులు వివిఎల్ఎన్ శర్మ



విజయనగరం, మే 25, ప్రభాతవార్త:

జనగణన రాష్ట్ర పరిశీలకులు వి.వి.ఎల్.ఎన్. శర్మ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి జనగణన నిర్వహణ తీరును పరిశీలించారు. నగరంలోని కణపాక ప్రాంతంలో పలు ఇళ్లను సందర్శించి, ప్రజలతో మాట్లాడి జనగణన సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. సిబ్బంది ఏ విధంగా వివరాలను సేకరిస్తున్నారు, ప్రజలతో ఎలా వ్యవహరిస్తున్నారు అనే అంశాలపై స్థానికులను అడిగి సమాచారం సేకరించారు. జనగణన నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలు, క్షేత్ర స్థాయిలో అమలు విధానం తదితర అంశాలను తెలుసుకున్నారు.ముందుగా బొండపల్లి మండలంలోని సచివాలయ పరిసర ప్రాంతాల్లో ఇళ్లను సందర్శించి ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు మాట్లాడుతూ, జనగణనను నాణ్యవంతంగా మరియు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా డోర్ లాక్డ్, ఖాళీ ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కుటుంబ వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సెన్సస్ జాయింట్ డైరెక్టర్ సాయి శేఖర్, డీఆర్వో సత్తిబాబు, బొండపల్లి తహసీల్దార్ డి. రాజేశ్వరరావు, ఎంపీడీవో, అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, నగర జనగణన ఛార్జ్ అధికారి ఆర్.వి. రమణమూర్తి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటికో పారిశ్రామికవేత్త రావాలి : కలెక్టర్



విజయనగరం, మే 25, ప్రభాతవార్త:

ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా కృషి చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అన్నారు. విజయనగరం మండలం కొండకరకాం గ్రామంలో సుమారు 12 ఎకరాల్లో రూ.10.44 కోట్లతో, రాజాం మండలం గార చీపురుపల్లిలో సుమారు 31.68 ఎకరాల్లో రూ.14 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం విజయవాడ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. కొండకరకాం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఐసి జనరల్ మేనేజర్ కరుణాకర్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ కృష్ణప్రసాద్, డిజెడ్ఎం జయచంద్ర, ఆర్‌డిఓ సుధాసాగర్, ఎంపిడిఓ గంటా వెంకటరావు, తాహసీల్దార్ కూర్మనాధరావు, జిల్లా బిజెపి అధ్యక్షులు రాజేష్‌వర్మ తదితర కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు

# నాలుగు జట్లలో ఛాంపియన్ ఎవరో?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ నాకౌట్ స్టేజ్‌కు చేరుకుంది. ప్లే ఆఫ్‌లో తలపడే నాలుగు జట్లు ఖరారయ్యాయి. ఒక్క క్వాలిఫయర్ మ్యాచ్‌లో తప్పిస్తే ఇక్కడ గెలిస్తేనే ముందుకు, ఓడితే ఇంటిముఖం. పుంజుకోవడానికి లీగ్ స్టేజ్‌లో మరో ఆప్షన్ ఉండదు. గత ఐపీఎల్‌లో ప్లే ఆఫ్ ఆడిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్, గుజరాత్ టైటాన్స్ ఈసారి కూడా చేరుకున్నాయి. వీటితో పాటు కొత్తగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్లే ఆఫ్‌కు వచ్చాయి. ముంబై, పంజాబ్ ఈసారి లీగ్ స్టేజ్‌లోనే నిష్క్రమించాయి. ఈసారి ఐపీఎల్ ఛాంపియన్ ఎవరనేది ఆసక్తి రేపుతోంది.




డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ ఈసీజన్‌లోనూ జోరు చూపింది. ఆరంభం నుంచి దుమ్మురేపింది. మధ్యమధ్యలో వచ్చిన ప్లేయర్ల సెంచరీల మోతతో మొత్తం 14 మ్యాచుల్లో తొమ్మిది విజయాలు సాధించిన ఆర్సీబీ (+0.783) మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో అగ్రస్థానం పొందింది. నేడు తొలి క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ తలపడనుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఇక్కడి వరకూ వచ్చింది. బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీ(563 రన్స్), దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్, టిమ్ డేవిడ్, వెంకటేశ్ అయ్యర్ కీలకం. స్వింగ్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్(24వికెట్లు), జోష్ హేజిల్‌వుడ్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యతో బౌలింగ్ వైవిధ్యంగా ఉంది.

గుజరాత్ టైటాన్స్ సైలెంట్ కిల్లర్‌గా ప్లే ఆఫ్ స్టేజ్‌కు వచ్చింది. ఈ సీజన్ తొలి దశలో తడబడినా.. రెండో దశలో అనూహ్యంగా వరుసగా అయిదు విజయాలతో నాకౌట్‌కు దూసుకొచ్చింది. తొలి ఏడు మ్యాచుల్లో మూడే విజయాలు కాగా.. మిగతా ఏడులో ఏకంగా ఆరింట్లో గెలుపొందింది. 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు సాధించి రెండో స్థానానికి చేరుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గుజరాత్ ప్రధాన బలం, జట్టును ముందుండి నడిపించాడు. శేభ్‌మన్ గిల్‌తో పాటు సాయి సుదర్శన్ అత్యంత కీలక ప్లేయర్. జోస్ బట్లర్, వాషింగ్టన్ సుందర్ కూడా చక్కగా మెరుపులు మెరిపించారు. గుజరాత్ పేస్ త్రయం మహ్మద్ సిరాజ్, కగిసో రబాడ, ప్రసిద్ధ్ కృష్ణ వికెట్ల వేటలో ఉన్నారు. స్టార్ ఆల్‌రౌండర్లు జేసన్ హోల్డర్, రషీద్ ఖాన్ జీటీకి అదనపు బలం. కగిసో రబాడ (24) ప్రస్తుతం అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా కొనసాగుతున్నాడు.







సన్‌రైజింగ్ హైదరాబాద్ కూడా అనూహ్యంగా నాకౌట్‌కు చేరుకుంది. తొలుత ఇషాన్ కిషన్.. తర్వాత ప్యాట్ కమిన్స్ కెప్టెన్సీలో సన్‌రైజర్స్ అద్భుత విజయాలు అందుకుంది. పాంచ్ పటాకాతో సన్‌రైజర్స్... ఆర్సీబీ, గుజరాత్‌తో 18 పాయింట్లతో సమవుజ్జీగా నిలిచినా, నెట్‌రన్‌లో వెనకబడి మూడోస్థానంకు పరిమితమైంది. డేంజరస్ ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ చక్కని శుభారంభాలు అందించారు. ఆ తర్వాత వచ్చే ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ రెడ్డి సూపర్ ఫామ్‌తో పరుగులు సాధిస్తూ జట్టు విజయాలో కీరోల్ పోషించారు. ఎక్స్‌పీరియన్స్ కమిన్స్‌కు తోడుగా యువ బౌలింగ్ దళం నిలుస్తోంది. తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని చెలరేగారు. ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్, శివాంగ్ కుమార్, ఇషాన్ మలింగతో కూడిన బౌలింగ్ యూనిట్‌ను పేస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ నడిపిస్తున్నాడు.

ప్లే ఆఫ్స్ చివరి బెర్తు దక్కించుకున్న రాజస్థాన్ ప్రయాణం ఈ ఐపీఎల్‌లో పడుతూ లేస్తూ సాగింది. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు మీద కనిపించిన ఈ జట్టు ఒక్కసారిగా గాడి తప్పింది. తర్వాత జరిగిన మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించి ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో లక్నో, ముంబైలను ఓడించి ప్లే ఆఫ్ బెర్త్ దక్కించుకుంది.14 మ్యాచ్‌ల్లో 8 విజయాలు అందు కుంది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్‌కు కీలకం. చాలా మ్యాచ్‌ల్లో మెరుపు ఆరంభాలు ఇచ్చారు. వైభవ్ 583 పరుగులతో ఆరెంజ్ క్యాప్ రేసులో ఉన్నాడు. ధృవ్ జురెల్, కెప్టెన్ పరాగ్ అప్పుడప్పుడు భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతున్నారు. రాజస్థాన్ బౌలింగ్‌కు జోఫ్రా ఆర్చర్ వెన్నెముకలా నిలుస్తున్నాడు. 21 వికెట్లతో పర్పుల్ క్యాప్ రేసులో ఉన్నాడు.






## పద్మశ్రీ అవార్డు అందుకున్న హార్మన్‌ప్రీత్ కౌర్

**న్యూఢిల్లీ:** భారత మహిళా క్రికెట్ జట్టుకు తొలి ప్రపంచకప్ అందించిన కెప్టెన్ హార్మన్ ప్రీత్ కౌర్ ప్రతిష్టాత్మక పౌర పురస్కారం పద్మశ్రీ అందుకుంది. రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హార్మన్‌ప్రీత్ పద్మ శ్రీ అందుకున్నారు. హార్మన్ ప్రీత్ కౌర్‌తో పాటు విజయ్ అమృత్‌రాజ్(టెన్నిస్), బల్దేవ్ సింగ్ (హాకీ కోచ్), భగవాన్‌దాస్ రైక్వర్(రెజ్లింగ్), సవితా పూనియా(రెజ్లింగ్), పజనివెల్ (తమిళ మార్షల్ ఆర్ట్స్ సిలంబం), ప్రవీణ్ కుమార్(పారా హై జంపర్)లు కూడా పద్మశ్రీ అవార్డులు స్వీకరించారు. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును కేంద్రం ప్రకటించింది.

గత ఏడాది సొంతగడ్డపై భారత జట్టుకు వన్డే ప్రపంచకప్ అందించి హార్మన్‌ప్రీత్ చరిత్ర సృష్టించింది. 48 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ టీమిండియాను విశ్వవిజేతగా నిలిపింది. దిగ్గజ కెప్టెన్లు డయానా ఎడుల్జి, శాంత రామస్వామి, అంజుమ్ చోప్రా, మిథాలీ రాజ్ వంటి వాళ్లకు సాధ్యమవ్వని ఘనతను సొంతం చేసుకున్న కౌర్‌ను భారత ప్రభుత్వం పద్మ శ్రీతో సత్కరించింది.




## వరుసగా నాలుగో ఫార్ములా వన్ ట్రోఫీ

**మాంట్రియల్:** ఫార్ములా వన్‌లో యువ సంచలనం 19 ఏళ్ల ఇటలీ రేసర్ కిమి అంటోనెల్లి దూసుకుపోతున్నాడు. తాజాగా కెనడా గ్రాండ్ ప్రిని ఖాతాలో వేసుకున్నాడు. ఇది అంటోనెల్లికి వరుసగా నాలుగో ఫార్ములా వన్ ట్రోఫీ. మెర్సిడెస్ డ్రైవర్ కిమి అంటోనెల్లి అగ్రస్థానంతో ముగించాడు. పోల్ పొజిషన్‌తో దూసుకుపోయిన అంటోనెల్లికి మెర్సిడేస్ సహచరుడు జార్జ్ రస్సెల్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్నారు. ఇద్దరూ పోటీపోటీగా దూసుకుపోయారు. పలుమార్లు ఆధిక్యం మారుతూ వచ్చింది. ఒకరినొకరు ఢీ కొట్టేంత ప్రమాదకర స్థాయికి కూడా ఓ దశలో చేరుకున్నారు. 30వ ల్యాప్‌లో రస్సెల్ వెహికిల్ ఇంజిన్ వైఫల్యంతో రేసు నుండ వైదొలిగాడు. ఆ తర్వాత ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్ లూయిస్ హామిల్టన్, కిమి అంటోనెల్లి మధ్య పోరుగా మారింది. లూయిస్ హామిల్టన్ కంటే పది సెకన్ల ముందు రేస్ పూర్తి చేశాడు. కిమి అంటోనెల్లి ఫార్ములా ఛాంపియన్‌షిప్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించాడు. కాగా హామిల్టన్ రెండో స్థానంతో సరిపెట్టాడు. గత సంవత్సరం ఫెరారీలో చేరిన తర్వాత ఇది అతనికి అత్యుత్తమ ఫలితం. 22 ఫార్ములావన్ రేసులలో ఇప్పటివరకు ఐదు జరిగాయి. రస్సెల్‌పై అంటోనెల్లి 43 పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించాడు. ఆస్ట్రేలియాలో జరిగిన సీజన్ ప్రారంభ రేసులో రస్సెల్ గెలిచిన తర్వాత, ఆంటోనెల్లి చైనా, జపాన్, మయామి, ఇప్పుడు మాంట్రియల్‌లో కూడా గెలిచాడు.

## ఫ్రెంచ్ ఓపెన్‌లో నిశేష్ సంచలనం

**రోలాండ్‌గారోస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో భారతీయ మూలాలున్న నిశేష్ బసవరెడ్డి సంచలనం సృష్టించాడు. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలోకి దిగిన 21 ఏళ్ల నిశేష్(అమెరికా) ఏడో సీడ్ ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్‌పై 7-6, 7-6, 6-7, 6-1 తేడాతో విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. దీంతో నిశేష్ ఒక్కసారిగా వార్తల్లో నిలిచాడు.

నిశేష్ 2005 మే5న కాలిఫోర్నియాలో జన్మించాడు. సాయి ప్రసన్న, మురళీకృష్ణ అతడి తల్లి దండ్రులు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు స్వస్థలం. 1999లో అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. మాజీ డబుల్స్ ప్లేయర్ రాజీవ్ రామ్ వద్ద శిక్షణ పొందాడు. 2023లో ఐటీఎఫ్ జూనియర్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్3 స్థానానికి చేరుకున్నాడు. అలాగే ఏటీపీ ఛాలెంజర్ టూర్ 2024 సీజన్‌లోనూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చాడు. రెండు ఏటీపీ ఛాలెంజర్ టైటిళ్లు గెలిచి తన ముద్ర వేశాడు. 2025లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ద్వారా గ్రాండ్ స్లామ్ అరంగేట్రం చేసిన నిషేశ్.. తొలి మ్యాచ్‌లోనే దిగ్గజ ఆటగాడు జకోవిచ్‌పై తొలి సెట్ గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇప్పుడు ఫ్రెంచ్ ఓపెన్‌లో టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించడం ద్వారా మరోసారి సత్తా చాటాడు.



## సెన్సెక్స్, నిఫ్టీలకు బడా కంపెనీల సపోర్ట్

# వారంలో లాభాల బోణీ




**ముంబై, మే 25:** ఈక్విటీ సూచీలు సోమవారం భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు తొలగిపోతాయనే అంచనాల మధ్య సూచీలు లాభాల్లో కదలాడాయి. దాంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1100 పాయింట్ల వరకు పెరిగింది. సెన్సెక్స్ నేటి ట్రేడింగ్‌లో 76,135 వద్ద మొదలైంది. చివరకు 1,073 పాయింట్ల లాభంతో 76,488 వద్ద ముగిసింది. నిఫ్టీ 312 పాయింట్లు ఎగబాకి, 24 వేల పైన స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్, టీఎంపీవీ, లార్సెన్ షేర్లు రాణించాయి. మ్యాక్స్ హెల్త్ కేర్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, నెస్లే, బజాజ్ ఆటో స్టాక్స్ నష్టపోయాయి.

యుద్ధం ముగించే విషయమై అమెరికా - ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 5.58 శాతం తగ్గి, 97.76 డాలర్లకు వచ్చింది. చమురు ధరలు తగ్గడంతో బ్యాంక్ షేర్లు పెరిగాయి. ఆయిల్ ధరల తగ్గుదల కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని, వడ్డీ రేట్లలో స్థిరత్వం వస్తుందని మదుపర్లు భావిస్తున్నారు. అంతర్జాతీయమార్కెట్లలోని సానుకూల సంకేతాలు కూడా నేటి లాభాలకు ఓ కారణంగా చెప్పవచ్చు. అమెరికా భారత్ మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారవుతుందని ఆశిస్తున్నామని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించడం కూడా మార్కెట్లకు జోష్ ఇచ్చింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా 35 పైసల మేర కోలుకుంది. ప్రస్తుతం రూపీ విలువ 95.25 వద్ద స్థిరపడింది. బిఎస్‌ఇలోమిడ క్యాప్ 0.80శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ 1.22శాతం పెరిగింది. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 2703 కంపెనీల షేర్లుపెరిగితే 1607 కంపెనీల షేర్లు క్షీణించాయి. 237 షేర్లుమాత్రం స్థిరంగానే కదలాడాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 0.42శాతం పెరిగి రూ.1,59,350కి చేరింది కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ నెల సెటిల్‌మెంట్ ధరలు 5.76డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 97.78 డాలర్లుగా కొనసాగాయి.

## ఐదు వేల డాలర్లకు ఔన్స్ బంగారం!

**ముంబయి, మే 25:** పశ్చిమాసియా యుద్ధ మేఘాలు, కొలిక్కిరాని శాంతిఒప్పందం, డాలరుతో రూపాయి పెరుగుదలవంటి వాటితో రానున్న కాలంలో అంతర్జాతీయ మార్కెట్ బంగారం ధరలు ఔన్స్ ఒక్కింటికి 4400 డాలర్ల నుంచి 4600 డాలర్ల వరకూ పెరగవచ్చని ఐసిఐసిఐ బ్యాంకు అంచనావేసింది. పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటినుంచి బంగారంధరల్లో 15శాతం మార్పులు చోటుచేసున్నాయి. అమెరికా ముడి చమురు ఎగుమతిదారుగా నిలిచి తమ చమురునే కొనాలని లేదంటే సుంకాలు తప్పవన్న హెచ్చరికలుచేస్తూ ఎగుమతులు పెంచుకుంటోంది. దీని వల్ల డాలర్ చెల్లింపులు కూడా పెరుగుతున్నాయి. అందువల్లనే ఇన్వెస్టర్లు స్వర్గధామంగా భావిస్తున్న బంగారంపై పెట్టుబడులకు ప్రాధాన్యత నిస్తున్నారు. ఈ ఏడాది చివరికల్లా ఔన్స్ బంగారం విలువలు ఐదువేల డాలర్లకు చేరే అవకాశాలున్నాయని ఐసిఐసిఐబ్యాంకు రీసెర్చి విభాగం అంచనావేసింది. ధరలు 4800 డాలర్ల నుంచి 5వేల డాలర్లకు డిసెంబరు చివరికి పెరుగుతాయని, 2027 చివరినాటికి ఔన్స్ ఒక్కింటికి 5400 నుంచి 5600 డాలర్లకు పెరిగినా ఆశ్చర్యంలేదని అన్నారు. అయితే సెంట్రల్ బ్యాంకుల



పాలసీ విధానంలో కఠిన వైఖరి అవలంబించడం, అమెరికా ఫెడ్‌రిజర్వుధోరణులకు తోడు డాలర్ పెరుగుదలను ముందుగానే అంచనావేసి క్షీణతను కట్టడిచేసేందుకు భారత్ సర్కారు ప్రత్నించవచ్చని నిపుణులు చెపుతున్నారు. బ్యాంకు అంచనాలప్రకారం బంగారంధరలు పది గ్రాములు రూ.1.5 లక్షల నుంచి రూ.1.8 లక్షల వరకూ ఉంటుందని అలాగే ఆ తర్వాత క్రమేపీ రూ.1.6 లక్షలనుంచి రూ.1.9 లక్షలరకు చేరినా ఆశ్చర్యంలేదని అన్నారు. కేవలం డాలర్ పటిష్టం కావడం, రూపాయి విలువలు తగ్గడంవల్లనే ఈ ధరల్లో తేడాపెరుగుతున్నట్లు బ్యాంకు విశ్లేషకులు ఒచనావేసారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో భారత్ పసిడి దిగుమతులు 81శాతంగా ఉంటాయని ఐసిఐసిఐబ్యాంకు అంచనావేసింది.

## నిర్వహణ వ్యయం పెరగడంతో సొంత టూల్స్‌వైపు మైక్రోసాఫ్ట్

**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 25:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవం ఒకవైపు కొత్త అవకాశాలు సృష్టిస్తుంటే, మరోవైపు నిర్వహణ ఖర్చులు టెక్ దిగ్గజాలకు పెనుభారంగా మారుతున్నాయి. చెందిన టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ మార్పులుచేసింది. ఏఐ వాడకం వల్ల కంప్యూటింగ్ ఖర్చులు విపరీతంగా పెరిగిపోతుండటంతో తమ ఉద్యోగులకు ఆంత్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ కోడ్ ఏఐ టూల్ యాక్సెస్‌ను క్రమంగా తగ్గిస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా తమ సొంత ప్లాట్‌ఫామ్ అయిన గిట్‌హబ్ కోపైలట్ సీఎల్ఐని వినియోగించేలా ఇంజినీర్లను ప్రోత్సహిస్తోంది.

కొంతకాలం క్రితం ఏఐ ఆధారిత కోడింగ్ టూల్స్‌పై ప్రయోగాలను ప్రోత్సహించేందుకు మైక్రోసాఫ్ట్ వేలాది మంది డెవలపర్లు, ప్రాజెక్ట్ మేనేజర్లు, డిజైనర్లకు క్లాడ్ కోడ్ యాక్సెస్‌ను విస్తృతంగా కల్పించింది. ఉద్యోగుల నుంచి దీని వాడకం అనూహ్యంగా పెరగడంతో సంస్థ కార్యాచరణ వ్యయాలు భారీగా పెరిగాయి. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ టోకెన్ ఆధారిత ధరల విధానాన్ని అనుసరిస్తాయి. ఏఐ సిస్టమ్ ప్రాసెస్ చేసే, జెనరేట్ చేసే టెక్స్ట్ పరిమాణం ఆధారంగా కంపెనీలు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే ఖర్చుల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారింది. ఈ సమస్య కేవలం మైక్రోసాఫ్ట్‌కే పరిమితం కాలేదు. పలు టెక్ కంపెనీలు ఇదే తరహా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు ప్రముఖ రైడ్ షేరింగ్ సంస్థ ఉబెర్ ఏఐ కోడింగ్ టూల్స్ కోసం కేటాయించిన 2026 బడ్జెట్‌ను ఈ ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే పూర్తిగా




వినియోగించినట్లు ఆ సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నెప్పల్లి నాగ వెల్లడించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భవిష్యత్తులో ఏజెంటిక్ ఏఐ సిస్టమ్స్ వాడకం పెరిగితే టోకెన్ల వినియోగం మరింత భారీగా పెరుగుతుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఏఐ మోడల్స్ నిర్వహణ ఖర్చు కాలక్రమేణా తగ్గినా, కొత్తతరం ఏజెంటిక్ సిస్టమ్స్ ప్రతి పనికి ఎక్కువ టోకెన్లు వినియోగించడం వల్ల సంస్థల మొత్తం ఏఐ వ్యయం పెరుగుతుందని రీసెర్చ్ సంస్థ గార్ట్‌నర్ పేర్కొంది.

క్లాడ్ కోడ్ యాక్సెస్‌ను తగ్గించినప్పటికీ, ఆంత్రోపిక్‌తో మైక్రోసాఫ్ట్ కుదుర్చుకున్న మల్టీబిలియన్ డాలర్ల ఫౌండ్రీ ఒప్పందం వంటి ప్రధాన భాగస్వామ్యాలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొంది. అజూర్ క్లౌడ్ సేవల ద్వారా ఆంత్రోపిక్ మోడల్స్‌కు యాక్సెస్ కూడా అందుబాటులో ఉంటుంది.

ఏఐ వైపు వేగంగా అడుగులు వేసేందుకు మెటా, ఒరాకిల్, క్లౌడ్‌ఫ్లేర్ వంటి సంస్థలు ఇటీవల పునర్వ్యవస్థీకరణ చర్యలు, ఉద్యోగ కోతలను ప్రకటించడం గమనార్హం.




## క్షీణించిన సుజ్లాన్ ఎనర్జీ నికరలాభం

# రాబడుల్లో 45 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, మే 25: సుజ్లాన్ ఎనర్జీ నికర లాభం నాలుగో త్రైమాసికంలో 5.8 శాతం క్షీణించింది. కంపెనీ రూ.1182 కోట్ల నుంచి క్షీణించి రూ.1114 కోట్లు మాత్రమే లాభాలు ఆర్జించినట్లు ఎక్స్ఛేంజిలకు నివేదిక ఇచ్చింది. రాబడులపరంగా అయితే పెరిగింది. 45శాతం పెరిగి రూ.3790 కోట్ల నుంచి రూ.5494 కోట్లకు పెరిగినట్లు తేలింది. కంపెనీ ఎబిడిటా కూడా 39శాతం పెరిగి రూ.694 కోట్లనుంచి రూ.965కోట్లకు పెరిగింది. ఎబిడిటా మార్జిన్ కూడా 18.3శాతం నుంచి 17.6 శాతానికి తగ్గింది. సుజ్లాన్ ఎనర్జీ స్టాక్ 1.21శాతం క్షీణించి రూ.53.10కి చేరాయి.

ఎన్ఎస్ఇలో నిఫ్టీ సూచీలో ట్రేడింగ్ ముగింపునకు ముందు 1.4శాతం ముందుకు కదిలినట్లు తేలింది. మొత్తం 12మంది మార్కెట్ విశ్లేషకుల్లో 11 మంది కంపెనీ షేర్లు కొనుగోలు చేసుకోవచ్చని సిఫారసులు చేసారు. అయితే కంపెనీ స్టాక్ మాత్రం గడచిన 12 నెలల్లో 14శాతం పతనం అయింది. కంపెనీకి పన్ను బెనిఫిట్ కింద వచ్చే ప్రయోజనం కూడా గత ఏడాది కంటే తగ్గింది.

గత ఏడాది ఇదేకాలంలో రూ.600.75 కోట్లు వచ్చిన కంపెనీకి ఈ త్రైమాసికంలో 284.32 కోట్లుమాత్రమే వచ్చాయి. కంపెనీ వైస్‌ఛైర్మన్ గిరీష్ తంతి మాట్లాడుతూ కంపెనీ ఇప్పటికే 9 గిగావాట్ల ఆర్డరు చేజిక్కించుకుందని తెలిపారు. ఈఏడాదిలో ఇప్పటివరకూ 2.5గిగావాట్లను పంపిణీచేసినట్లు కంపెనీ సిఇఒ అజయ్ కపూర్ తెలిపారు. ఇప్పటికే ఆర్డర్ బుక్ 5.9 గిగావాట్లవరకూ ఉందని, ఇందులో 66 శాతం ప్రభుత్వరంగం, వాణిజ్య, పారిశ్రామిక రంగాల నుంచి వస్తోందని వివరించారు. కంపెనీకి మార్చి 31వతేదీనాటికి నగదు నిల్వలూ ఆరోగ్యకరంగా ఉన్నాయని రూ.2384 కోట్లు నిల్వలున్నట్లు సీఎఫ్‌వో రాహుల్‌జైన్ తెలిపారు.

## పసిడి, వెండి ఈటిఎఫ్‌లకు డిమాండ్

**ముంబయి, మే 25:** ముడిచమురుధరలు తగ్గుతుండటం బులియన్ మార్కెట్‌లో సెంటిమెంట్‌ను పెంచింది. పసిడి, వెండి ఈటిఎఫ్‌లు సోమవారం ట్రేడింగ్‌లో గరిష్టాన్ని తాకాయి. ఎంసిక్స్‌లో కూడా ధరలు పెరిగినట్లు తేలింది. గోల్డ్ ఈటిఎఫ్‌లలో నిప్పన్ ఇండియా ఈటిఎఫ్‌గోల్డ్ బిఇఇఎస్ (గోల్డ్‌బీస్) రూ.130.60వద్ద ఎన్ఎస్ఇలో ముగిసింది. ఎస్‌బిఐ గోల్డ్ ఈటిఎఫ్ కూడా రూ.134.70వద్దట్రేడ్ అయింది. హెచ్‌డిఎఫ్‌సి గోల్డ్ ఈటిఎఫ్ 0.10 పాయింట్లుపెరిగి రూ.134.90వద్ద ముగిసింది. ఇక కోటక్ గోల్డ్ ఈటిఎఫ్‌లు రూ.131.5486 వద్ద ముగిసింది. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ గోల్డ్ ఇటిఎఫ్ రూ.135.20 వద్దట్రేడ్ అయింది. ఇక సిల్వర్ ఈటిఎఫ్‌లయితే గోల్డ్ ఇటిఎఫ్‌లను మించిపోయాయి. నిప్పన్ ఇండియా సిల్వర్ ఈటిఎఫ్ 1.46శాతంపెరిగి రూ.256.22గా ఎన్ఎస్ఇలో ట్రేడ్ అయింది. టాటా సిల్వర్ ఇటిఎఫ్ కూడా 0.40పాయింట్లు పెరిగి రూ.26.02కి చేరింది. హెచ్‌డిఎఫ్‌సి సిల్వర్ ఈటిఎఫ్ 3.83పాయింట్లు పెరిగి రూ.256.50కి చేరింది. ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ సిల్వర్ ఈటిఎఫ్ కూడా 3.82 పాయింట్లు పెరిగి రూ.267.50 పాయింట్లకు చేరితే ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ సిల్వర్‌ఇటిఎఫ్ 3.93పాయింట్లు పెరిగి రూ.267.35కి చేరుకుంది. ముడిచమురుధరలు కొంతమేర తగ్గుముఖం పట్టడం, ద్రవ్యోల్బణ ఆందోళనలు లేకపోవడం వంటివి పెట్టుబడులకు స్వర్గధామంగా పసిడి, వెండి రంగాలే నిలిచాయి. ఇపుడు ఈటిఎఫ్‌లకు కూడా భారీగా డిమాండ్ పెరుగుతోంది.






## టాటాసన్స్ బోర్డు మీట్‌పై కార్పొరేట్ రంగం ఫోకస్

**ముంబయి, మే 25:** దిగ్గజ పారిశ్రామికగ్రూపు టాటాసన్స్ బోర్డుసమావేశంపైనే ఇపుడు ఇన్వెస్టర్లు, మార్కెట్‌నిపుణుల ఫోకస్ పెరిగింది. మంగళవారం టాటాసన్స్ బోర్డు సమావేశం జరగనున్నది. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్‌వరకూ విస్తరించిన టాటాగ్రూప్‌లో ఇపుడు అంతర్యుద్ధం జరుగుతోందన్నది నిపుణుల వాదన. దివంగత రతన్‌టాటా ప్రస్తుతం టాటా ట్రస్టుల ఛైర్మన్‌గా ఉన్నారు. 2024 అక్టోబరు నుంచి ఆయన ఈ పదవిలో కొనసాగుతున్నారు. టాటాట్రస్టులకే 66శాతం వాటాలు టాటాసన్స్‌లో ఉన్నాయి. బోర్డు సభ్యుల్లో మూడోవంతు సభ్యులను నియమించే అధికారాలు నోయల్ టాటాకు ఉన్నాయి. ఇపుడున్న సమావేశంలో టాటాసన్స్ సిఇఒ ఎన్‌చంద్రశేఖరన్‌పదవీకాలం పొడిగిస్తారా లేదా అన్నదే చర్చ నడుస్తోంది. 2017నుంచి టాటాసన్స్ ఛైర్మన్‌గా ఉన్న చంద్రశేఖరన్‌కు ఒకసారి పొడిగించారు. రెండోసారి పొడిగింపు అవసరం అవుతోంది. అయితే దీనిపై నోయల్‌టాటా స్పందన లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరితో చంద్రశేకరన్ పదవీకాలం పూర్తవుతుంది. అలాగే టాటాసన్స్ ప్రైవేటు సంస్థగా కొనసాగించాలా లేక స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్టింగా అన్నది తేలాల్సివుంది. టాటాసన్స్ అన్‌లిస్టింగ్‌కే నోయల్ టాటా ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే టాటా గ్రూప్‌నుంచి ఇప్పటివరకూ ఎలాంటి ఐపిఒ వార్తలు కూడా ఈ ఏడాది రాలేదు. వీటన్నింటి దృష్ట్యా నేడు జరిగే టాటా సన్స్ బోర్డు సమావేశం అత్యంత కీలకంగా మారుతోంది. నాయకత్వమార్పులు ఏమైనా ఉండవచ్చన్న ఉత్కంఠ వాటాదారుల్లో నలుగుతోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.